# భీమన్న
# కావ్యకుసుమాలు

ప్రథమ ముద్రణ

1957

ప్రతులు 1000

ప్రతులకు

నవ్యసాహితీ సమితి,
208, బోయగూడ,
విజయవాడ - 2.
సికింద్రాబాదు

దేశీ కవితామండలి

హక్కులు రచయితవి

ముద్రణ
అజంతా ప్రింటర్స్

# పరిచయము

నేను గ్రంథములకు సామాన్యముగా పరిచయ వాక్యములు వ్రాయు కోటిలోని వాడను కాకపోయినను మిత్రులు శ్రీ భీమన్నగారి అభ్యర్థనమును నిరాకరింపలేకపోతిని. నా కంటెను, నా గ్రంథముల కంటెను ఈయనయు, ఈయన కావ్యములును ఆంధ్రప్రదేశమున వ్యాప్తిలో నున్నవి. కాబట్టి ఈ కవిని పరిచయము చేయుట సాహసము. ఆయన కావ్యములను పరిచయము చేయుట యంతకంటె సాహసము. ఈ గ్రంథములో ప్రచురించిన కావ్యకుసుమములలో అనేకములు అనేక స్థలముల ప్రచురింపబడియే యున్నవి. కొన్ని మాత్రము నూతనములు. ప్రచురితాప్రచురిత ఖండ కావ్యము లన్నింటిని ఏకస్థలమున ప్రచురించుట చేత ఈ పరిచయ వాక్యముల యావశ్యకత కలిగినదను కొందును. శ్రీ జాషువా, భీమన్న గార్లును, శ్రీ ఉమర్ అలీషా వంటి వారును సాహిత్య క్షేత్రమున జాతిమత భేదములు లేవను సిద్ధాంతమునకు తార్కాణ భూతులు. సాహిత్యము ప్రపంచ సామ్రాజ్యము. అందు ప్రపంచమునందలి యన్ని భాషా రాజ్యములకును స్థానము కలదు. ఈ క్షేత్రమున యుద్ధ భయము లేదు. విజయకాంక్ష లేదు.

ఇక ప్రకృతము. శ్రీ భీమన్నగారు భావుకుడు, రసపిపాసి, సహృదయుడు. ఉదాత్త చిత్తుడు, ప్రకృతి పుత్రుడు, తత్త్వవేత్త, పై విశేషణము లన్నిటిని రుజువుచేయగల రచనలు ఇందున్నవి. ఈయనకు ప్రకృతియే తల్లియనియు, పాఠములనన్నిటిని ఆమె వద్దనే నేర్చె ననియు, బాల్యము నుండి ఎవ్వరి యాజ్ఞాశిక్షలకును బద్ధుడు కాడనియు ఈ క్రింది పద్యము సాక్ష్యమిచ్చుచున్నది:

నీరుగట్టి, మళ్లుగట్టి, నారుగట్టి,
కంచెలును గట్టి నన్ను పోషించరెవరు;
అడవి మొక్కను నేను; విశ్వావకాశ
వీథులం దిష్టమైనట్లు పెరుగుచుంటి.

మరియొక సాక్ష్యము:-

లేదు నాకు వ్యుత్పన్నత; వేదచయము
ఉపనిషత్తులు; వాని శాఖోపశాఖ
లేమి బోధించునో ఇంతయే నెరుంగ;
చదువులే లేని నాకు ప్రాజదువులేడ?

ఎందరిని బ్రతిమాలినను, తనకు సహాయము చేయలేదట! తన స్వయంకృషివలననే తానీ స్థితికి వచ్చినట్లును చెప్పుకొనియున్నాడు.

ఎందరినొ మైత్రికోసమై యెంచి, యెంచి,
పిల్చి, పిల్చి నేబ్బొబ్బలు పెట్టినాను;
ఎవరి పనిమీద వారు పోయెదరె కాని,
పృథివి నా యున్కి నేని గుర్తించ రేల?

ఈ ఖండ కావ్య సంపుటివలన ఈయన జీవిత విశేషములు కొన్ని తెలియగలవు. ఈయనయు, మిత్రుడును నొకేవిధముగ విద్యనభ్యసించినను మిత్రుని యదృష్టము కంటె తనది మెరుగయ్యెనని "అదృష్టము" అను ఖండికలో చెప్పుకొని యున్నాడు. మిత్రులతో నీయన చిన్నతనమున గోదావరీ తీరములందాడిన యాటలు మొదలయినవి గ్రంథమునిండ కన్పడుచున్నవి. చిన్నతనములో దీపావళి బాణ సంచాకు బలియైన బాల్యమిత్రుని గూర్చి వ్రాసిన "ఎలిజీ" పద్యములు హృదయమును కరగించుచున్నవి. ఆ మిత్రుడును తానును కలిసి యాడుకొనిన యాటలు మొదలైన స్మృతులు ఖండికకు ప్రాణమును గూర్చుచున్నవి. ప్రకృతి సర్వాంగసుందరియై ఈ కావ్యకుసుమములందు సర్వత్ర కనుపడుచున్నది. వివిధ ఋతువులందామె శోభ మొదలయినవి హృదయంగమముగా తెలుపబడినవి. కోకిల, వసంతము, మేఘములు, తుమ్మెద, మొదలయిన కవితా సామగ్రి ఈయన కత్యంత ప్రియ వస్తువులు. వీనియుల్లేఖ అడుగడుగునకును కన్పడుచున్నది.

ఈయన కవిత్వమున కాల్పనికయుగమగు ఈ శతాబ్దములోని ద్వితీయ తృతీయ దశకముల లోని కావ్యములందరి గుణములకు అనిర్దిష్టత, భావోల్బణత, కవి స్వానుభవ కథనము మొదలైనవి పూర్ణముగా కనబడుచున్నవి. అందుచే ఈయన ఆ కాలములో కావ్య ఖండికలను రచియించిన కవుల ప్రభావము కలవాడుగా కన్పడుచుండును.

దేశ దాస్యమును చిత్రించుచో కూడ ఈ యనిర్దిష్టత అన్యాపదేశము ద్వారా పొడసూపుచున్నది.

మబ్బుల నీరు లేదు, పవ
మానుని గుండెల చెమ్మలేదు, మా
దుబ్బుల యేరు సెండినది,
తూములు పూడెను, చేల సెర్లలో
గబ్బిలముల్ కులాయములు
గట్టుకొనెన్, ఇక సేద్య మేడ, మా
సెబ్బరి మస్గడల్ కడకు
చేరుసె, శాంతి సుఖమ్ము లబ్బునే?

"రహోరహస్సు" అను ఖండిక ఈ యనిర్దిష్టతకు పూర్ణోదాహరణము. ఒక్కొకచో మర్మకవితా విధానము కూడ ఈయన ఖండికలలో కానవచ్చును. ఈ విధమైన కవితకు అనిర్దిష్టతయే యొక గుణము. మహాకవి జీవితమును పొందవలెనను కోరిక నీయన రమణీయ ఫణితిలో పాడినాడు.

కోయిల పాడుచుండ, నవ
కోమల వల్లిక లాడుచుండ, అ
ధ్యాయము లన్నియున్ ముగియు
దాక సభాపతి వౌచు నన్ను నీ

తోయము వారి వెంట దయ
తో నడిపింపుము; నా సమాప్తపుం
గేయము నీవ కమ్ము, పాడి
గింపకుమీ అటు మీదటన్, ప్రభూ!

కవి హృదయమున జన్మ మృత్యువులకు భేదము లేదు. అందును మృత్యువే ప్రియతమము. మృత్యువు పునర్జన్మమునకు పూర్వరంగము, మృత్యుదేవతను తన ప్రేయసిగా తెల్పిన యీ వాక్యముల తిలకింపుడు.

పృథ్విపైబడి కన్ను విప్పినది మొదలు
మృత్యుదేవత నేను ప్రేమించినాను,
మ్రొక్కు కొలది నా శిరమును ద్రొక్కుకొనుచు
అంద కేగుచు నున్నదా యందకత్తె.

దైవము ఫలప్రదాతయైనను పురుషకారముపై నీ కవి కుమారునకు నమ్మక మతి గాఢము.

అగ్నిని భరించ గలదొక్క హాలహలమె,
ఆమె తప్ప నా కౌగిట కాగ రెవరు;
అంతకుని దున్నకే పెద్ద గంత కట్టి
చబుకు ఝళిపించు శక్తికి స్వామి నాదు.

ఈ కవి, తానాంధ్రుడై, యాంధ్రుని గుణాగుణములను బాగుగా గ్రహించిన వాడు. అట్లయ్యు, ఆంధ్రుని ఊహాగానమునకు జోహారు లర్పించుచున్నాడు.

దేశము జుట్టబెట్టి, తల
దిండుగ బెట్టుక నిద్రపోవు ఆ
వేశము తెల్గు వానిది, ప్ర
వేశము తక్కువ కార్యనైపుణిన్;

ఏ శిఖరాల వెంబడి గ
మించునో, ఏ శశిపై శ్రమించునో;
ఆశల కళ్ళెముల్ వదలి
యభ్రపు టంచుల స్వారి చేయునో!

పరమ కవిత్వ మందు ప్రతి
బాలుడు బమ్మెర పోతరాజె, సుం
దరతర గానమందు ప్రతి
తమ్ముడు తానొక త్యాగరాజె, స
త్వర వరదానమందు ప్రతి
వాడును అచ్చపు భోజరాజె, నే
డరయ నవాంధ్రమందు ప్రజ
లందరు రాజుల, రాజతేజులే.

భీమన్నగారు స్వాతంత్ర్య సమర యోధుడుగా ఇందు కనపడుచున్నాడు. స్వాతంత్ర్య సమరమున, అసహాయోద్యమమున పాల్గని రైతుబిడ్డలను తన కావ్యములందజరామరులను జేసినాడు. అందు పాల్గనిన యొక మిత్రుని చరిత్రను కన్నుల గట్టినట్టు వర్ణించినాడు.

చూచినా డత, డూహలు పూచినాడు;
పారతంత్ర్యము దుస్థితి కారణముగ
నిర్ణయించి, దానిని బాప నిశ్చయించి
ఉప్పు సత్యాగ్రహమ్మున నురికినాడు.

అట్లు దుముకుటకు పరిణామముగా–

మిత్ర పరిరంభములచే పవిత్రమైన
శిరముపై భారముగ లాఠి విరిగిపోయె;
నాగలిని, లేఖినిని కూడ నడిపినట్టి
కేలు దోయికి సంకెళ్లు కేలు మోడ్చె.

నాడు మా కళాశాల కంటి తడియార
లేదు, నేటికి చల్లారలేదు కొన్ని
యెదల యెర్రన; ఆ జనపదము లందు
నిండు వరిచేలు కడుపులు మండి యేడ్చె.

ఆతని కరుణాశ్రువులు నేల నంకురించి
దీన హృదయాల పూచిన తీగలయ్యె;
తన నినాదములే భారతమున నేడు
తరుణశక్తికి ప్రగతి గీతములుపాడు.

పై నుదహరించిన హృదయ విదారక భావములను స్మరించినప్పుడు నే నాకాలమునఁపడిన బాధ లుద్బుద్ధము లగుచున్నవి. గాంధీ మహాత్ముని హత్య విని వ్రాసిన ఖండికలో వారి మరణములో నిండియున్న భావి యాశ కూడ పద్యమున ప్రతిబింబించుచున్నది.

అది తుపాకిగుండని భ్రమించెదవు, సఖుడ!
బ్రతుకు తీరాంతరంపు టాహ్వాన మద్ది;
అటు కనుంగొమ్ము, చెవియొగ్గి ఆలకింపు,
మా ప్రగతి దీప మదె, గీత మదె, అంతడె!

ఆంధ్రమాత యనిన ఈయన కత్యంత గౌరవము. ఆమెను శ్రీ వాణీ గిరిజల రూపముగా కవి భావించినాడు.

వాణియ తీర వాటిక, భ
వానియె రాయల సీమ, శ్రీ తెలం
గాణము; పూర్ణ రాజ్యరమ
గా ముగురమ్మల మూర్తిదాల్చి, గీ
ర్వాణ పథమ్ములన్ గదలి
వచ్చితివే; జగమేలుకొమ్మికన్
రాణదలిర్ప, మానవత
రంజిల - ఆంధ్రమ, భాగ్యసాంద్రమా!

రైతే రాజ్యమునకు వెన్నెముక యను భావము గల పట్టులిందనేకములు గలవు. ఆంధ్రదేశమెట్లు ముగురమ్మల రూపమయ్యెనో, అట్లే రైతు త్రిమూర్త్యాత్మకుడని కవి గానము చేసినాడు.

ఎద్దుల దోలెడు నెడ నీశ్వరుండు,
విత్తనమ్ములు చల్లువేళ నజుండు,
పంట ప్రోవును చేయు పట్ల శ్రీశుండు,
మూర్తిత్రయీ రూపమును గొంట వీవు.

ఆంగ్లకవి యైన కోలెరిడ్జి పద్య విషయములను "Poetic thoughts are thoughts translated into the language of poetry" అన్నాడు. వర్ణన పట్ల భావము వెంట భావము స్రవంతిగా ప్రవహించును. ఎట్టి సామాన్య విషయమునైనను తన భావనాశక్తిచే నుదాత్తము చేయగల శక్తి ఈ కవికుమారునికి కలదు. కంటక నిర్వేదము, ముండ్ల కంప అను ఖండిక లిందులకు తార్కాణములు. పురుషకారము కంటె దైవము బలవత్తరమని ఈ క్రింది మాటలలో నీయన తెలిపినాడు.

ఉర్వి నాగతి నా చేత నుండెనేని
ముల్లుగా పుట్టియుందునా - పువ్వుగాక?

ఈయన తన చిన్నతనమున నొక బాలిక స్నేహము గల్గి దానినప్పుడే స్మృతి పథమునకు తెచ్చుకొనుచు భావ సుఖదుఃఖముల ననుభవించు చున్నట్లు కొన్ని ఖండికలు తెలుపుచున్నవి. నీవు-నేను, పరిశ్రాంతి, కలలు, ప్రేమలేఖ మొదలైన ఖండిక లిందు కుదాహరణములు.

నిన్నుగూడి నే నాడుకొన్నన్నినాళ్లు
మనసులో నీ తలంపె పుట్టినది కాదు;

... ... ...

ఎన్ని మధుమాసములు మన చిన్ని వలపు
తలపు మొగ్గల ముద్దాడి తనిసిపోయె.

... ... ...

విధి వినిర్వహణములోన వెడలిపోయె
పగు లెటులఁ, కాని రాత్రి యే పగిది గడచు?

... ... ...

రాత్రి లేకుండ నేనెట్లు బ్రతుకగలను?
రమ్ము నెచ్చెలి రాత్రికి రాత్రి వగుచు.

ఈయన పదహారణాలాంధ్రుడు. ఆంధ్ర రాష్ట్రమునకు పరితపించినాడు. మహాంధ్ర ప్రాప్తికి సంతసించినాడు. రాజకీయోద్యమ కారణముగ కష్టముల ననుభవించినట్లు కన్పట్టును. స్వాతంత్ర్యానంతరము రైతునకు కష్టములు తప్పునని తలచినాడు. కాని యట్లు తప్పక పోవుటకు విలపించినాడు. ఆంధ్ర దేశమును, అందలి పాడిపంటలను ఋతు ధర్మములను, నోములను, నేపథ్యములను, తుదకు బంతిపువ్వులను తలచి తలచి సంతసించినాడు. ఈయన వర్ణించిన గ్రామసీమల దృశ్యములు కడు రమణీయములు.

ఇది రైతాంగపు పువ్వు, శ్రామికులకున్
తృప్తిన్ బ్రసాదించు వే
ల్పిది; మా పల్లెకు నెల్ల నందనముగా
పేర్గన్నదీ బంతి పూ
పొదయే; కోయకు; కష్టకాలమున, రే
పున్ మాపు, మా యిండ్ల, మా
యెదలన్, క్రొంజడలన్, కటాక్షముల హా
యిన్ గూర్చు స్వర్గమ్మిదే.

తెల్గుతల్లి నీయన దర్శించిన విధమును చూడుడు.

ఎండవానల సందు నెడ నెడ పడు జల్లు
జిలిబిలి కెంబట్టు చీర గాక,
పడమటి కోన నేర్పడిన ఇంద్ర ధనుస్సు
జడ చుట్టలో పూల సరముగాగ,
మొయిలు రెప్పల క్రింద హాయల్లు మించెడి మించు
సొబగైన కడకంటి చూపుగాగ,
మూన మూనకు చాల ముద్దు ముచ్చట లీను
వరిచేలు కుచ్చెళ్ళ వరుసగాగ,

శిలల గరగించి పరతెంచు సెలలు, నదులు
పంటకాల్వలు, బోదెలు – పదసరోజ
మంజు మంజీర రవ సంభ్రమములుగాగ,
కొలువు తీర్చి పాలింపు మీ తెలుగు నేల.

మిత్రుడు స్వర్గీయ అడవి బాపిరాజునకు ''శశికళ''వలె ఈయన కొక యుపాస్య దేవత యున్నట్లు పొడసూపుచున్నది. ''నా భావ జగత్తు'' అను ఖండికలో నిది

స్పష్టముగ కన్పడుచున్నది. ఈమెను ''సతీ'' యనియు ''సఖీ'' యనియు వివిధ రీతుల పేర్కొను చున్నాడు. ఈ భావము రత్నమాల యను ఖండికలో స్పష్టముగా గానవచ్చును. ఈయన కర్ధనారీశ్వరుని యెడ భక్తి ప్రపత్తు లధికమున్నట్టు తోచుచున్నది.

తరుణి! నాకు పురాణ పురుషుల లోన
నచ్చిన వాడర్ధనారీశ్వరుండు;
తనువు నందర్ధ మర్ధాంగి కొసంగి
అలరు నతండు ద్వంద్వాతీతుడగుచు.

పల్లె పడుచునుద్దేశించి చెప్పిన యీయన వాక్యములు నండూరి వారి 'ఇంటింట పెడతారు యెంకి నీ పేరు' అను వాక్యమును తలపించుచున్నది.

అన్నపూర్ణలు పదివేలు నీ వడువునన్
జరియింతురు తెల్గు పల్లెలన్.

ఈయన రచనలో తాత్విక దృష్టి తరచు తలసూపు చుండును. విహంగవాదము అను ఖండికలో మన దేశమున సమసమాజముండుట యవసరమని ఈయన స్ఫురింప జేసినాడు.

కులము లే, దిక ముందు వ్యాకులము లేదు,
సమ సమాజ వసంత వాసమ్ము మాది.

బ్రతుకు కృషికెల్ల మృత్యువే ఫలము కాదు,
మృతి కితోధిక రమ్య జీవితము ఫలము.
విశ్వ సౌందర్య మరయ వైవిధ్యమందె
కలదు; కలదందె ఆనంద కారణమ్ము.

... ... ...

వెలుగునకు నీడ కలుగదు,
వెలుగేలేకున్న నీడ వెలయదు, ఎట్లున్
వెలుగే నీడకు మూలము,
వెలుగునకున్ బోవునీడ వెలుగైతీరున్.

బృందా రాధా సంవాదమను మిషచే నీ కవికుమారుడు ఆత్మ సాక్షాత్కార భావమును వెలిబుచ్చుచున్నాడు.

ఈ నిమిషమ్మునందు కని
పించును నాకు ప్రసన్న మూర్తి, యే
సూనమునందు, నే మధుప
సుందర యౌవనమందు, నే లస
ద్గానమునందు, నే వలపు
కన్నుల కోరికలందు, కోరు కొ
న్నా ననినంత; నాకు, మరి
నాథునితో నెడబాటు లేదికన్

అది విభ్రాంతిగ కొట్టివేయకుము, నా
థా యంచు నే బిల్చినన్
ఎదలో, "ప్రేయసి" యంచు తోడనె జవా
బిచ్చున్, వినన్ వచ్చు, నో
సుదతీ, కాంచగ వచ్చు నీవును సదా
జ్యోతిర్మయున్, ప్రేయసున్;
ఇదిగో, రమ్మిటు, కౌగిలింపుము ననున్
సేవింత మద్వైతమున్.

పై ఖండికలో భక్తి సిద్ధాంతమునందలి శేష శేషి భావము వ్యంగ్యముగా స్ఫురించు చున్నది. ఈ భావమును పాశ్చాత్య తాత్వికులు "Doctrine of Divine Spouse" అని యందురు.

ఈయన శైలి మొదలైన వానిని గూర్చి రెండు ముక్కలు. అది ధారావాహికము. అక్కడక్కడ ప్రతిపద సార్థక్యము కొంత కొరవడినను సమాసములు హృద యంగమములు. మచ్చునకు రెండు:

వనరుహ గర్భ గర్భిత న

వ భ్రమరీ భ్రమణ స్వరమ్మునన్.

... ... ...

నీరదశ్యామ వియోగ ధూమ పరి

సంహృత సంభృత రాగశాలిపై.

ఖాతరు, లుగసాను మొదలైన వాడుకలో నున్న యనేక పరభాషా పదముల నీయన వాడినాడు. అర్థకల్పన కీయన శబ్ద ప్రయోగవముల నొక్కొక్కచో స్వతంత్రించును. శాబ్దికునకు భయపడడు. కందము వ్రాసినవాడే కవి యన్నట్లు ఈయన కందపద్యములు రమణీయములు. ఒక్క యుదాహరణము:

విసవిస కుసుమాసవముల

పసిమిని ప్రాయములు భద్రపరచినవారే

కుసుమింతురు, మిసమింతురు

రసికాగ్రణి గణవరేణ్య రసరాజ్యములో.

ఆరంభమునందు చెప్పినట్లు ఈయన భావుకుడు, రసపిపాసి, ప్రకృతి పుత్రుడు, ఉదాత్త చిత్తుడు, తత్త్వవేత్త. ఇక సెలవు తీసికొందును.

హైదరాబాద్

కురుగంటి సీతారామయ్య

## పరామర్శ

లలిత మధుర భావ విలసితమగు ఈ ఖండకృతి సంపుటిని పరామర్శింపుమని మిత్రుడు శ్రీ బోయి భీమన్న నన్ను కోరి, నాకు గౌరవ మాపాదించినాడు. కృతజ్ఞుడను.

ఒక యేడాది క్రిందటి దాకా ఈయన కృతుల ద్వారా నాకు పరోక్ష మిత్రుడు. పేరులోని భీమత్వము రచనలోగాని, వాక్కులోగాని, మనసులోగాని, స్వభావములోగాని లేని సరసు డీయన.

ఈ కావ్యములో 70 ఖండకృతులు కలవు. ఒక్కొక్కటి ఒక్కొక్క అమృత ఘుటిక యనవచ్చును. ఈ కృతులు చదివినప్పుడు ''అమరుక కవేరేకం వాక్యం ప్రబంధ శతాయతే'' అను సూక్తి నాకు జ్ఞప్తికి వచ్చుచుండెను.

దీని లిఖిత ప్రతినే చూచు భాగ్యము నాకు కలిగినది. చిన్న చిన్న కవి సమయ ప్రసిద్ధములైనా వస్తువులైనా ఈయన సంపూర్ణ కావ్య వస్తువులనుగా తీర్చిదిద్దినాడు. బ్రహ్మ సృష్టికి ఈ కవి రససృష్టి కల్పించి గ్రథన కౌశలముచే తృణమును మేరువుగా పెంచి నిర్మించినాడు. సిద్ధహస్తుడైన శిల్పికి అసాధ్యమేముండును?

''దృష్టపూర్వా అపిహ్యర్థాః కావ్యే రస పరిగ్రహాత్
సర్వే నవా ఇవా భాంతి మధుమాస ఇవ ద్రుమాః.''

అని ధ్వనికారుడు శ్రీమదానంద వర్ధనాచార్యుడు చెప్పినట్లు సదా కనుపడు సామాన్య వస్తువులు గూడ రస పరిగ్రహము వలన క్రొత్తవిగా భాసించును గదా! మోడువడిన ద్రుమములు వసంతమున పూలతో కలకలలాడవా?

బీద కార్మిక కుటుంబములో జన్మించినను, భీమన్నకు సాహితీ ప్రతిభా సంపత్తి పూర్తిగా అబ్బి, కోటీశ్వరుడైనాడు.

వృత్తములు, గేయములు రెండును కడు చాతురితో నడిపించినాడీ కవి. తెలుగు నుడికారమున కీయన పెట్టినది పేరు. తన పేరు లోని భీమత్వము కావ్యములో ప్రతిఫలించు నను భయము చేతనోయన నెక్కడగూడ లాలిత్యమునకు భంగము కలుగనీయకుండ రచన సాగించినాడు. పూర్వజన్మ సుకృత పరిపాక విశేషము చేత లభించిన ప్రతిభ. గురుకటాక్షలబ్ధమైన వ్యుత్పత్తి. స్వయంకృషిచే సాధించిన అభ్యాసము ఈ మూడును భాగ్యవశమున భీమన్నకు లభించి, యీయన సౌజన్యము నీ కావ్య సంపుటిలో పరిమళింపజేసినవి. కవి హృదయ సౌందర్యము కావ్యమున చక్కగా ప్రతిఫలించినది. ఈ కృతికి చక్కని సార్థక నామధేయము నీ కవి యిడెను.

రస భావాలంకార ధ్వన్యాదులగు మహాకావ్య గుణములను ఖండ కావ్య సంపుటికి ప్రసాదించిన కవి నవ్యకావ్య జగత్సృష్టికర్త యనవచ్చును. అచ్చటచ్చట ప్రాంతీయ పదములను జోడించుటచే కృతి వన్నె మీరినది. ప్రాచీన లాక్షణికుల మార్గమునే

యనుసరించుచు, కొన్ని యెడల వానిని మీరి తన స్వాతంత్ర్య ప్రియత్వమును, దేశ స్వాతంత్ర్య ప్రియుడు గాన, కావ్యరచనలో గూడ నీ కవి చూపినాడు.

ఈయన స్వయం ప్రతిభా సంపన్నుడు గనుక, ''స్వయం ప్రభాదేవి''ని తన ఆరాధ్య దేవతగా అంగీకరించినాడు. ఆమెకు తాను తొడిగిన సచ్చిదానంద స్వరూపమును మంగళా చరణములో మూడు గేయములలో నిరూపించినాడు. తన నెవరును పెంచలేదని, అడవి మొక్కవలె యథేచ్ఛగా పెరిగి విశ్వమానవ సాౡత్రమును గడించుకొన్నానని స్వవిషయమును ''నీరుగట్టి, మళ్లు గట్టి'' అను పద్యములో నిరూపించినాడు.

సంస్కృతాంధ్ర సాహిత్య నిష్ణాతుడగు శ్రీ కల్లూరి సుబ్బారావు గారి నీ కవి కృతి పతిగా వరించి ''పితా శ్రుతం'' అను నార్యోక్తిని సార్థకము చేసికొనినాడు. కృతిభర్త, కృతి కర్త దేశ స్వాతంత్ర్యము కొరకు త్యాగమొనర్చినవారే. ఇరువురును విద్వత్కవులు. సుబ్బారావు గారి వైదుష్య విలసితమైన యుపన్యాసమును విను భాగ్యము నాకొకప్పుడు మదరాసు గోఖలే హాలులో కలిగినది. నాటి నుండి నేటి వరకును వారి యుపన్యాసముద్ర నాలో హత్తుకొని పోయినది. అది మాయకుండ యిప్పటి వారి శాసనసభా ప్రసంగములు దానికి దుమ్ము దులుపుచున్నవి. అట్టి పాండితీ ధౌరేయుల షష్టిపూర్తికి సమర్పింపబడిన యీ సప్తతి కృతులు అక్షర రూపములగుటచే, వారి పూర్ణాయువున కక్షరత్వము కల్పించు శుభోదర్కములుగా వెలసియున్నవి.

ఈ కవి సుబ్బారావుగారిని ప్రశంసించుచు వ్రాసిన పద్యము లనన్యాదృశములు. ''వీరావేశము దూసి, దేశరమకై వెన్నీక పోరాడి...'' అన్న పద్యము భీమన్న హృదయము విప్పారి బయల్వెడలిన పూజాకుసుమ మనవచ్చును.

''ఉజ్జీవము'' అను ఖండకృతిలో ప్రకృతి యాథార్థ్యమును వర్ణించి ఈ కవి ప్రకృతి నుండి మానవుడు నేర్వవలసిన గుణపాఠమును జాతికి బోధించినాడు. అందును

"ఎండిపోయిన వాపిక నుండి పోయి
తనువు మరచిన యొక పురాతనపు కప్ప
మరల గొంతెత్తి బెకబెక మనెడు నదిగొ
పబ్బమున నేటి తొల్కరి మబ్బుక్రింద."

అను పద్యముచేత "ఏతి జీవంత మానందో నరం వర్షశతాదపి" అను వాల్మీకి సూక్తిని భంగ్యంతరమున నిర్వచించినాడు భీమన్న. పరదాస్య శృంఖలలో దగులుకున్న జాతి బ్రతికి యుండిన నెన్నటికైనను జీవించును అను సత్యము కూడ వ్యంగ్య మర్యాదచే నిందు భాసించుచున్నది.

తన యిష్టదేవత యగు స్వయంప్రభా లక్ష్మి పార్వతీ సరస్వతీ రూపముగా భావించి

"రమ్ము దేవి! ఈ తెలుగు పొలమ్ములందు
లక్ష్మివై, తెలుగు పాఠశాలలను వాణి
వై, తెలుగు గేహములను భవానివగుచు"

అని తెలుగు నేలకు ఆహ్వానించినాడీకవి.

తొలకరి వర్ణించుచు "పవమానుని గుండెల చెమ్మలేదు" అని గ్రీష్మ వాతమునకు చక్కని తెలుగు నుడికారము నిచ్చినాడు.

"ఘనముల్ మృత్యువెకాదు జీవనమునున్ కల్పించెడున్ నీ పొల
మ్మున వర్షించెడు విప్లవమ్ముగ ప్రియాంబు ప్రావృడంభోదముల్"

అని జటిలమైన సమాసమును విసరి గర్జా విప్లవమునకు అనువైన పద బంధమును పొదిగినాడు. శ్లిష్టమైన జీవన శబ్దము ఎంతో సందర్భశుద్ధిని కల్పించుచున్నది. ఈ శబ్దము పలుతావుల వాడి యీ కవి సందర్భమునకు సొంపగు అర్థాంతరములను కల్పించినాడు.

ఒకచో బుట్టినవయ్యు రెండు మొక్కలు, చవిటినేల బడ్డది నశించును, సారభూమిని నాటినది వర్ధిల్లును. పరమాత్ముని బ్రహ్మాండోద్యానమున బుట్టిన రెండు జీవులు స్థాన బలా బలములచే పుట్టును గిట్టునని జీవుల అదృష్టమును గూర్చిన సత్యమును ''అదృష్టము'' అను కృతిలో నీ కవి అన్యాపదేశముగా వివరించి స్వవిషయమును గూడ చక్కగా సూచించి నాడు.

కాలప్రవాహపు భయంకారితను అపూర్వ దర్శనీయతను వర్ణించుచు; ''ఈ యనంత కాల కల్లోలినియె ప్రియురాలు నాకు'' అని చెప్పి – ''రాత్రి పగలను జోడు గుర్రాలపైని దౌడు'' తీయునామె వెంటబడి పోవుచుందు నని తన జీవిత పరిస్థితిని గూడ ఈ కవి ధ్వనించినాడు.

''నీవు–నేను'' అను ఖండకృతిలో భీమన్న తనకు అండగనున్న స్వయంప్రభ తన వెంట నంటివచ్చు ప్రాతశ్ఛాయవలె నుండవలె గాని సాయంకాలపు నీడవలె నుండి క్రమముగా తనను క్షీణింపజేయ గూడదని సూచించినాడు.

జీవితములో సుఖాశచే ఒడుదుడుకులను కష్టములను ఎదిరించుచు వర్తమానావరోధములను అతిగమించి పురోగమించుటయే జీవన రహస్యమన్న సత్యమును:

''మూగయై హేమంతమున నెట్ల జీవించి'' ఇత్యాది పద్య పాదములచే తెలిపి, స్వాతంత్ర్యోద్యమమున జాతీయ నాయకుల పరిస్థితి గూడ చిత్రించినాడు భీమన్న.

ఏ కులమందు బుట్టిననేమి, ప్రాకృతికమైన ఆకారమును జూడక ''హృదయాకృతి జూచి సమాదరింపరే'' అని లోకులకు సందేశమిచ్చి ''పేదకు పంచయిచ్చి, పృథివిన్ కలవానికి పాన్పువేసి'' అని చెప్పి అతిథులయెడ తారతమ్యము పనికిరాదని కూడ తన ''స్వప్నజీవి'' ద్వారా ఉపదేశము నిచ్చినాడీకవి.

''అగ్రామి''లో నన్యాపదేశమున భీమన్న రసగ్రహణ పారీణమైన భృంగము ''భేద మెంచక'' అన్ని పూలలో మధువును గ్రోలుటయే కాక పరోపకార పారీణమై తన్మరంద రసమును లోకులకు గూడ పంచి యిచ్చునని మహాత్ముల మనస్తత్వమును చిత్రించి ''కల్పితములైన సరిహద్దు గట్లను'' ''భంజించి'' ప్రకృతి పాదాబ్జ మధువు ననుభవింపుమని యుపదేశించి, ప్రకృతి – మానవ సౌందర్యోపాసన పట్ల దేశ కాలాది పరిమితులను పాటించరాదని అజ్ఞులను హెచ్చరించినాడు.

సర్వ దేవతోపాసనతో పాటు ''జనతా మహాశక్త్యుపాసనను జోడించి అదియే ''ఆనంద యాత్ర'' అని మోక్షతత్త్వములోని తత్త్వమును బోధించి ''మానవ సేవయే మాధవసేవ'' యను సత్యమును చాటినాడు.

''పారితోషికము''లో చిన్న చీమ ఉన్నతస్థాయిలో నున్న కోకిలకు కాన్క నీయగోరి–

''అందుండి కోకిలము ఇందాక దిగనేల
ఇందుండి నే నెట్ల అందాక పోవలతు.''

అనిచెప్పి చిన్నవారి దైన్యమును, వారికి పెద్దలయెడ నుండవలసిన గౌరవ భావమును తెలుపుచు భీమన్న ''సామాన్యముచే విశేష సమర్థనమును''చేసి అర్థాంతర న్యాసాలంకార ధ్వనిని స్ఫురింపజేసినాడు. అచటనే – ''సాగిపోవుటయే నా జన్మ ధర్మము గదా'' యని తన అభ్యుదయపథ గామిత్వమును వ్యంగ్య మర్యాదచే సూచించినాడు.

''ఆశ తీర్చని రూపు కన్నార చూచి
ఆదరణ నీని పేరు నోరార పాడి''

అని ప్రేమభిక్షలో భిక్షుకుని స్వరూపమును చక్కగా నీకవి చిత్రించినాడు.

'కాలముగదా, అది నిత్యవసంతమా? ప్రభూ,' అని, 'మహాకవి'యను ఖండ కృతిలో అదృశ్యమగు కాలప్రవాహపు మార్పును వర్ణించి దృష్టాంతముగా దృశ్యమగు వసంత మును పాఠకునికి జూపి, కాలము మారుచుండునను సత్యమును సప్రమాణముగా నిరూపించినాడీ కవి. ''ఊహను బుట్టి, కావ్యగతి నొంది, నవోదయు'' మైనానని చెప్పి తాను స్వయంప్రతిభచే అభివృద్ధి నొందినానని ఆత్మశక్తిని, విశ్వాసమును సగర్వముగా చాటుకున్నాడు కూడ.

''చీకటిని పిండి రంగులు చేసి''

అను పద్యమును సుమధురముగా ''చిచ్చింత''లో చిత్రించి, యీ కవి తన కళాభిజ్ఞత్వమును ప్రదర్శించుటయేకాక తన అభివృద్ధిని గూడ అతి కష్టించియైన సాధించుటకు పూనినాడు.

"రాజకీయ ఖైదీ"ని గూర్చి వివరించుచు:

"రామనామము గ్రోలుచు బ్రతుకు రామ
చిలుక కించుక పాలములో స్వేచ్ఛ లేదు,
కాడిగిత్తల వెన్నుపై గాయపరచు
మొరటు కాకికి లేదు పంజర మొకింత"-

యని లోకమున మంచికి చెడుగే యగును, చెడుగుకు మంచి యగునను లోక మర్యాదను నిరూపించినాడు.

"నాగలిని లేఖినినిగూడ నడిపినట్టి
కేలు దోయికి సంకెళ్ళు కేలుమోడ్పె"

అని చెప్పి యీ కవి రాజకీయ ఖైదీకి స్వాతంత్ర్యోద్యమమున కలిగిన పరాభవము నుగ్గడించి వాపోయినాడు.

"పేకు వగుదాక పోరాడి విజయమంది
మేలు కొల్పులు పాడి వైతాళికుండు
సుప్రభాతము పూర్తిగ చూడకుండ
కదలి తానును చీకట్ల కలసి మరలె"

అని గాంధీజీ నిర్యాణము తర్వాత "తీరాంతరము"లో వాపోయిన మాటలు పాఠకుని హృదయము కదలించి కరగించును. "జన పదాలె మన పథాలింక" అని బాపూజీ సందేశమును గూడ పాఠకుల కీ కవి యందించుచున్నట్లు తోచును.

"పచ్చిదిది మోయజాలదు విచ్చిపోవు" అని వ్యర్థ జీవకలశమును అభివర్ణించి అందులో అంచులరయునట్లు వచస్సుధ నించవద్దని వేడుకొని, విజ్ఞానియైన భీమన్న తన నిగర్వత్వమును సూచించి, ఎండు తీగలకు మంట, కన్నె తీవలకు జంట నిచ్చు వసంతాగమమును వ్యాజనిందచే దూరినాడు. "కవోష్ణ బాష్ప కంకణమ్ములతో నన్ను కదిపినాడు" అని రాతితో అనిపించినాడీకవి. ఇందు "కంకణ" శబ్దము సొంపైన

శ్లేషార్థము నిచ్చుచున్నది. ''కవోష్ణ'' శబ్దము ఈ కవి వ్యాకరణ విజ్ఞానమును స్పష్టపరచుచున్నది. ''బ్రతుకు కృషికెల్ల మరణమే ఫలము'' అని మరణము నాహ్వానించి అది ''అంతకుని దున్నకే పెద్దగంట కట్టు'' శక్తి కలది కనుక ఆమెనే ప్రేమించినానని చెప్పినాడీ కవి. జన్మచే తాను గౌరికి తమ్ముడైనను, కర్మచేత దుఃఖము లనుభవింతునని భీమన్న తన ఉత్తమ మానవ జన్మమునకు కలిగిన దుఃఖము కర్మఫలమని చెప్పినాడు. పార్వతికి ''మాతంగ కన్య'' అని కూడ పేరు గలదు గదా. ''పుట్టుట గిట్టుట కొరకే'' అను లోకోక్తిని సూచించి భీమన్న ''పొద్దు పొడుచుట గ్రుంకిపోవుటకె యైన పొడుచుటకు కారణమ్మేమి'' అని లోకులను చక్కగా సవాలు చేసినాడు తన ''వసంతోత్సవము''లో.

''వాసాంసి జీర్ణాని యథా విహాయ'' అను భగవద్గీతోక్తిని ప్రకృతికి అంటగట్టి ''శ్రావణ మను చీర గట్టుకుని'' దానికి కాలపు మార్పును చిత్రించినాడు సొగసుగా.

''ఆమె కంటికి తన కోర్కె లప్పగించి'' అని ''అతడు-ఆమె'' అను ఖండకావ్యములో ప్రేమైక జీవి ప్రవర్తనను వర్ణించినాడు. ఇందు స్వానుభవమును గూడ నీ కవి తెలిపినాడేమో యనిపించును.

''అతని దృక్కరమ్ముల నెల్ల నపహరించి
పగటినే రాత్రిచేసిన పర్వ దేవి''

అని సూర్యునితో తనకు అవినాభావమును చిత్రించుకొని ఆమెకు నిండు సూర్య గ్రహణత్వము నాపాదించిన యీ కవి యీ కృతిలో సమాసోక్త్యలంకార ధ్వనిని చక్కగా నిరూపించినాడు.

జన్మభూమియగు నాంధ్ర దేశమునకు కడుభక్తితో నంజలించి, ''జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'' అను వాల్మీకి వచనమును సార్థకము చేసినాడు. తద్వర్ణనములో భీమన్న తన సంస్కృత సమాస రచనా చాతురిని ''శ్యామలసస్య పుష్కరము, తదాశామకుట ప్రభాలసదుషస్సు మనస్సు మనోజ్ఞ గీతులన్, భావనోజ్జీవన జీవన ప్రణయ శిల్ప మహోదయ భాగధేయముల'' ఇత్యాదులచే సునిపుణముగా చూపించి కావ్యమునకు ఓజోగుణమును ప్రసాద గుణముచే మేళవించినాడు. ఇంత చెప్పి:

''ఆవేశము తెల్గువానిది, ప్రవేశము తక్కువ కార్యనైపుణిన్'' అని తెలుగు వాని ఆరంభ శూరత్వమును చాటినాడు కూడ.

భీమన్న ''దొంగలజంట''లో అపూర్వమైన దొంగ పాత్రను అమేయముగా సృష్టించి నాడు. అదియే ప్రియురాలి కొప్పులోని పువ్వును దొంగిలించి, హృదయమును కొల్లపోవుట, ''పుష్పవతివైతి విప్పుడు పూవుబోణి'' అని ఆమెను శ్లేషచే పరాచకము లాడు నా దొంగ.

''తృణ పుష్పము''ను కావ్య వస్తువుగా స్వీకరించి భీమన్న దానిని తనతో పోల్చుకొని, అన్యాపదేశముగా ''నీవలె నేను గూడ అవనిన్ జనియించితి గౌతమీపద శ్రీ వికసించు తీరమున'' అని వర్ణించినాడు. గడ్డిపూవే కాని, అంతకన్న నీచమైన వస్తువే కాని కవి కలమునకు తట్టి నప్పుడది సరస సుగంధ సువర్ణ శలాక కాకమానదు.

''కవి భావుక భావ్యమానం, తన్నాస్తి యన్న రసభావ ముపైతి లోకే'' అను దశరూపక కర్త ధనంజయుని మాట నిప్పట్ల రసికులకు తలపింపజేసినాడు భీమన్న.

కృషిని ప్రశంసించుచు నీ కవి కర్షకుని చాతుర్యమును,

''వనలక్ష్మి తొలుదొల్త నినె పల్కరించు,
ఆర్తవయోగ్యమై అన్ని కాలములు''

అని కర్షకునికి ఋతువులన్నియు నధీనమున నుండుననను సత్యమును చాటినాడు. ''ఆర్తవ'' పదమును వాడి తన పాండిత్యమును చవిజూపినాడు. రైతు త్రిమూర్త్యాత్మకుడని ''ఎద్దుల దోలెడునెడ నీశ్వరుండు'' అను మంజరిలో, నిరూపించినాడు. ''ప్రగతి బెంచుచు తాను పస్తుండు గేహి'' అని మరియొక చోట రైతుకు గల గృహస్థ ధర్మమును, ఆతిథ్య మర్యాదను సూచించినాడు. ''సర్వోదయము వంక సాగు నీవింక'' అని రైతుకు ఉపదేశ మిచ్చినాడు.

''మానవ జాతి మాది, నరమాంసము నంజిన నాటి వారి సం
తానముగా నిరూపణ మొనర్చుచు నుందుము నేడు''

అని పావన మానవజాతి నేడొనర్చు అన్యాయములను అన్యాపదేశముగా నీ

కవి ''శిశిరము''లో పేర్కొని నేటి మానవుల కృత్రిమవర్తనను నిరసించినాడు.

''ఒక్కచేత నిశీథిని నొక్కచేత
దివసమునుబట్టి ముద్దాడు ప్రకృతి''

అని సంఘము లోని ఉచ్చ నీచ భావములను తెగడుచు ''ప్రతీక్షణ''ను గూర్చినాడు భీమన్న. అందులోనే ఒకడు ప్రభాకరుని వలె కాయకష్టము చేసి రాజును పోషించు చున్నాడని చెప్పి రాజశబ్దమును చక్కగా శ్లేషించినాడీకవి.

''నా బ్రతుకు చూచి, నను చూచి నా పటమ్ము
వ్రాయ బోకుము,-'' అనియు,
''కంటక శిలామయావని గర్భమందు
రత్న రాసులుండు-'' ననియు

''నీటగు కాలిబాటలో అడుగున తృణ సుమము లడగియున్న'' వనియును ''చిత్రలేఖనము''లో చెప్పి భీమన్న కేవలము ఆకార దర్శనముచేతనే మానవుని హృదయ సౌందర్యమును చూడజాలవు అని ఆత్మ విచారమును సలిపినాడు.

''విహంగవాదము''ను వ్రాసి యీ కావ్య సంపుటి కంతటికి భీమన్న నాటకీయత సంతరించినాడు. ఇందులో విహంగము లన్నియు పక్షిజాతికే చెందినవి. వానిలో నుచ్చ నీచ భావము పరిసరములను, అభ్యాసములను, కర్మలను బట్టి యేర్పడును గాని ప్రతియొక్క పక్షియు నొక్కొక్క విషయమున నారితేరినదై లోకమున కావశ్యకమగునని చెప్పి మానవులు గూడ నంతే యను సత్యమును వ్యంగ్య భంగిని నిరూపించుచు:

''రమ్ము కాకము, రమ్ము వడ్రంగి పిట్ట'' అనియు,

''తెగలు వేరైన నగు గాక ఖగ కులమ్ములొక్కటే జాతి-
అభిరుచి భిన్నమగుటచే వృత్తులు భేదమయ్యె'' అనియు పేర్కొనినాడు. ఇచట భేద శబ్దము విశేషణముగా వాడుట స్వాతంత్ర్య మూలము.

"ఒక్కడే యధినేత కా డుర్వికెల్ల
అంద రధినేతలే శక్తి ననుసరించి" అనియు,
"లేదు మాకు వివాదమ్ము లేవు మాకు
స్వపర నీచోన్నత భావమ్ములు – కులము లేదిక"

అని చెప్పి సమసమాజమును నిర్మించినాడు కవిబ్రహ్మ భీమన్న.

"పరీక్ష"లో ప్రేయసితో "జీవితమ్మొక పరీక్ష సుమా" యని చెప్పి, ప్రశ్నలన్నియు తెలిసినట్లుగనే యుండి తెలియవు కనుక జీవిత పరీక్షలో నెగ్గుట కష్టమని భీమన్న తన అనుభవమును స్పష్టపరచుచు "తెలియవు ప్రశ్నలున్ పగటి దివ్వెల వోలె పరిస్ఫు టమ్ముగా" అని జీవిత పరీక్ష ప్రశ్న పత్రమును చిత్రించినాడు. జీవితమును దిద్దుకొనుటకు "జయదేవ దంపతులు, వశిష్ఠ యుగ్మకము, గాంధీ మిథునమ్ములను ఒరవడి జేసుకొనవలెనని, ప్రేమైక జీవులకు, తత్త్వైక జీవులకు, ప్రజాసేవా పరాయణులకు వరుసగా ముగ్గురు దంపతులను జూపి సందేశమిచ్చినాడీ కవి. ఇచట "వశిష్ఠ యుగ్మకము" అనుచోట "యుగ్మక" శబ్దము, "మిథునము" అను నర్థములో స్వతంత్రముగా వాడినాడు. ఇంతియే గాక నీ ఖండికలో నచ్చటచ్చట "ఉద్యద్దీవ్యదుద్వృత్తిగా, స్వంతము, భిక్షురాలు, ప్రసన్నవభావము" మొదలగు స్వతంత్ర ప్రయోగములను కవి చేయుట యీతని స్వాతంత్ర్య ప్రయత్వము భాషలో గూడ చూపబడినదని తెలియనగును.

"చెట్టు–పిట్ట"లో ప్రేమబంధమును గూర్చి ముచ్చటించి భీమన్న "పరమ శివాను రక్త యగు పార్వతివోలె" తపించుచున్నదని చక్కని ఉపమానమును చూపినాడు. ఇట "తపించుచున్నది" అను క్రియ తపస్సు చేయుచున్నది అను నర్థమున వాడుటయు, "చెట్టువు మారి పిట్టవై" అను ప్రయోగమును ఈ కవి స్వాతంత్ర్య ప్రియత్వమునే చాటు చున్నవి.

"కోష్టి–ఫలీ" అను సంస్కృత సూక్తిని "ఎట్టి సఫలతకు నైన మూలము శ్రమయే" అని "శ్రమ–సఫలత" అను కావ్యమున సమర్థించి నాడీకవి. ఇచట గూడ "ఏప్రకామన రగులుచు" అని స్వతంత్రముగా ప్రయోగించినాడు.

"తత్-తత్త్వమ్" అను కావ్యఖండికలో తనకు శాస్త్రములు, వేదములు తెలియవని చెప్పికొన్న భీమన్న "చదువులే లేని నాకు ప్రాజదువులేడ?" అని పామరతత్త్వమును చూపించి నాడు. ప్రకృతిలో పరమాత్ముని జూచి మురిసిపోయి తాను:

"నిన్నెరింగితి నన్నెరింగితిని, స్వామి,
ఇంతకన్నను వేదాంత మేమి నాకు?"

అని ఆత్మ పరమాత్మ జ్ఞానమును ఒక్కమాటలో తెలిపినాడు. ఈ మాటచే తత్వ జ్ఞానము యొక్క పరాకాష్ఠ నీత డందుకొన్నట్లు మనకు స్పష్టమగును.

"విస్మృతి ద్వారబంధాలు విప్పుకొనుచు
వెలుగు చీకట్ల మధ్య పర్వు లిడుచుంటి"

నని యీ కవి "మరపు"లో తన జ్ఞానాజ్ఞానమార్గ గమనమును చక్కగా దిద్దుకొన్నాడు.

"తూనీగ"ను చూచి:

"తుమ్మెదలు పద్మ మందిరములను వెదకగా నీవు ముండ్ల కంచెను వెదకుదువు. వానివలె నీకు గానము రాదు. సరసత లేదు. సౌందర్యము లేదు. అట్టి నిన్ను ఎట్లు గైకొందు" నని చెప్పి అరసికునికి సంఘములో తావులేదను సత్యమును నిరూపించినాడు భీమన్న. తూనీగను పిల్లలు (అజ్ఞానులు) ఆటవస్తువుగా చేసికొందరని "క్రీడకై నిన్నెచేరు నాప్రియ తనూజ" అనికూడ చెప్పి సరసత లేని వానికి సంఘములో నెట్టి గౌరవముండునో తెలిపినాడు.

భీమన్న తన సకియకు "ప్రేమలేఖ"ను వ్యంగ్య భంగిని వ్రాసినాడు. ఈ కృతి ప్రతిపద రసస్యందిగా నున్నది. "మల్లెతీగ మొగ్గతొడగక కూరుచున్నది, – రమ్ము" అని ప్రేయసికి లేఖ వ్రాయును భీమన్న.

వర్షాకోకిలను సంబోధించి

"కుంభ వృష్టికి విభీకర మేఘ గభీర గర్జ
కాయువు నరచేతబట్టి యెటులుంటివో చీకటి చీకు చింతలన్"

అని వాపోయినాడు. ఇచ్చట ''ఇంద్ర ధనుస్తటినీ తటిల్లతల్'' అని ఇంద్ర ధనుస్సును తటినితో పోల్చినాడు. ఇది అపూర్వ కల్పన. అందముల రాశి.

''కంటక నిర్వేదము''లో పూవు – ముల్లు ఒక్క తల్లికే జన్మించినను వానిపై ప్రజలకుగల ఆదరములు పూర్తిగా వ్యతిరేకమని దుష్టశిష్టశక్తుల వైశిష్ట్యమును లోకులకు వ్యంగ్య భంగిని చాటినాడు.

లతను కాంతగా రూపణముచేసి ''లతా లతాంగి'' యని, భీమన్న తాను గండు కోయిలయై సంబోధించుటలో ఆయన హృదయ సౌకుమార్యము పరిమళించుచున్నది.

పురుషోత్తముడను తన మిత్రుని మరణమును గూర్చి ఒక ఖండ కృతిలో వాపోయి నాడు భీమన్న. మిత్రుని పూర్వస్మృతిని తలపోసినాడు.

''ఆదిత్యస్యోదయం తాత తాంబూలం భారతీ కథా
ఇష్టా భార్యా సుమిత్రంచ అపూర్వాణి దినేదినే''

అను సూక్తిని ఈ కృతిచే లక్ష్య సమన్వితము చేసినాడు. ఈ కవి యిందు:

''స్వాతంత్ర్యమ్ము లభింపదో నరుని వాంఛాసిద్ధికీ పృథ్విపై''
''చెలి! పూరింతును కోష్ణ బాష్పములతో స్మృత్యర్థ కాసారముల్'' మొదలగు రమ్య భావములను చిత్రించినాడు.

సెలయేరు పాడిన గానమును వర్ణించుచు ఏటికి వ్యక్తిత్వము కల్పించి ''నీ యొకొక్క చిన్కు నుండి నాలో నాకొక్క వీచిక యుద్భవించు''నని తన భావనా వీచికలను సృష్టించి భావుకులను రంజింపజేసినాడు కవి.

''మధుర గతి నీవు......
బ్రతుక బ్రతుకెల్ల నీ కృతజ్ఞత వహించు''

నను పద్యములో సెలయేటి నీరజములు దాని హస్తములుగ రూపించి శ్లిష్టమైన 'జీవన' శబ్దమును చిత్రగతిని తీర్చినాడీ పద్యమందు. ''జీవన నవ్యసుధ''యట. ఇట్టి వెన్నో అర్థవత్పద ప్రయోగము లీ కృతులలో కొల్లలుగ కాన్పించును.

"బోదె గట్టున" గడ్డికోయు నొక బాల నీటిలో తన ప్రతిబింబమును చూచి "నీల నీరద సాధాంతరాలలోన వరుణ గురునొద్ద నృత్యమ్ము గరచుచున్న మించు కన్నియ ప్రతి బింబించినదా" అన్నట్లు తనకు తాను ఉత్ప్రేక్షించుకొన్న నాయికను కావ్యపటమున చిత్రించి నాడు భీమన్న. ఈ కవి వర్ణనలో భావనకు మేరయుండదను విషయము:

"కోయు కొలదియు మొలకెత్తు కోమలంపు
పల్లవములనే యాకలి చల్లబడునొ.
పాడు కొలదియు రేకెత్తు పాటలోని
హల్లకములనే యుల్లము తల్లడిలునొ"

అను పద్యములో ప్రకటించినాడు. ఈ పద్యమున శబ్దార్థాలంకారములు, రసభావ ములు చిప్పిలుచు సహృదయ హృదయాంగణమున రసానంద చంద్రికలు వెల్లి విరియు చున్నవి.

దేశమునకు స్వాతంత్ర్యము లభించుటకు పూర్వము దాస్య విముక్తిని కాంక్షించిన భీమన్న తనను (దేశమును) చిలుకగా నెంచుకొని "పంజరములో చిలుక"ను వర్ణించినాడు.

"పారతంత్ర్యములో బ్రతుకట బ్రతుకె
రెక్కలుండియు లేని బక్క జంతువుగ
కోర్కెలుండియు లేని కువలయమ్మట్లు
పడియుంటి నేటికీ పంజరమ్మందు."

అని తన పరతంత్ర వస్తు స్థితిని మంజరిలో తెలిపినాడు. ఇది చదువునప్పుడు నాకు "వనజ భవుండు కోపమున వాహనమైన మరాళ భర్తకున్" అను భర్తృహరి పద్యము జ్ఞప్తికి వచ్చినది.

తనను ముండ్ల కంపతో పోల్చికొనుచు భీమన్న "నన్ను వలెనె నిన్ను ప్రక్క కీడ్చివైచినది జగము" అని చెప్పినాడు. ఇంకను:

"గుర్తులేని లోకము తన్నినది కడకు"

అని చెప్పి తిరిగి నిన్ను:

"కమ్మ తావుల జేర్చును గంధ వహుడు"

అని భావి శుభమును సూచించినాడు. ఇచట తావులు అను బహువచన శబ్దముచే సూచితమగు అతి మనోహర శ్లిష్టార్థము ఈ కవి సువర్ణ రచనకు తావిని గూర్చుచున్నది. ముళ్ళ కంపతో పోల్చుకొన్న తాను మాత్రము "మలినరుద్రవాటి చెంత" నుండి పోదునని వాపోయి ఈ కృతిలో పూర్వము సంఘము వెలివేసిన తెగల గతులను చక్కగా చిత్రించినాడు. ఇందు "మరచి" అనుటకు "మరాచి"యని స్వతంత్ర ప్రయోగము చేసినాడు కవి.

"శ్మశానలక్ష్మి"లో శ్మశానమును సుందరముగా దర్శించి, తన బాల్య స్మృతిని నెమరు వేసికొనుచు గతములుపాడి భావుకుల హృదయముల చలింప జేసినాడు.

జీవిత భారములకు తావులేని ఆనంద జగత్తు భీమన్న "భావ జగత్తు".

దేశాంతరమందున్న వ్యక్తి జన్మభూమిని తలచుకొని:

"పగలు పనిపాటలందు నిబ్బరము గూర్చు
రేలు కలలందు సహజ సంతృప్తి నొసగు
చాల దవ్వయ్యు నాకతి సన్నిహితము నా జన్మభూమి"

యని దానిపై తనకుగల స్వర్గాధిక ప్రేమను సూచించినాడీకవి.

అన్నిటికన్న "పల్లెబ్రతుకు" శ్రేష్ఠమను సత్యమును "గ్రామసీమలు ప్రేమ పూరము" లన్న మాటతో వెల్లడించి అచటి త్రిసంధ్యలను గూర్చి:

"అనటి తోటలలోని అరుణోదయములు
మామిడి తోపుల మధ్యాహ్నములును,
సరసి తటమ్ముల సాయంతనములు"

చాల మనోజ్ఞముగా నుండునని పల్లెటూళ్ల పటమున ప్రకృతిని చిత్రించినాడు. ఆ ప్రశాంత సంధ్యా శోభ నీక్షించవలెను. దీనిచే ఈ కవి పట్టణ వాసులను పల్లెటూళ్ళకు మార్చు గాంధేయ ఉద్యమమును సాగించుచున్నాడా యని తోచుచున్నది.

భీమన్న తన కవితా సామగ్రియంతయు మూటగట్టుకొని తెచ్చి "కృష్ణాన్వేషణ"లో గుమ్మరించినాడా యన్నంత మనోజ్ఞముగాను, మహాకావ్య లక్షణ యుక్తముగాను గోచరించు చున్నదది. కృష్ణుని వెదకు రాధకు బృందావనము చేయు ఉపదేశమిది. ఇందు చక్కని సంస్కృత సమాసాలు-

"సమీప సరత్సరి త్తట శ్రీవిలసత్తరంగ సుఖ జీవనముల్"
"నిర్ఝరీ ప్లావిత సైకత స్థలము"
"జ్యోత్స్నాకరోదయ శుభ్రాంబర భూషితాంగి"
"తత్సరీత సుమనో మధుమత్త మరుద్వయస్వినీ ఫుల్లకరాబ్జ మాలికలు"
"వనరుహ గర్భ గర్భిత నవ భ్రమరీ భ్రమణ స్వరమ్ము."

ఇత్యాదులెన్నో సుందరముగా కూర్చి కావ్యమునంతయు ఓజః ప్రసాద గుణ ద్వయముచే శోభింపజేసినాడు భీమన్న. "కౌగిలింపుము ననున్, సేవింత మద్వైతమున్" అనిచెప్పి, రసానందము అద్వైత బ్రహ్మానంద సబ్రహ్మచారి యని నిరూపించినాడీ కవి. పువ్వులలో, మధుపములలో, గానములో, వలపులో, నానా వస్తు సందోహములలో నెల్లెడ కృష్ణుడు కన్పించినాడని చెప్పి, యాతని సర్వాంతర్యామిత్వమును చాటినాడు. బృందావని తన హృదయమును విప్పి చూపగానే రాధికకు బ్రహ్మాకారమ్మగు తేజమొక్కటే అన్నిట ప్రదృశ్యమైనదట. ప్రణయియైన మధుపము జీవితమును పువ్వులో నుండి ధూళి గ్రమ్మిపోగా కులుకుచున్న పువ్వును వ్యాజనిందచే వర్ణించుచు నీ కవి బృంద ముఖమున "ప్రణయేశుండు గతించినన్ ప్రణయి భావంబిట్లు రంజిల్లునే" అని తెగడినాడు. ఇందు కులటా వృత్తాంతము వ్యంగ్యముగా గోచరించును. "మరచితివేము విశ్వవిభు, మావిభు, గోవిభు, గోపికావిభున్" అని శబ్దాలంకృతిని చమత్కరించినాడీ కవి. ఇత్యాదులెన్నియో యీ

ఖండకృతిలో మనము చూడవచ్చును. కాని ''ఊర్మిక్వాణ నిక్వాణ'' అని ప్రయోగించి భూషణ రవమునకు ప్రత్యేకముగా వాడు క్వాణ నిక్వాణ శబ్దములను ఊర్మిరవమునకు వాడుటయే గాక యీ కవి యేకార్థములగు క్వాణ నిక్వాణ శబ్దములను, పునరుక్తిని పాటించక, స్వతంత్రించి ప్రయోగించినాడు.

''కుంకుడు చెట్టు''ను అపూర్వ కావ్య వస్తువుగా గైకొని దానిని సొంపుగా చిత్రించి నాడు భీమన్న. ఇందు తన గ్రథన కౌశలమును ఆనంద వర్ధనుడు చెప్పినట్లు కనబరచి నాడీకవి.

హేమంతమున పూచి కాయు నీ చెట్టు క్రింది కాయల నేరునప్పుడు వసంతాదిలో మామిడి పిందెల నేరునట్లు గోచరించునట. కవి కిది హేమంతమ్మైనను కుంకుడుకు మాత్రము వసంతమేయట. కాయ చేదై చిన్నదైనను సత్య శౌచములు గల సాధువట లోకమునకు. హృదయము, కోమలము, సుధారసవంతము, శరచ్చంద్రికాధవళమ్మై నరుని మేధస్సునే పరిశుభ్రము చేయునట కుంకుడుకాయ. దీని యెడద లోక సంసేవన శ్రీకరమట. ఎంత ధ్వన్యర్థ గర్భితముగ నున్నదో ఈ కృతి చెప్పనలవికాదు.

''మనసు గుర్తింప జాలని మంద బుద్ధి
విశ్వసాహితి కర్థమ్ము విప్పుటెట్లు''

అని ప్రకృతిలోని మూగ వేదనను గుర్తించలేని మానవుని అసమర్థతకు వాపోయినాడు భీమన్న తన 'మేకపిల్ల – పూలమొక్క''లో.

''మా పల్లెకు నెల్ల నందనవముగా పేర్గొన్నది బంతిపూబోద'' అని ''బంతిపువ్వు''లో తెలుగు పల్లెను చిత్రించినాడీ కవి.

శ్రావణోదయము నందలి ప్రకృతికి – వానతోకాయు ఎండ కెంబట్టు చీరయని, ఇంద్ర ధనువు ఆమె జడలో పూలదండ యని, రెప్పల వంటి మేఘముల క్రింద మెరయు విద్యుత్తు కటాక్షమని, పండిన వరిచేలు ఆమె చీర కుచ్చిళ్లని, నదీ ఘోషము మంజీర శింజితమని వర్షాకాంతను చక్కగా అలంకరించి తీర్చినాడీ కవి. ఈ ఖండ

కృతి యంతయు మనోజ్ఞముగా నడచినది, ద్విత్వమును సంయుక్త పదముతో వాడి భాషలో స్వాతంత్ర్య ప్రియత్వమును వెల్లడించినాడు.

"తొలి పైనము"లో చక్కని ఉత్పల మాలిక "ట్ట" ప్రాసములో 20 పాదములు నడిచి యాతని కవితాధారకు వన్నె తెచ్చినది. అందు సొంపైన పద ప్రయోగములు: "పట్టినదెల్ల వేణువుగ", "ఏ చట్టము లెక్కసేయక", "ఉషస్సఖి", "సుందర వికస్వర గాన కళాస్రవంతి", "గట్టులు పార్లుచున్", "విచిత్ర సృష్టులకు మోసులు దిద్దు దరస్మితము" ఇత్యాదు లనేకము లిందు చూపట్టెడిని.

"వెలుగునకు నీడ కలుగదు,
వెలుగే లేకున్న నీడ వెలయదు; ఎట్లన్
వెలుగే నీడకు మూలము;
వెలుగునకున్ బోవు నీడ వెలుగై పోవున్".

అను తత్త్వార్థ బోధకమగు కందమును "నీడ"లో సృజించి భీమన్న విశ్వవేదాంత మును వ్యంజనా వ్యాపార సంస్కృతాంతఃకరణుడై భావుకులకు తెలిపినాడు. ఈ పద్యమున మాయను నీడకు, చిత్స్వరూపమైన పరతత్త్వమును వెలుగునకు పోల్చి రెండును సనాతనములు – శాశ్వతములు, జ్ఞానమును చేరు మాయ వెలుగు చేరు నీడవలె తన్మయత్వము నొందును అని "భ్రమర కీట" న్యాయమును గూడ తెల్పుచు, విశిష్టమైన ఔపనిషదా ద్వైత తత్త్వమును బోధించినాడు భీమన్న. ఈ ఖండకృతి ఎల్లెడలను ఇట్లే గోచరించును.

"ఉత్తర దిక్కులో" అను పద్యము నందు జలదమును మామిడి చెట్టుగాను, తుంపురులను పూగుత్తులుగాను, ముత్తెపు గొడుగుగాను, సొంపుగా పలికినాడీకవి. "ప్రేమ శిలయౌ చానవోలె" ఈతనిని "నీడ విడజాల"దట.

"మాతోట"లో ఇసుక గుంటల నుండి నీళ్ళు తోడిపోసి పెంచిన మొక్కలు పెద్దవై పల్కరించవని, పదారేండ్లు దాటిన బిడ్డలకు మాతాపితరులు వెగటౌదురను సత్యమును చాటినాడు భీమన్న. "సేవ జేయించు కొనుటయే జీవికైన నైజగుణము" అని మానవుల ప్రభుతా కండూతిని చక్కగా వర్ణించినాడు. ఈ కృతి నెల్లెడలను

మానవుల కుండదగిన మాతా పితృభక్తిని, మానవ మనస్తత్త్వమ్మును చిత్రించినాడు. ఇందు ''భవిష్యతు'' అను పదము ప్రయోగించి భాషా స్వాతంత్ర్యమును చూపినాడు. ''సంగోరు'' మున్నగు చక్కని తెలుగు నుడులు వాడి కృతికి సొంపును చేకూర్చినాడు.

''రత్నమాల''లో భీమన్న ముద్దులలుకు సరస భావములు, మాటలు పొదిగి మూటలు మూటలుగా రసానందములు సహృదయులకు పంచి యిచ్చినాడు. తెనుగులో ''తునా తునకలు'' అను ప్రయోగమునకు ఈడైన సంస్కృతపు నుడికారమును ''భిదా భిదలు'' అని సృజించి విద్వాంసుల తలలూపింపజేసినాడు. ఈలాగే ''వసంతమును గుత్తకు గైకొని'' మున్నగు నుడికారముల సామాన్యములు. ఈయన ''యెదనే గాలిపటము'' జేసి యాడించినాడీ కృతిలో. ''గడియారపు ముల్లు బాపతో'' అను రెండు అపభ్రష్ట హిందూస్థానీ శబ్దములను ''ముల్లు''తో కూర్చి పాఠకుల యెదలోను, శ్రోతల కర్ణముల లోను ఆనంద శలాకను దూర్చినాడు భీమన్న. ''కూటికి, గుడ్డకున్ గుడిసెకున్'' అను ముద్దు ముద్దు తెనుగు సుద్దులు పలికినాడు. ''పోటి పోరాటము లేని నా హృదయ రాజ్యము పంచుము విశ్వమంతటన్'' అని ప్రేయసికి వశము జేసిన తన హృదయమును, అంతలో తృప్తినందక, మందికి పంచి యిమ్మన్నాడు. ''భయము, బాధలు లేని కుటుంబమును'' నిర్మల మన్నాడొక చోట సత్యముగా. భవిష్యత్తు నెరుగని జీవితములో ''ఉర్విన్ గర్వముల్ చెల్లునా?'' యని యుపదేశించినాడు. ''రేపును'' చేతబట్టి ''భవిష్యత్పక్వాపక్వ ఫల పీయూషమును'' ''ధాత్రిన్ స్వర్గ సౌఖ్యార్థమై'' ఈ కవి పంచగోరి అందరికి ''సశరీర స్వర్గ సుఖము సమకూరజేయు'' ఔదార్యమును చూపినాడు. ఇది యంతయు ''సర్వోదయ సృష్టి'' యనియే భీమన్న విశ్వాసము. ఇదియే యతని కర్తవ్యమట. కావ్యకర్త నేడూహించి వ్రాసినది రేపు సత్యమగునని కూడ ఇతని విశ్వాసము. ఇది కవికి ఉండదగిన ఆత్మవిశ్వాసమే.

ఈ ఖండకృతిలో గూడ ''యాథార్థ్యము'' అను నామవాచకమును విశేషణము గాను, ''అజాగ్రత్త'' అను పదమును ''అజాగ్రత్త'' అని అపప్రయోగముగాను వాడిన ఈ కవి చివరిదాక తన స్వాతంత్ర్యమును వీడని ఆత్మాభిమానిగా తోచుచున్నాడు.

లలిత కళా కోవిదుడగు భీమన్న అతి సుందరముగా గానమును, కవితను, చిత్ర లేఖనమును మూడు గేయములలో పొదిగి భరతవాక్యమును పలికినాడీ కావ్యసంపుటికి. ''స్వస్తి ప్రజాభ్యః'' ఇత్యాదులను అందరు కృతి చివరకు పలుకగా ఈయన లలిత కళలకు ''స్వస్తి''ని పలికి తన కళాభిమానమును వెలిబుచ్చి, ఆశ్రయము లేక కళలు ఉండజాలవు కనుక, తదాశ్రయులైన రసిక ప్రజలకు ''స్వస్తి'' యని వ్యంగ్య భంగిమచే నిరూపించినాడు. ఆది నుండి అంతము వరకు ధ్వని ప్రధానమైన యీ కావ్య గుచ్ఛములో భరత వాక్యము కూడ ధ్వన్యమానముగా నుండుట యొక అపూర్వ శోభాకల్పన.

ఏమైనను భీమన్న కృతు లమోఘములు, సులలిత పదార్థ భావ రస గుంఫితములు.

ఈ నా రేఖా మాత్ర సమీక్షా రూపమైన పరామర్శతో పాఠకులకీ కృతిని సమర్పించు చున్నాను. ఈ సదవకాశమును నాకు ప్రసాదించి కావ్యపఠనముచే రసానంద మనుభవింప జేసిన మిత్రుడు భీమన్నకు కృతజ్ఞుడను.

–కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

గది గది కొక సుందర దీపం,
అవి కలిసినదే నీ రూపం!
తన్మంగళ మహా కళారాధనలో
పొంగిన దిది నా హృదయం.

కొస కొస కొక సురభిళ సూనం,
అవి కూడినదే నీ స్థానం!
తన్మధురానంద మరంద ధారలో
తనిసిన దిది హృదయం.

ఎద యెద కొక సురుచిర భావం,
అవి పోదిగినదే నీ జీవం!
తన్మోహన మహిత పురోగతి గతిలో
పూచిన దిది నా హృదయం.

నీరుగట్టి, మళ్ళుగట్టి, నారుగట్టి,
కంచెలును గట్టి నన్ను పోషించ రెవరు,
అడవి మొక్కను నేను; విశ్వావకాశ
వీథులం దిష్టమైనట్లు పెరుగుచుంటి.

## కేల్మోడ్పు

ఆయన సుబ్బరావది య

నంతపుర, మ్మఖిలాంధ్ర రాజ్యల

క్ష్మీయుతు ముఖ్యమంత్రి నెల

వ్విర్ణ బ్రజ కిచ్చిన మూలపీఠ, మా

ప్యాయత గుండె నింపుకొని

వచ్చెద మాయన షష్టిపూర్తిలో

రాయలసీమ నెన్నదుట

రత్నమణీతిలకమ్ము నుంచుచుర్ణ.

సాక్షిక దృష్టి పట్టని శి

వంకరు డాయన, ధాత్రి కెల్ల లే

పాక్షి కళా సుధారసము

పంచిన మోహనమూర్తి, శిల్పి, ర

మ్యాక్షర ధర్మముం గొని న

వాంధ్రిని దిద్దిన బ్రహ్మ, వాగ్మి; భ

ద్రాక్షత వర్షముల్ గురియు

దైవము కల్లురి సుబ్బరావుపై.

"రాయలసీమ" యంచు మధు

రమ్మగు పేరిడి, పూరుషార్థ పూ

ర్ణాయతన ప్రతిష్ఠకు పు

నాదులు వైచిన భద్రమూర్తి సు

బ్రాయలు రాయలే ! మకుట
భారము సంజీవ రెడ్డి దాల్ప, భూ
శ్రేయము గోరి యిట్లవత
రించిన తిమ్మరుసో ! మరే బుసో !

ఆవృతి సాజమై పరగు
నర్వది యాకుల ధర్మచక్ర మీ
జీవితచక్ర, మియ్యది వి
శిష్టముగా నొక చుట్టు చుట్టి ముం
ద్రోవల సాగి వచ్చినది,
నూత్న వినూత్న వయోవిభూతితో
బోవుత ముందుముందునకు
పుష్కలమై, శతధా మనోజ్ఞమై !

వీరావేశము దూసి, దేశరమకై
వెన్నీక పోరాడి, దు
ష్కారాక్లేశము లోర్చి, అభ్యుదయమ్ముల్
సాధించి, దీవ్యత్కళా
పారమ్యమ్మున కంకితమ్మయి, ప్రజా
స్వామ్యాత్మ బోషించు క
ల్లూరి స్వామికి, సుబ్బరావునకు కే
లోడ్పుం బువుల్ పూచెడిన్.

(శ్రీ కల్లూరి సుబ్బారావుగారి షష్టిపూర్తికి)

## ఉజ్జీవము

మధుర మధుమాస మేరీతి మధువు లూరు ?
జలద మెందుండి చేరు నాషాఢ గృహము ?
శారజ్యోత్స్న కెచటి దా చల్లదనము ?
ప్రకృతి దర్శించి ఏమి నేర్చుకొనినావు ?

జ్యేష్ఠమం దింకిపోయి, అశ్వినము నందు
కన్నులకు పండువౌ మన కలువ కొలను !
మబ్బు మనసున కరగిన మహితలమ్ము
పుష్యలక్ష్మిగ నీ ముందె పుట్టి పెరుగు !

వేషములు, రూపములు, మరి-విధులు, దశలు
మారవచ్చును జీవన మార్గమందు,
కాన మృత్యువె ముగియింపు కాదు; మరచి
పట్టి చేతుల పైనమ్ము పెట్టుకొనెదొ !

ఎండిపోయిన వాపిక నుండిపోయి
తనువె మరచిన యొక పురాతనపు కప్ప
మరల గొంతెత్తి బెకబెక మనెడు నదిగొ-
పబ్బమన, నేటి తొల్కరి మబ్బు క్రింద !

## తెలుగు నేలకు

చంపకోత్పలమాలికా సంచయముల
వివిధ రీతుల నిన్ను సేవించినాను,
పూజ కీనాటి గడ్డిపూలె మిగిలె,
వెడలి రమ్మిపొలమ్ముల వెంట, దేవి !

తొలకరికి కేలు మోడ్చి, ఊడ్పులు ముగించి,
గడ్డి బుట్టలతో బోదెగట్లు చేరి,
ఏలపాటలు పాడు మా మాలపిల్ల
లింత మోదము నీకు కల్పించగలరు !

ఏడు కొండల శిఖరాల కెదిగి, దివికి
నోసరిల్లి, పిల్లన గ్రోవి నూదుకొనెడు
తెనుగు వెంకన్న నీ కాతిథేయ మొసగ
చూచెదవు గాని – అచ్చ యశోద సుతుడె !

ముగ్గురమ్మల మోహన మూర్తి నీవు,
స్వర్నదీ సుధాస్నాతవై, చిర్నగవున
కొండ కొండను దిగివచ్చుచుండ, నతడు
ప్రీతి నిను గొల్చుకొనును మూర్తిత్రయాన.

శేషగిరి నుండి సింహాద్రి శిఖరమునకు
కల్పమంజరు లూయెల గట్టి, తెనుగు
కడలి తరగల చెలులు రంగార నిన్ను
మించుల యెడంద లడర నూగించ గలరు !

రమ్ము దేవి ! మా తెనుగు పొలమ్ము లందు
లక్ష్మివై, తెన్గు పాఠశాలలను వాణి
వై, తెనుగు గేహములను భవాని వగుచు
రమ్ము ! సిరు లెల్ల నీవుగా రమ్ము, దేవి !

పూర్వగిరి సానువులు నీ కపూర్వ రత్న
మణి కిరీటమ్ము బెట్టి సన్మాన మొసగ,
రాజనాలను దంచి మా లంకభూము
లర్చసేయు నీ కింటింట నధిక భక్తి !

కృష్ణవేణమ్మ, గోదావరీమ తల్లి,
వంశధార, పెన్నా, తుంగభద్ర లాది
వాహినీ కుమారికలు నీ స్నేహమునను
పూర్ణజీవన సౌభాగ్యముల వసింత్రు.

పుట్టి నప్పటి నుండి నీ పూజ లోన
గుండె గదలించు నిధులెల్ల నిండుకొనియె,
నా వయసు మిగిల్చిన యీ పునాస పూలె
కోటి భాగ్యాల విలువల గొలుచుకొనుము !

(స్వయంప్రభా దేవికి ఆవాహనము)

## తొలకరి

చల్లుము విత్తనమ్ములు, భు
　　జమ్మున నాగలి నుంపవేల ? వి
ద్యుల్లత లేని మబ్బులకు
　　తోచదొ బుద్ధి? బెడంకుచుంటివో
కల్లగ మారునేమొ – ఇది
　　గాలి దుమారమొ – యంచు? కాదు కా
దల్లరి కాదు, కాల మిక
　　ఆగదు, లెమ్మిక, ఏరు గట్టుమా !

కడువడి బారుగా విజయ
　　కాంక్ష భయంకరమ్మై పురోగమిం
చెడు రణరంగ మట్లు చను
　　నీరదముల్, అనుమాన మేలనో ?
పిడుగులు అగ్నిగుండ్లు గురి
　　పించుట తథ్యమె కాని, అంతలో
జడిగొని నిండుకుండలను
　　జల్లును నీ మడిలో సుధాంబువుల్ !

ఎఱ్ఱని యెండలోన బ్రతు
　　కెల్ల నసహ్యపు దాస్యభారముల్
బఱ్ఱున లాగికొంచు నిటు
　　బానిసవై మనినావు, పాదముల్
జఱ్ఱున జార, బిడ్డలు వి
　　లాసత నాడెడి వానకాల మా
మఱ్ఱుల దాక వచ్చినది,
　　మంచి దినమ్ములు రాక నిల్చునే !

"మబ్బుల నీరులేదు, పవ
మానుని గుండెల చెమ్మలేదు, మా
దుబ్బుల యేరు నెండినది,
తూములు పూడెను, చేల నెర్లలో
గబ్బిలముల్ కులాయములు
గట్టుకొనెన్, ఇక సేద్యమేడ, మా
సెబ్బరి మన్గడల్ కడకు
చేరునె, శాంతిసుఖమ్ము లబ్బునే ?"

అని-చింతించుచు నిల్చినాడవదికా
దన్నా, స్థితప్రజ్ఞ; సా
ధనముల్ కన్పడనంత మాత్రమున బా
ధ౯ పొందగా నేటికి౯ ?
ఘనముల్ మృత్యువె కాదు, జీవనముసు౯
గల్పించెదు౯, నీ పొల
మ్మున వర్షించెడు విప్లవమ్ముగ ప్రియాం
బుప్రావృడంభోదముల్ !

అరుణార్కుం డదె పశ్చిమాంబునిధి మా
యంబయ్యె, ఇంకెంత-తొ
ల్కరి కానోపును రేపె ! చిన్నె లటులే
కాన్పించు, హూఁ - ఉక్కపో
సె రసాభాసగ - ప్రొద్దు తూర్పుదెసకు౯
జేరంగ - ఈ లోపులో
ధరణి౯ దున్నెడివాడ ! సిద్ధపడుమా
త్వద్భూమి బాలింపగా !

(స్వాతంత్ర్య లబ్ధికి ముందు)

## అదృష్టము

మిత్రుడును, నేను అంటుమామిడుల వర్త
కుని సమీపించి, మొక్కలు కొన్ని చూచి,
పెక్కురీతుల చర్చించి, బేర మాడి,
నాణెమైనవి తీసి, కొన్నాము రెండు !

ఒక్క కావటిలో ప్రక్క ప్రక్క చేరి
వలపు తీయములం గ్రోలి బ్రతుకు చున్న
మొక్కలను చెరి యొక్కటి చక్కపట్టి
కదలి పోతిమి మేము మా గ్రామములకు.

నాడె మిత్రుడు తన మొక్క నాటినాడు
ఉప్పు మాత్రము పండెడి యూరి లోన,
దివ్యగోదావరీ తీరదేశ మందు
సారనీరాల నా మొక్క సాకినాను.

చవిటినేలను పడ్డది చచ్చిపోయె !
జీవగడ్డను పడ్డది చేవదేరె !
ఒక్కయెడ గొన్న మొక్కలయ్యును, బ్రతుకుల
తీరు వేరయ్యె, దాని నదృష్ట మంద్రదు !

చెలువ ! దీనికి బోలెడు చింత యేల ?
పూవును గులాబిపొద నుండి పుడుకు కొన్న
మురిపెముగ వేణి దాల్తువు, గరికపోచ
నుండి గైకొన్న చిదిపి వేయుదువు కాదె ?

## కాలవాహిని

తోడి నెచ్చెలు లంతంత దూర మిది
అంతు గానక కడు వెరగందినారు,
అడ్డపడిపోయినారు ఒడ్డందుటకటె
లక్ష్య మైనట్టు లంత చెల్లాచెదరుగ !

పచ్చిక బయళ్ళ, తోటలో, పైరు చేల,
ఊబినేలల, డొంకలో, ఉప్పునీటి
కయ్యలో, వార లేమి లెక్కగొన లేదు !

ఎచట నెవరికి నేలందు, నచట వారు
బ్రతుకుజీవుడా యని ఒడ్డు బడుచు నుండ్రి !

వెర్రినో నేను, తెలియ నీ వేగధాటి !

వరద పొంగిన కాల ప్రవాహ మందు
కొట్టుకొనిపోదు నే నొక్క కొమ్మవోలె !

ఇరుతటమ్ముల వైవిధ్య మినుమడింప
క్రొత్త సౌందర్యములు త్రోసికొనుచు పోవు,
క్రొత్తభావాలు తలదన్నుకొనుచు పోవు !

ఏనపూర్వ యాత్రాశీలి, నీ యనంత
కాల కల్లోలినియె ప్రియురాలు నాకు,
రాత్రి–పగలను జోడు గుర్రాల పైని
దౌడుగా నున్న దీమె యంతఃపురమ్ము !

## నీవు–నేను

నీవు నా తొలిప్రాయంపు నీడ వగుచు
ఇంచుకించుక నాలో లయించి పోవ,
తరుణ వైశాఖమాస మధ్యాహ్నసమయ
భానునై నేను, దేదీప్యమాను నగుదు !

నీవు నా మలిప్రాయంపు నీడ వగుచు
తలగి నానుండి, పొలిమేర దాటిపోవ,
గాఢ హేమంత యామినీ గర్భమందు
మాయమై నేను, శూన్య సమాధి నగుదు !

నీ వుషఃకాల రాగాల నెచట నుండి
అరుగుదెంతువొ ! చరమ సంధ్యా గృహాంగ
ణమున నెచటికి పోదువో ! నన్ను మాత్ర
మూరకే తూగుటూయెల లూతు విట్లు !

## జీవన రహస్యము

ప్రవహించిపోవు, దూరము లేక సెలయేరు,
పాడుకొను నిశ్చింత పికము,
రాలుకాలపు చింతయే లేశమును లేక
లీలమై వికసించు మొగ్గ ;
చెలి ! జీవిత విషాదముల గూర్చి మరిమరీ
తలపోసి భయమంద నేల ?
లెమ్ము, వాసంతార్చనమ్మునన్ గైసేసి
కొమ్ము, జీవన రహస్యమ్ము !

సర్వకాలము లందు చైత్రమే నీ తోడ
సాహచర్యము నెరపునేని,
ప్రణయ సామ్రాజ్య శోభారాజ్ఞివై నీవు
పాలించ గలవు జగము ;
కనుగొమ్ము పుష్పమో, కలకంఠమో నీకు
కడుగూర్చు సఖులు, వారి-
మనుగడలో, పుష్యమాసమ్ము వెనుకనే
మధుమాస మొందుటెట్ల !

మూగయై హేమంతమున నెట్ల జీవించి,
మోహనారవము తోడ
నవమాస మేతెంచి నంతనే గొంతెత్తి
నవ్యగానము చేయు పికము

నిత్య యౌవన శోభ నిల్పుటకు నేదైన
నేర్పునేమో మంత్రవిద్య,
జరను మృత్యువును గెల్చు రహస్య మేదేని
కరుణించునో చెల్మి నెంచి !

సెలయేటి చెలి గూడి చెంగల్వలను వేడి
చింతలను బాపుకొమ్మ
తీవలను బెంచి క్రౌంచబూవులను మించి నీ
జీవితము దిద్దుకొమ్మ
కలకంఠముల కంఠముల కంఠమును జేర్చి
కమ్మగా పాడు కొమ్మ
వ్యర్థంపు బెంగలవ్వల ద్రోచి ప్రేమ దే
వతపై సుఖించిపొమ్మ !

# స్వప్నజీవి

"కోయిల కొమ్మల" చిగురు
గొమ్మల దాగొని వెక్కిరించి, లే
బ్రాయపుటాటకాంద్ర యను
రాగపు దృక్కుల నీతగొట్టి, సాం
ధ్యాయత రాగమంజరుల
స్వాంతరసాయన పాత్ర లందు సా
రాయము గ్రోలి, మత్త మధు
రమ్ముగ పాంథుడనై చరించితి"

"మరి మరి, పిల్చి పిల్చి, కుసు
మ స్తన దుగ్ధముల" వసంత సుం
దరి నను దన్ని, వక్షమున
నాట్యమొనర్చిన వాడ, నాటి సం
స్ఫురణ భవాశ్రువారి తెరు
వున్ గనుపింపదు నేడు, నేటి శ
ర్వరి కడుఘోర, మేమి సెల
వా ? ఇటు కొంచెము విశ్రమించెద".

ఏ కులమంచు నన్ను విప
రింపుల గూడిన కుంటి ప్రశ్నలన్
వ్యాకులపెట్టబోకు, డది
వ్యర్థము ; లోకపు మంచిచెడ్డలన్

దూకియు మున్గకుండ నిటు
  దూరముల్లర బడి వచ్చినాడ ; ఈ
యాకృతి నేమి కల్లు ? హృద
  యాకృతి జూచి సమాదరింపరే !

పేదకు పంచ యిచ్చి, పృథి
  విన్ కలవానికి పాన్పు వేసి, న
వ్యోదయ మన్న మానవత
  పుబ్బను పుట్టిన పుణ్యమాయె ; ఇం
కేది తరించు మార్గమని
  క్రిందులు మీదులు త్రొక్కి త్రొక్కి, యీ
రోదసి జేరుకొంటి నిట
  రుద్రుని వాకిలి తీసియుండుట !

బాలతనంపు చందములు
  ప్రాయపు టందము లంతరంగపుం
గోళము నందు సుళ్ళు తిరు
  గు ! స్మృతి తేన్పుల మాధురీ సుధ
దేలుచు కన్ను మూతు కరు
  ణించినచో, తమి నప్పుడప్పు డా
కాలపు పూతగొమ్మల సు
  ఖమ్ముల వ్రాలుచు స్వప్న జీవినై !

## అగ్రగామి

మంజు మల్లీ నికుంజాల, మావి పూల
మంటపమ్ముల, మందార మందిరముల,
పురుగుడును పుల్లరేగుడు పొదల లోన
భేదమెంచక విహరించు భృంగకులము !

ప్రతి సుమమ్మును పానపాత్రమ్ము కాగ
పంచుకొని వచ్చి జగతికి పంచియిచ్చు,
ప్రతి లతాంతపు గుప్తజీవన ధనమ్ము
తెచ్చి యందిచ్చు, దాని గుర్తించు కొమ్ము !

కల్పితములైన సరిహద్దుగట్ల యొద్ద
ప్రాలుమాలిక బడియున్న ఫలిత మేమి ?
అనుభవింపుము ప్రకృతి పాదాబ్జములును
మకుట పద్మరాగములును మనసుదీర !

మహిని తమి తీరునందాక మధువు గ్రోలి
కదలి సాగుము నీ వగ్రగామి వగుచు,
అదె రసానంద జీవితయాత్ర నీకు
దాని లక్ష్యమె అక్షరాద్వైత సిద్ధి !

## ఆనందయాత్ర

పద్మా నయనపద్మ పక్ష్మపంక్తుల క్రింద
దాచుకొన్నాడ సౌందర్యలహరి,
శ్యామలా సుందర స్వాంతోత్పలమ్ములో
భద్రపెట్టితిని యౌవనపు శోభ,
భారతీ చరణ సేవా క్షేత్రమున నాటి
నాడను ప్రేమమందార లతిక,
జనతా మహాశక్తి సర్వాత్మతా రోచి
ముట్టించుకొంటి నా ముందు దివ్వె,

వాడిపోని సౌందర్యము, వీడిపోని
యౌవనము, ఆరిపోని ప్రేమాశ్రయమ్ము,
ఆగిపోని యఖండ లక్ష్యమ్ము నేను,
అమృతరాగ రసానంద యాత్ర నాది !

## పారితోషికము

చివరి కొమ్మలు చేరి, చివురు రెమ్మలు దూరి,
ప్రత్యూషస మయాన పాడుచున్నది పికము ;
పాటకు తలయూచి, పరితోషమును పొంది,
పారితోషిక మీయ గోరినది యొక చీమ !

**2**

"పారితోషిక మిదే, పరభృన్మణీ" యంచు
గొంతెత్తి పిల్తువా ? కొస కొమ్మ కందునా ?
చివరి కొమ్మల కెట్లు చేర జాలెదొ, చీమ ?
నివరిధాన్యపు గింజ నేల రాలునొ సుమా !

నష్టములు తీర్చుకొని, కష్టముల కోర్చుకొని
పైకి నీ వేగినను, పరముగాయని పికము
రవ్వంత నీ యిచ్చు బువ్వకే ఆశించి
నీ పిల్పు వినునా ? నీ రాక కాగునా ?

నవకిసాలయ సమున్నత శాఖలం దుండి
దిగువ కొమ్మల యందు దిగు మందువా పికము ?
యమృత గాన లీలాయత్త జీవి కట
నీ చిన్ని పిల్పు విన్పించు ననుకొందువా ?

నివరిధాన్యపు గింజ నవరత్న నిధి యొకో ?
నీ మెప్పు విలువెంత, నీ బహూకృతి యెంత ?
చివరి కొమ్మల కీవు చేరు టొక కలకాదె ?
ఓ పిపీలికమా ! ఉడుగుమా యత్నమ్ము !

మా వంటి సఖులకే, మా వంటి సుఖులకే
అందుకోరాని దివ్యానంద మాధురీ
గానశారద కీవు కానుకను గూర్తువా ?
వరకళా భారతికి వరిగింజ నిత్తువా ?

3

ఓహోహొ, మిత్రమా ! ఉల్ల ముల్లసితమ్మై
ఉద్యమించునదే ఉద్యోగమౌ సుమా !
అదియ జీవితమున కానంద మిడు నోయి !
అదియ వాంఛాసిద్ధి కనువైన పథ మోయి !

చివరి కొమ్మలపైకి చేరవలె ననియే,
అందాక కోకిలము అందుండు ననియే,
స్వీకరించును నాదు చిరుకాన్క ననియే,
నే నేగుచుంటి, నన్నేల వారించెదో ?

అందుండి కోకిలము ఇందాక దిగనేల ?
ఇందుండి నేనెట్ల అందాక పోవలతు !
అప్పుడే నా కింత ఆమోద మోయీ !
ఇష్టమును గోరి పడు కష్టమే సుఖమోయి !!

అంతమాత్రమె కాదు ; అటకు పోవుదు నేని
ఆ చిగురు గుత్తియల నలర గందును గదా ?
ఆ మధుర మధుధార లానగందును గదా ?
ఆ చైత్రగాన మంధైక్య మందుదు గదా ?

సాగిపోవుటయె నా జన్మధర్మము సఖా !
ఆగిపోవుట యన్న అంతమౌటయె గదా ?
ఆనంద మొక్కటే ఆదర్శ మగు నాకు,
ఆదర్శ మొక్కటే ఆహ్వాన మగు నాకు !

**4**

ఇంతలో ఆ చీమ యెగబ్రాకె సగమునకు !
నే నందె మిగిలిపోయితి నచేతన ముట్లు !
పాట మానదు పికము, పరువు వీడదు చీమ !
ఎందాక పాడునో ! ఎందాక పరువిడునో !!

## ప్రేమభిక్ష

"నీ నయన రాగకాంతి తీర్థాన మునిగి
నీ హృదయపీఠమును చేరి నిల్చిపోదు,
నన్ను కరుణింపు" మని నీవు నా గృహాంగ
ణమున అర్థించినావు హస్తములు మోడ్చి.

అప్పుడనుకొంటి నేను - నాకన్న నీకు
వేరు దిక్కు లేదని, విఱ్ఱవీగినాను !
విఱ్ఱవీగిన నా నేత్రవీధి లోన
నీ వెవడొ భిక్షుకునిగ కాన్పించినావు !

ఆశ తీర్చని రూపు కన్నార చూచి,
ఆదరణ నీ పేరు నోరార పాడి,
అలసి కాబోలు నా నుండి హస్తయుగము
పైకి మళ్ళించినా వేదొ ప్రార్థనముగ !

ఓహా ! అధరమ్ము చిలుకు పీయూష ధార
నీకు అందీయ పర్వచంద్రికయె పిలిచె !
తత్పరీ వృత సైకత తల్పకముల
రాగములు చిందె సరిదప్సరోగణమ్ము !

ప్రకృతి నీ కిచ్చు కోటిచంద్ర ప్రఫుల్ల
దీప్తి ముందర నే గ్రుడ్డిదీప మైతి,
యాచకుడవయి వాకిట చాచుకొన్న
నీ కరమ్ముల నమృత ముండినది యెరుగ ;

ఇపుడు నావంతు, దేవ ! నీ విపుల విశ్వ
మోహన శుభాంతరంగము ముందు నిల్చి
చాచుకొంటిని కేలు లజ్జా నతనయి,
ప్రేమభిక్షము నాకింత పెట్టుమోయి !

## మహాకవీ !

వ్రాసి, ముగించి, తృప్తిపడి,
భద్రముగా నొక సంపుటమ్మునన్
మూసిన కావ్య మేను ; క్షణ
మొక్క పుటమ్ముగ నన్ను త్రిప్పుచున్
ఈ సుకుమార కాలరమ
ణీమణి మెల్లన పాడసాగె నన్ !
వ్రాసిన కాలమంత ? మరి
పాడుట కెన్ని యుగాలయా ? ప్రభూ !

ఎవరు నెరుంగ రేమి విర
చించితివో, ఇదియున్ సుఖాంతమే
యవునొ-విషాద ఖండికయొ !
హాయి నొసంగెడు రాగమాలయో,
అవుకు పదాల ప్రోవొ ! ఎటు
లైనను నీ కరుణారసమ్మునన్
చివికిన దౌటచే రుచులు
చిందుట ధర్మము కాదటో ? ప్రభూ !

ఎన్ని యుగమ్ము, లెవ్విధి త
పించి, మహాకవిపై రచించితో
ఇన్నవ కావ్యసంపుటము
నింత మనోజ్ఞ రసోర్జితమ్ముగా !
పున్నెము వంటి దెట్టి దను
భూతి శతమ్ముల మేళవించి, నీ
చి న్నలినమ్ము మీటి, విక
సించి, యిటుల్ రమియించునో, ప్రభూ !

పదమున కొక్క రాగముగ
పాడుచు, కోటి గళాల కోటి సం
పద లలికించుచున్, మధుర
మంగళరూపములన్ నటించుచు,
ఉదటున నొక్కసారె విల
యోద్ధతి నుర్మునో యేమొ ! జంకుచు
న్నది హృదయమ్ము, కాలము గ
దా ? అది నిత్య వసంతమా ? ప్రభూ !

కోయిల పాడుచుండ, నవ
కోమలవల్లిక లాడుచుండ, అ
ధ్యాయము లన్నియున్ ముగియు
దాక సభాపతి వౌచు నన్ను నీ

తోయము వారి వెంట దయ
తో నడిపింపుము ; నా సమాప్తపుం
గేయము నీవ కమ్ము, పాడి
గింపకుమీ అటు మీదటున్, ప్రభూ !

ఊహను బుట్టి, కావ్యగతి
నొంది, నవోదయమ్మై, స్వయంప్రభా
స్నేహములోన పాడబడి,
సిద్ధిని గొన్న ననున్ మరెందు దా
సోహము చేయ బంపకుము ;
సుందరమ్మై, శివమ్మై, రసజ్ఞతా
దాహము తీరినంత నిను
దన్నుదు వెండియు నూహగా, ప్రభూ ;

## ఆగమము

నన్ను కన్నకోకిలము గానమ్ము నేర్పు
కొందువా యని పిల్వ నానంద మంది,
జాడు పదలని నెమ్మి నా జోడుగూడి
యాడుకొందువు పత్తువా యనగ మురిసి ;

తూగుటూయెల లూతు నా రాగజలధి
నురుకు మని వేగిరించెడు తరుణసంధ్య
బాహువల్లరి కానందపడి, తమిస్ర
కుంతల పరీమళమ్ముల కూర్మి కలరి ;

ముగ్ధమందార సుమము నా మోవితేనె
ఊర్వశికి తుల్య మని చెప్ప నూరి యూరి,
అధరసుధ గ్రోలు చదువుల నభ్యసింప
బడికి రమ్మను తేటికి ప్రాంజలించి ;

వాయువేగము తోడ విశ్వమున గల్గు
శోభ లెల్లను చూపింతు, సూర్యరథము
కదలుటకు ముందె పయనమ్ము గమ్మటంచు
ఉదయమే లేపు గంధవాహునికి మ్రొక్కి ;

మొట్టమొదట నా ఊయెలతొట్టి నుండి
దూకి పర్విడి నాడ నీ లోకమునకు !
కలవరమ్ముల కూగి, రంగులకు లోగి
చేరవచ్చితి నీ హృది ద్వారమునకు !

గడప దాటించి నను తోటగట్టు జేర్చి
తోటతోటెల్ల చేత నెత్తుకొని నావె !
గట్టు దాటించి నీ యున్కిపట్టు జేర్చి,
ఇక–ననుం బట్టి యెదకు హత్తుకొన రావె !

## విచ్చింత

అందమూ లేదు, ఆధిక్య మైన లేదు,
ఆత్మ నలరించు గుణము రవ్వంత లేదు,
ధ్వాంత శకలమ్మె నాకన్న కాంతి కలది,
ఎట్లు ప్రేమించు నా దేవు డింక నన్ను ?

మృదుసుమము కంటకమును ప్రేమించ గలదె ?
కలదె కిరణమ్ము నకును చీకటికి చెలిమి?
మూగ వీణకు కలకంఠమునకు మైత్రి
కుదురునే ? కళ కబ్బునే కొండ పొత్తు ?

ఉన్నచో, నా కెరింగింపు, డుడువులార !
ఇప్పుడే పోయి నా గోడు చెప్పు కొందు
ప్రేమమూర్తికి, అతని పవిత్రపాద
పద్మముల వ్రాలి, తేనియ పట్టి గ్రోలి.

చీకటిని పిండి, రంగులు చేసి, వెలుగు
పూలను రచించ గల కళాశీలి యతడు ;
కుంచె చాలనిచో - ఉలి గొంచు నైన
వలసినట్లుగ నన్ను దా మలచుకొనునొ !

## అరుణోదయము

పువు పువు లెక్కచూచి, ఎవె
    వో మనసైనవి ఏరి యేరి, త్రుం
తువు ఒడినిండ ఏ కలిమి
    నోములు నోతురొ యెవ్వ ? రేమి యు
త్సవము ? సుహృద్వరా ! సొబగు
    చందము లేమి గణింప ! వెందు కా
పువులును, పల్లవమ్ములును,
    పూరస మూరని లేత మొగ్గలున్ ?

తూరుపు కోటలో విజయ
    దుందుభులే విన రావొ ? భూమి పొ
ల్మేరలు మీరి, కోకిలము
    లే ప్రగతిన్ ప్రకటించు చుండ, వి
న్నారు కదోయి ! చూత సుమ
    నస్విను లందము లాచరింప, శృం
గార నవారుణాంగణ ము
    ఖం బయి సాగె రథోత్సవం బదే !

వెలు గిటు వచ్చె ! ఈ మలిన
    వీథుల వాకిళులైన చిమ్మి ని
ర్మల హృదయారవింద మక
    రందము లిత్తము, పట్టిపూల సే

విలువలు గల్గు ఆత్మ పరి
వేషము వీడక ? తీవలందె పూ
జల దమ జీవితేశ్వరు వ
సంతుని దన్పక రాలవే విరుల్ !

హుకుములు పూల వాసనల
హుమ్మని తాకుట లేదె ఆశలన్ ?
ప్రకటిత సుస్వరాజ్య పరి
పాలన మెల్లెడ చాటు బంపరో ?
వికలత శీతభానుడును
వే జని పశ్చిమవార్ధి గ్రుంకడో ?
ఇక – అరుణోదయంబయి మ
హీస్థలి తూర్పున కంజలింపదో ?

ఆపుము పూలకోతను, మ
హాత్ము రథం బదె మ్రొక్కు మోయి ; ఈ
పూపయు, పిందె తీవలనె
పూజ లనర్పగ నిమ్ము – అంచు నే
నా పువుకోతవాని కన
ఆతడు మూల్గుచు లేచిపోయె పెన్
కోపము తోడ – "గంట అదె
కొట్టిరి, అర్చకు డేమి తిట్టునో !"

# రాజకీయ ఖైదీ

మిత్రు డాతడు, మేటి గ్రామీణ జీవి
తమ్మి సొమ్మయ్యె మాకు బాల్యమ్ము నుండి,
అతనిలో నేను చూడని ఆశ లేదు,
అనుభవింపని రుచి లేదు ఆ దినాల.

కొంటెతనముల పుట్టిల్లు కొమరు ప్రాయ,
మప్పుడైనను అతడు పూవైన త్రుంప ;
డెండకాలము తన చేతి కుండ లోన
కోటిబావులు జీవించు తోట తనది.

బడికి పోవును, పొలములో పనులు చేయు ;
కామధేనువు, కల్పవృక్షమును కృషియె
అతని దృష్టిలో ; చదువున నగ్రగామి,
గ్రా మజనముల కత డొక్క రైతు పెద్ద !

కాని, కృషిచేసి, కృషిచేసి, కాయకష్ట
జలధిలో మున్గియుండు రైతుల కదేమొ
ఊపి రాడదు ; ఎవరిదీ – చేపుకొలది
పిండుచున్నది రాకాసి బండచేయి !

రామనామము గ్రోలుచు బ్రతుకు రామ
చిలుక కించుక పాలములో స్వేచ్ఛలేదు,
కాడిగిత్తల వెన్నుపై గాయపరచు
మొరటు కాకికి లేదు పంజర మొకింత !

కొంప లేక వ్యాధికి తానె కొంప యగుచు,
తిండి లేక మిత్తికి తానె తిండి యగుచు,
రత్నగర్భను పండించు రైతురాజు
దుఃఖ మొందుట కెట్టి హేతువులు కలవొ !

చూచినా డత, డూహలు పూచినాడు ;
పారతంత్ర్యము దుస్థితి కారణముగ
నిర్ణయించి, దానిని బాప నిశ్చయించి,
ఉప్పు సత్యాగ్రహమ్మున నురికినాడు.

తల్లిదండ్రులు అడ్డుగా తలప లేదు,
భావిజీవిత పరిణామపథము నైన
ఇంత చింతింప లేదు, తనంత తాను
బాపు పిలుపున కంజలి బట్టినాడు.

మిత్ర పరిరంభములచే పవిత్రమైన
శిరముపై భారముగ లాఠి విరిగి పోయె !
నాగలిని, లేఖినిని కూడ నడిపినట్టి
కేలుదోయికి సంకెళ్లు కేలు మోడ్చె !

నాడు మా కళాశాల కంట తడి యార
లేదు, నేటికి చల్లారలేదు కొన్ని
యెదల యెర్రన, ఆ జనపదము లందు
నిండు వరిచేలు కడుపులు మండి యేడ్చె !

అతని కరుణాశ్రువులు నేల నంకురించి
దీన హృదయాల పూచిన తీగలయ్యె,
తన నినాదములే భారతమున నేడు
తరుణ శక్తికి ప్రగతి గీతములు పాడు !

## తీరాంతరము

అధి స్వరాజ్యము గోరి పోరాట, మందు
దిట్ట లెందరి గోరీలో కట్టబడియె ;
అది యగాధము, త్రవ్వి చూచెదవ యేని
భావి కాంక్షలు నిన్నెన్నొ పల్కరించు !

ఔను, కాల మనంత శ్మశాన ; మందు
పదపదమ్మున నిద్రించు పడుచుదనపు
వేడియారని యెముకల గూడు లెన్నొ,
అక్షర మ్మైన యెంత కార్యక్రమమ్మొ !

వేకువగు దాక పోరాడి, విజయ మంది,
మేలుకొల్పులు పాడి వైతాళికుండు
సుప్రభాతము పూర్తిగ చూడకుండ
కదలి తానును చీకట్ల గలిసి మరలె !

వెడగు బడబాగ్నులార్పి, ఉప్పెనలు నడచి,
దేశమును తీరమును జేర్చి తిరిగె పడవ ;
ఏ వడుల, నే సుడుల, నెవ్వ, రే దరిద్రు,
లే విభగ్నజీవులు కుయ్యి లిడెడు వారో !

అది తుపాకి గుండని భ్రమించెదవు సఖుడ !
బ్రతుకు తీరాంతరంపుటాహ్వాన మద్ది ;
అటు కనుంగొమ్ము, చెవి యొగ్గి ఆలకింపు,
మా ప్రగతిదీప మదె ! గీత మదె ! అతండె !!

సమసిపోనీకు, మది ప్రపంచమున కెల్ల
శుభ్ర జీవన మార్గమ్ము చూపు దివ్వె !
నిలిచి పోనీకుమిది ప్రజానీకమునకు
అభ్యుదయము నొసంగు మహాత్మునాత్మ !

బుద్ధదేవుని ఏసుని బోధనముల
కాగితమ్ములు చెదపుర్వు కడుపు నింపె ;
నేడు మనుజుని హృదయమ్ము నింపనిమ్ము
గాంధిదైవము ప్రేమ విక్రాంతి కాంతి !

పల్లెపట్టున నదె మాలపల్లె పొంత
చూతశాఖలలో కుహూ గీత రవళి !
సఖుడ ! పదవోయి, పదవోయి ! – జనపదాలె
మన పథాలింక, అవె మహాత్ముని పదాలు !

(గాంధీజీ హత్యా వార్త విని)

## వసంతోత్సవము

చాంద్ర లేహ్యము, అరుణభాస్కర గుళికలు
పూటపూటకు మ్రింగుచు, దీటు చెడక,
కాలమను వృద్ధు బాలుని వోలె లేచి
గంతులిడు కొంచుయాత్రకు కదలి వచ్చె !

ధరణి గల్గిన ముగ్ధసౌందర్య మెల్ల
ఆమనిగ లేచి వాని మకాము లోన
గజ్జె కట్టినదాంధ్ర రంగస్థలమ్ము
రంజితమ్మయినది నేటి రాగ మందు !

ఈ వసంతోత్సవమ్మున, ఈ సదస్య
లోక మెల్లను ద్రవియించి నాకమయ్యె !
లావు నాశిల్లి, ప్రక్కకు లాగబడ్డ
పేదముడుగట్లు కూర్చుంటి వేల నీవు ?

నేను :
ఓ నవోదయమా ! బహుమాన మయ్యె
నీ వచస్సుధ నా వ్యర్థజీవకలశి ;
అగుట, నించకుమా దీని నంచు లరయు,
పచ్చి దిది, మోయ జాలదు, విచ్చిపోవు !

గెలుచుకొంటివి తమి తమస్సులనె, నా హృ
దంతరాళము దివసాంధతమసము సుమి !
పిలుచుచుంటివి ప్రేమను పేరుపెట్టి,
బ్రతుకె దుఃఖాశ్మమునకు బంధితము నాకు.

కోర్కె తీరని నా గుండె కొలిమి నుండి
ప్రత్యణువు ప్రేలు నొక్క అణ్వాస్త్ర మగుచు,
ప్రగతి పండిన చితిబూది పాటిదిబ్బ,
సాకుచున్నది నను "నాగసాకి" వోలె !

ఉదయము :
కారణము లేని కన్నీటి కాల్వగట్టు
పూయజాలదు ఒక గడ్డిపూవు నేని,
పారిజాతము లే రీతి పడయగలవు ?
లేచిర, మీ్మ మహాభోగ మాచికొమ్ము !

శుభవిహంగ మహాగాన సభల, బహుళ
గంధవహు పుష్పనాట్యరంగముల, మధుర
మధుఫలాహారహేరాళ మందిరముల,
చింత లెచటివి ప్రేమవసంత మందు ?

నేను :

పల్లవము చీల్చు కోయిల పాడుచుండ
అందములు రాల్చు పవమాను డాడుచుండ,
కుటిలకుంతలముల పూలు కులుకుచుండ,
చూడజాలను, పెట్టకు క్షోభ నన్ను !

పూవురాలి వాపోవును తీవ యొకటి,
పిందె కూలి దుఃఖించును వృక్ష మొకటి,
కోరకమే లేక కుమ్మిల్లు కొమ్మ యొకటి,
పరిమళము లేక తపియించు ప్రసవ మొకటి !

ఎండుతీగలు పాయిలోన మండ ద్రోచి
కన్నె రివటలకే తాళి గట్టుచున్న
నవ వసంతాగమోత్స వానంద మందు
గుండెగలవాడ నెట్లు పాల్గందు నేను ?

నేను కూర్చున్నరాయి :
ఓహా ! ఎవ్వడవోయి ! కవోష్ణబాష్ప
కంకణమ్ములతో నన్ను కదిపినావు ?
మేని రసమేని, ఏ భావమేని లేని
నా సమాధిని భగ్న మొనర్చినావు ?

రంగురంగుల మెరుగు చారలు ధరించి
పెద్దపులి నని వేషము వేయు నరుడు,
అతని వంశాన పుట్టియు, అజ్ఞునట్లు
చింతచిగి మీద బ్రతుకు చేర్చితి విదేమి ?

చైత్ర సంయోగమునను నా స్వాంతసీమ
స్పందనము నొందజాలని బండ నేను,
ఆకు మెదిపెడు ప్రతి చిన్ని సోకు కూడ
మీటి మ్రోయించ గల వీణమెట్టు వీవు.

శిశిరకాలము నందేమొ చేరి నన్ను
సానుభూతిని జూపు నేస్తము వటంచు
దలచితిని, కాని – మాధవోత్సవము కూడ
నిన్ను స్పర్శించుటకె జంకుచున్నదేల ?

నేను :
పృథ్వి పైబడి కన్నువిప్పినది మొదలు
మృత్యుదేవత నేను ప్రేమించినాను,
మ్రొక్కుకొలది నా శిరమును ద్రొక్కుకొనుచు
అందకేగుచు నున్నదా యందకత్తె !

ఆరదీచింత, నేను నిత్యాగ్నిహోత్రి ;
వేల్తు నా జీవయష్టిని విరిచి పోసి ;
అంతమున నన్ను నేనె స్వాహా యొనర్చి,
ముగిసి, పూర్ణాహుతిగ తీరిపోవ నుంటి.

రాయి :

బ్రద్దలైన దే యగ్నిపర్వతము, నీ హృ
దంతరాళము గాఢ ధూమావృతమ్ము ;
వరము లిచ్చెడు ప్రేమదేవతలు లేరె ?
మృత్యుభామిని నేల ప్రేమించి నావు ?

జీవ మున్నదె విశ్వరాజీవ మందు
సార సౌరభ్యమును గొన సాధ్య మౌను ;
మాతృవక్షము, గోదావరీ తరంగ
డోలికలు గల్గు బిడ్డకు డొంక లేల ?

నేను :

మాతృ వక్షస్సుధాశైతల్యముల నేని
బాధించు గ్రీష్మాతపమ్ము కలదు,
గోదావరీతీర కేదారముల నేని
మోడు పెట్టెడి తుంగముస్త కలదు,

అనురాగహృదయ నూతన రాగరుచి నేని
        వమ్ముచేసెడి శిశిరమ్ము కలదు,
నవ భావనా దివ్య భువనావధుల నేని
        చదిపి పార్చెచు నైజమ్ము కలదు,

పట్టపగటికి చీకటిభయము కలదు,
నరనరమ్మును త్రెంచుక నరుడు చేయు
బ్రతుకు కృషి కెల్ల మరణమే ఫలము గాన
మృత్యుదేవత నేను ప్రేమించినాను !

అగ్నిని భరించగల దొక్క హాలహలమె,
ఆమె తప్ప నా కౌగిటి కాగ రెవరు ;
అంతకుని దున్నకే పెద్ద గంత గట్టి
చబుకు ఝళిపించు శక్తికి స్వామి నౌదు.

నవ్వుచుంటి విదేమిటి, నడికిరేయి
కడుపులో నుండి బోదురు కప్ప మాడ్కి ?
బడుగురొమ్మున పెద్దమ్మ పాదమిడగ
ఇనుపగజ్జెలు గలుగల్లుమనిన రీతి ?

నావలెనె నీవు పేదమన్గడ భరింప
నోడి జడమువై పడియున్నవాడ వేమొ ?
సహజశిలవేని, నీకెంత జాడ్యమున్న
నవ్వు లోననె పిడుగులు రువ్వ లేవు.

రాయి :

నా దొక విషాదగాథ, నానా విషాద
గాథ లన్నియు గక్కిన గరళధార ;
ఊన్మచే పార్వతికి అనుజన్ము నయ్యు
కర్మచే మోతు నట్లు దుఃఖముల గములు.

దొంగ, దొర భేదమే లేక త్రోవ బోవు
ప్రతివిచారము కేను దర్భాసనమ్ము ;
నన్ను జీర్ణించు కొన్న చింతా చితాగ్ని
పథపరివ్రాజకుల నిట్లు పల్కరించు.

జనని – జనకుని విడవాడి, సఖుల బాసి,
ఒంటి నిట్లేడ్వ రాదు నీవంటి వాడు ;
లెమ్ము, మిత్రమ ! ఇగురెత్త నిమ్ము ఆశ ;
లేదు సంపూర్తి, మృత్యువు లేదు జగతి !

ప్రొద్దుపొడుచుట గ్రుంకిపోవుటకె యైన
పొడుచుటకు కారణమ్మేమి పొసగ చెపుమ ?
పూవుపూచుట రాలిపోవుటకటన్న
రాలిపోవుట పూచుట కేల కాదు ?

జనన మరణాల సంపూర్ణ సరణి నర్థ
వృత్తమే చంద్రునట్లు కన్పించు నీకు ;
ఆవలి సగమ్ము లే దందువా ? అదింత
కన్న సుభగమ్ము కా దందువా ? మనీషి !

బ్రతుకు కృషి కెల్ల మృత్యువే ఫలము కాదు,
మృతి కితోధిక రమ్య జీవితము ఫలము ;
కనుక, బ్రతుకునె ప్రేమించు కొనుము, మృత్యు
దేవతను మించి ఇది బహుధా వదాన్య !

ఉదయము :
భువి ననాదిగ వచ్చుచు పోవుచున్న
జీవయాత్రకు భాష్యము చెప్పువాడ
వో శిలామూర్తి ! దివ్యర్షి వోయి నీవు !
సంధ్య వీవు ఆశానిరాశలకు మధ్య !

ఉదయసంధ్యవు నీవు, నీ హృదయమందు
మనుజుని నిరాశ ఆశగ మారి వెలుగు,
ఏ శిలాచిత్త కాఠిన్య మెట కరించి
రాల్చు చున్నదొ ఆశనిరాశ గాగ !

ఈ యనంతకాల పథాన నెవరో నన్ను
మైలురాయిగ వేసిన మాట నిజము,
తిమిరమును వండి వెలుగును దించినావు,
గడుపు నన్నిది ముందు మకాము వరకు.

(నాతో)
ఇంక లెమ్మోయి, సఖుడ ! నీ యెల్ల ప్రేమ
నేలుబడి చేయు ప్రియురాలు కేలు సాచె ;
అఖిల విశ్వము నొక రాట్నముట్లు త్రిప్పు
రాణి నీకొరకాగె హారతిని బట్టి !

కోపగింపకుమా, ఆమె కుటిల కేశ
పాశము లకింత నీకు కన్పడక యున్న -
అలపుతో నాడు కంటి వావలి మొగముగ !
వలపుతో నేడు చూతు వీవలి మొగముగ !

రుచులు, రోచులు, మధురాభిరుచులు, సత్య
భానుభూతులు విశ్వకల్యాణ మందు
మంగళాశంసనములు ; ప్రేమాభిరామ
రాగ పల్యంక మిది, యెక్కి రమ్ము వేగ !

కోకిలమునకు కూడు గాకుండ నెండి
కూలిపోవుట చిగురాకు కోరుకొనునె ?
అలరు పాటయ్యె, పాట మొగ్గయ్యెనో హ !
గుండెగలవాని కిది నించు పండువు గద !

అడుగు పెట్టు మీ యాశా మహావకాశ
మధుర మాధవ సుప్రభా మండలమున,
గజ్జె గట్టిన దామని కజ్జలాశ్రు
జవనికల వెన్క నీదారి జారిపడుచు !

## పరిణామము

ఓయి వసంత ! గ్రాసయి, వియోగ దవాగ్నుల దూకి, భస్మమై
పోయెదొ ! గ్రీష్మవేగమున
భూనభముల్ పొగలేవ నెఱ్ఱగా
కాయము బెంచి, లోకములు
కాల్చెదొ ! చిత్తము భీతమయ్యె ; నీ
కోయిల మిన్న తోడ నిను
గూర్తును, కోపము సంహరింపుమా !

నను గని నేనె జాలిపడు
నట్టిది నా స్థితి నుండి, నిన్ను గ
న్గొన హృదయమ్ము వ్రయ్యలగు
నోయి ! విభగ్న మనోరథాల తె
ర్వున నొక జీవగఱ్ఱ నయి
పుట్టితి కావున విప్ప జాలుదున్
క్షణమున నెట్టి చిక్కు లయి
నన్, దయసేయుము మా పొలాలకున్ !

వణము లివే, ఇవే సుకృత
వల్లికలున్, ఇదె సౌరభమ్ము ; శ్రా
వణమను చీర గట్టుకొని
పాత్రను మార్చి నటించి నంత మా

త్రన నయిజమ్ము మారగల
దా ? ఇవి యూడుపు చేలగట్లు, నం
దన మిట వచ్చి వాలినది,
తాల్చిన దెల్ల మధూద్యమమ్ములున్ !

ఓయి వసంత ! ఆర్పుకొను
మోయి భవద్విరహానలమ్ము, నీ
కోయిల రైతు కామినుల
కోమల కంఠము లాశ్రయించె ! ఆ
తోయరుహాక్షులన్ దరిసి
తుమ్మెద పాటల నేలుకొమ్మికన్
ఓయి వసంత ! రమ్మిది వి
నూత్నపు సేద్యము, సేద్యగాడవై.

కోయిల గాన మాపి, తన
కూటికె లేక, అదృశ్యమై యెటో
పోయిన దంచు బెంగటిలి
పోదువు ; ఏ కృషియున్ రవంతయున్
జేయని రంగుబొమ్మలకు
చేసిన వెట్టికి డస్సిపోయి, తా
హాయిగచేరుకొన్నది క
శాయతనమ్ములు పల్లె కొమ్మలన్ !

రూపము మార్చి, కూర్మి కృషి
రూపము దాల్చి, విశాల విశ్వమే
నీ పరిసేవనమ్మునకు
నృత్యము చేయును ; కర్షకాకృతిన్
మా పొల మేలుకొమ్ము ; వరి
మళ్ళకు జీవమువోసి, సస్యల
క్ష్మీ పద నూపురాన నొలి
కింపు మభీష్ట శుభ ప్రభారతుల్ !

## అతడు - ఆమె

అతడెవరో కాని, ఆమె వరాస్య కుముద
కోరకము వంచుకొన్న చకోరకమ్ము !
ఆమె కంటికి తన కోర్కె లప్పగించి
తనువు మరచి ప్రవర్తించు వనకలాపి !

అతడెవరో కాని, ఆ మధురాధరా ము
ఖేందు చంద్రిక లోన ద్రవించి పోయి
కుంచె నడిపించు తన లేతగుండె ముంచి –
బ్రహ్మలోకమె మునివ్రేళ్ళపై నటింప !

**2**

ఆమె యెవ్వరో కాని, ప్రాయమ్ము పొంగి
లోకములు ముంచి, ఆతనిలో మునింగి,
కలయొ, కుంచెయొ సాగు మార్గమ్ములోన
రస్యరేఖగ ప్రవహించు రాగరసము !

ఆమె యెవ్వరో కాని, ప్రేమార్ణవమున
నీతని మున్కలు వేయించు నమృత లతిక !
అతని దృక్కరమ్ముల నెల్ల నపహరించి
పగటినే రాత్రిచేసిన పర్వదేవి !

## 3

అతడు కవిరాజు, ఆమె కావ్యప్రపంచ
రమ్య కౌముది ; నవ కళాస్రష్ట యతడు,
మహిత బహువర్ణ రస సమామ్నాయ మామె !
శిల్పి యాతడు, రమణీయ శిల్ప మామె ;

వార లే జీవనజ్యోతి గారవంపు
ముద్దుబిడ్డల ! ఏ తీవ బూచినారొ !
వారు లోకాని కెట్టి దివ్యమ్ములైన
ప్రగతి గతులను జూపింప బంప బడిరొ !

## ఒక్కరాత్రి

నిన్ను గూడి నే నాడుకొన్నన్ని నాళ్లు
మనసులో నీ తలంపె పుట్టినది కాదు ;
కలసి యున్నంత కాలము - కాలమొకటి
కలదు మనమధ్య ననుకొన్న కరణి లేదు.

ఎన్ని మధుమాసములు మన చిన్నివలపు
తలపుమొగ్గల ముద్దాడి తనిసిపోయె !
అంత సౌఖ్యమ్ము హృదయాన నమరి కూడ,
ఒక్క రాత్రికె నిను వీడి ఉమ్మలింతు !

విధి నిర్వహణము లోనవెడలి పోయె
పగలెటుల, కాని - రాత్రి యే పగిది గడచు ?
పూలతావికి నిన్న నీ ప్రొమాల లేని
పదును నే డెక్కడిదొ, గుండె నదిమి గ్రుచ్చు !

స్వప్న సౌందర్యముల కాటపట్టు రాత్రి,
ప్రణయ సౌధాన అమృత తల్పమ్ము రాత్రి,
రాత్రి లేకుండ నేనెట్లు బ్రతుక గలను ?
రమ్ము, నెచ్చెలి ! రాత్రికి రాత్రి వగుచు !

## కలలు

ఏదియో అతిలోకమై, హృద్యమైన
దేవతారామ సీమలో నీవు - నేను
ఇర్వురము మాత్రమే విహరించు చుండి
కల చెదరి పోయి, అదరి మేల్కొంచినాను !

నా గుడిసె లోన, కుక్కి మంచమున, పండు
కొన్నవాడను నే పండుకొన్న యట్లె
కన్ను తెరచితి ; ఎంత సౌఖ్యము క్షణాన
భగ్నమై, నన్ను పడద్రోచి పైచె నిటకు !

ఏది యా కల్పక కుటీర, మేది యా సు
శీతల చ్ఛాయ, ఏది యా శీతభాను
సేవ గొనుమోము ? ఎచట వసించు నిపుడు ?
దక్కినవి సొలెగూండ్లు మాత్రమ్మె నాకు.

కన్నుమూసిన - నీ తోడి కాంచనాద్రి
శిఖర సానువుల విహార సుఖము ; సుంత
కన్ను తెరచిన - నా తోటగట్టు మీది
ప్రాతగుడిసెనే యేకాకి బ్రతుకు నాది !

ఏమి కలలివి – అంతలో నీ మనోజ్ఞ
మూర్తి జూపించి, తెచ్చి నా ముందు బెట్టు !
ఎచటి కలలివి – ఇంతలో నెవరు లేని
శూన్యమున నన్ను దిగబెట్టి సురిగి పోవు !

కలకు – కలరూపునకు మధ్య కంటిరెప్ప
తలుపు మాత్రమె నిలిచి మంత్రమ్ము నడుపు ;
తలుపు మూసిన కనిపించు తరుణి వీవు
తలుపు తెరచిన మాయమ్మై తొలగుచుంటి !

స్వప్న సౌభాగ్యమై యున్న సరసభావ
మెంత కాలానకు ఘనీభవించి, మించి,
వాంఛ దీరగ జాగ్రత్ప్రపంచ మందు
నీవు లభియింతువో, యెంచ నేరకుంటి !

## నమోవాకము

శారద చంద్రబింబము వి
శాఖ దిశా ముఖ మండలమ్ము ; గుం
టూరు నితంబ సీమ సుమ
నోజ్జము ; తిర్పతిదేవు నాభి వి
స్ఫారిత పాద పద్మకము ;
ప్రాగ్గిరిపంక్తి విశాల వేణి ; మం
దారము మా నవాంధ్ర జన
తా జనయిత్రి ధరిత్రి కంతకున్ !

రస పూర్ణమ్ము, వసంత ధామము, కళా
రామమ్ము, కల్యాణ కా
వ్య సుమారాధ్యము, భావనా కుహుకుహూ
వాదమ్ము, వాగ్గేయ సా
ర సమారంజిత శింజినీ ఝణఝణా
రమ్యమ్ము మా యాంధ్ర ; మీ
వసుధా భాగ్యసుధా స్రవంతికి నమో
వాకమ్ము లర్పించెదన్ !

దేశము జుట్టబెట్టి తల
దిండుగ బెట్టుక నిద్రపోవు ఆ
వేశము తెల్గు వానిది ; ప్ర
వేశము తక్కువ కార్య నైపుణిన్ ;
ఏ శిఖరాల వెంబడి గ
మించునొ, ఏ శశిపై శ్రమించునో ;
ఆశల కళ్లెముల్ వదలి
యభ్రపుటంచుల స్వారి చేయునో ?

పరమకవిత్వ మందు ప్రతి
బాలుడు బమ్మెరపోతరాజె, సుం
దర తర గాన మందు ప్రతి
తమ్ముడు తానొక త్యాగరాజె, స
త్వర వరదాన మందు ప్రతి
వాడును అచ్చపు భోజరాజె, నే
డరయ నవాంధ్ర మందు ప్రజ
లందరు రాజులె, రాజ తేజులే !

పాగా చుట్టి, జలత్రమున్ గొని, పయో
భద్రుండు మా యాంధ్రు డు
ద్యోగ ప్రౌఢిమ గట్టుపై నిలువగా –
ద్యోవీధి కేల్మోడ్చి, కృ

ష్ణాగోదావరులన్ మలంచి నజరా
నా పెట్టదే ! క్షేత్ర గం
గా గార్హస్థ్యము మా కృషీశ్వరుని లో
కారాధ్యు గావింపదే !

భావము పొంగి, నేడుగద
వచ్చినదాంధ్రకు రాజ్యమంచు, గో
దావరి నింగిదాకి వర
దై నటియించిన దూళ్ల మీద ; వి
ప్లావితు లైన మమ్ము భుజ
వల్లరులన్ బయి కెత్తి సర్వ భూ
మీ వలయమ్ము కళ్లు మిరు
మిట్లుగ వెల్గిన దొక్కసారిగా !

శ్యామల సస్య పుష్కలము,
స్వాదు ఫలోపవ నాలయమ్ము, ల
క్ష్మీ మహనీయ నాట్యసర
సీజము, మా విపులాంధ్ర ; మీ సుధా
ప్రేమరసమ్ము గ్రోలి మధు
రిల్లిన కంఠము నెత్తుదున్ - తదా
శా మకుటప్రభా లసదు
ష స్సుమనస్సు మనోజ్ఞ గీతులన్.

ఈ వనవీథు లందు నటి
యించు వసంతము చిమ్ము కొంచు శ్రీ
దేవి పదాబ్జముల్ ; ప్రగతి
తెర్వులలో వికసించు కోకిలా
రావము ; సాహితీ విమల
రాగముతో నుదయించు భావనో
జ్జీవన జీవన ప్రణయ
శిల్ప మహోదయ భాగధేయముల్ !

## 2

వాణియ తీర వాటిక, భ
వానియె రాయలసీమ, శ్రీ తెలం
గాణము ; పూర్ణ రాజ్యరమ
గా ముగురమ్మల మూర్తి దాల్చి, గీ
ర్వాణ పథమ్ములన్ గదలి
వచ్చితివే ! జగ మేలుకొమ్మికన్ –
రాణ దలిర్చ, మానవత
రంజిల – ఆంధ్రమ ! భాగ్యసాంద్రమా !

(ఆంధ్రావతరణ సందర్భములో)

# పరిశ్రాంతి

కొబ్బరిరెమ్మపై కూర్చున్న రెండు
పక్షులు గూటికై పయనమై పోయె,
గౌతమి తీరాన కథ చెప్పికొనుచు
ఇర్వురు కార్మికు లేవైపొ చనిరి !

రవి పోవు మార్గాన రథ వేగ గతిని
రేగిన సంధ్యా పరాగమ్ము నిండె
జగ మెల్ల ; అంత రంజన పొంది రజని
కబరీ భరము జారి కాంచె జాగృతిని !

ఎల్ల సృష్టియు విశ్రమించె, ఒంటరిగ
చింతించు నా చుట్టు చేరె తారకలు ;
ఓ నెచ్చెలీ ! నీవు లేని యీ రేయి
వేసవి పగలట్లు వేగించు నన్ను !

## అభీష్టము

పూవు లిన్నిట నే యొక్కపూవు నైన
పాట లిన్నిట నే యొక్క పాట నైన
రసమయమ్మైన నీ యంతరంగ మందు
నాకు తావుండకే పోవునా రవంత ?

వివిధ రీతుల నీ తోట విరిసి విరిసి,
బహువిధమ్ముల నీ బాట పాడి పాడి,
నిన్ను కరగించి, నీ గుండె నిలిచి, నేను
పాలనము చేయకుందునా ప్రణయ జగము ?

కాను పూవును, పాటను కాను నేను ;
కన్నులకు గాని – చెవులకు గాని – యింత
చెన్ను నిడలేని కుమ్మరి మన్ను నేను,
తొడవు కాలేని మూగగొంతుకను నేను.

పూవునో, పాటనో అయి పుట్టు వరకు,
ఎట్ల నీ వాకిటనె వసియింప నిమ్ము,
ఎపుడు నీ కుంచె పిల్పు విన్పించ గలదొ !
ఎపుడు నీ వీణ పొల్పు కన్పించగలదొ !

## దొంగల జంట

పూవుల సజ్జ కేల గొని
పోయెడు కన్నియ వెన్కమాటుగా
పోవుచు, తీసినాడ నొక
పూవును దొంగతనాన ; దాని నా
తీవియబోణి వేణియనె
తీరిచి దిద్దుచు నుండ, "పట్టుప
డ్తా" వని తేటిబోటి ఎగ
తాళిగ నవ్వెను, నవ్వితే నునున్ !

కిచకిచమని ఆ విమల వి
కచ కుసుమము తెల్ల నవ్వె ; కలకల వేణీ
రుచి నవ్వెను ; నవ్వెను నా
పచరించిన పూవు ; పట్టుపడితిని నేనున్ !

'నే నెరుంగను ; తీవియబోణి వగుట
పూచికొన్నది నీ వేణి పుష్పములను ;
పుష్పవతి నైతివిప్పుడు పూవుబోణి !
ఎవ్వరికి నైన మధుమాసమే చిరేచ్చ"

## 2

దొంగతనమది ; పువ్వును దొంగిలించి
నేను హృదయమ్ము గోల్పోతి నేమి చెప్ప ?
"పువ్వు, హృదయమ్ము గూడ కోల్పోతి" నంచు
ఆమె వగచెడు నంట ! న్యాయమ్మె తనకు ?

ప్రేమ దోచిన పువ్వు నర్పించినాడ
నామె వేణికి నప్పుడే ; అదియు గాక –
నేను పోగొట్టుకొనుటయె నిజము గాని,
ఇర్వురమును గోల్పోవుట యెట్లు పొసగు ?

ఎట్లయిన, దొంగతన మది ; ఎచట దాగు ?
కడల నెల్లను వికసింప దొడగె నదియు ;
స్వర్ణ మైనను దాచగ వచ్చు గాని
ప్రసవమును దాచ, దాని సౌరభము నెట్లు ??

కరకరమని పొడిచెడి భా
స్కర కరముల నుండి దాగి, గ్రక్కున రాత్రిం
చర శబరుని వాగురలో
శిర మెత్తితి మయ్యొ ! చెప్ప సిగ్గౌ మాకున్ !

## 3

"ఇరువురు దొంగలా ? అయిన
　　నెట్టిది చౌర్యము ; దొంగవస్తు వె
వ్వరి ? దెట నుంచినారు ? ఇటు
　　పట్టుకరం, డిట పెట్టు" డంచు, ఆ
సిరికొడు కెవ్వడో చెరకు
　　సింగిణితో బలు కొల్వు దీరి, ని
ష్కరుణత వారి హృత్సరసి
　　జమ్ములు నొవ్వగ నేసె ప్రశ్నలన్ !

ఇర్వురును మౌనమూని, తామే మెరుంగ
మనెడి పోలికి నుండ, న్యాయాధికారి
ఇర్వురను పట్టి బంధింప నిడియె నాజ్ఞ,
పండువెన్నెల మల్లెలు పండు వనగ !

"ఇర్వురును దొంగలే యగు టెట్లు ? దొంగి
లింపబడి నట్టి దేదియు లేదు చూడ ;
కలిపి కట్టగరా" దని పలికినారు
న్యాయవాదులు ; కొందరన్యాయ మనిరి !

దొంగిలించిన వస్తువు దొరకు వరకు
ఇర్వురను కట్టి వైచిరా యిగురు మావి
తోట ఖైదున ; మాధవోద్యోగి గణము
పరభృతమ్మయి గస్తీలు తిరుగు చుండ !

## 4

ప్రేమదొంగలు ; వారి జీవితపథమ్మె
పరిమళించుచు నుండు ; పుష్పమునె గనక
సౌరభమ్మును కనుగొను జాలు నెవడు ?
వారి యనుబంధ బంధమ్ము జారదింక.

విసవిస కుసుమాసవముల
పసిమిని ప్రాయములు భద్రపరచిన వారే
కుసుమింతురు, మిసమింతురు
రసికాగ్రణి గణ వరేణ్యా రసరాజ్యములో

## యుహోయుహస్సు

నిన్ను ప్రేమించి, నను కరుణింపు మనుచు
అడుగుదమ్ములు సోక సాష్టాంగ పడితి ;
విసరి వచ్చిన దీ పువ్వు విరసమునకొ ?
కరము చీల్చిన దీ మల్లె సరసమునకొ ?

ఆ పికశ్రావ్యరవ మపహాస్య మేమొ ?
భ్రమర భీకర ఝూంకృతి స్వాగతమ్మొ ?
రమ్య చంద్రోదయమ్ము నిరాకరణమొ ?
ప్రళయ గంభీర మేఘగర్జనము చనవొ ?

కుసుమిత లతాంగి ! కలకంఠ కోమల ప్రి
యంవదా ! శరచ్చంద్రికా హాసరేఖ !
రమ్మనుటయో ననున్, లేక పొమ్మనుటయొ !
ఎట్లు చదువుదు నేను నీ హృదయ లేఖ ?

## తృణపుష్పము

నీవలె నేను కూడ అవ
నిన్ జనియించితి గౌతమీ పద
శ్రీ వికసించు తీరమున ;
జీవన కాలము రాకమాన, దా
శా వలయమ్ము నా మధుర
సౌరభ పూరము గాక మాన దం,
చే వసియించినాను ; తృణ
సీమల రాజ్యము లేలి నానునున్ !

నీవలె నేను కూడ కరు
ణించెడి పాంథుల సాధు పాద రా
జీవము లత్తి, సేవలను
జేయుచు, డెందము లోన నా రమా
దేవికి కట్టుకొంటి నొక
దివ్య వసంత సుమాలయమ్ము ; పూ
జా విధి నన్ను నేనె విరి
సజ్జల కెత్తితి గుత్తుగుత్తులై !

నీవలె నేను కూడ పయి
నించితి, భావనమాత్ర మౌను, బృం
దావన రాసవేదులకు,
నందన వీథులకున్ ; సమస్త వి

శ్వావధు లెక్కి, వాని పర
మార్థములన్ గొని చొక్కినాను, నా
దైవము నా యెడందని స
దా సుఖనిద్రను దోగి యుండగా !

నీవలె నేను కూడ మర
ణించితి నేల ననా[illegible]కమ్ముగా ;
మావి యిగుళ్ళ పొత్తుపయి
మక్కువ తీరని గుండెగూటిలో
కోవెల మాత్ర మిప్డు ప్రతి
కొమ్మను దానయి కంఠ మెత్తెడున్ ;
ఓ విరిబోటి ! జీవిత మ
హో – ప్రతిబంధక మాత్మ సిద్ధికిన్ !

## అసూయ

నీ గొంతులో గొంతు మ్రోగించు నను జూచి
పిక మేమి ద్వేషమ్ము పెంచు కొనునో !
నీ చూపులో చూపు నియమించు నను జూచి
పద్మాకర మ్మేమి బాధపడునో !
నీ కోర్కెలో కోర్కె నిర్మించు నను జూచి
మధుపాయి తానేమి మండి పడునో !
నీ యడుగులో అడుగు నెలకొల్పు నను జూచి
ఛాయారమణి యేమి సణుగు కొనునో !

నీ మహా జీవితాబ్ధిలో నా మనుగడ
నొక నవోర్మిక రీతి దిద్దుకొనుచుండ –
ఏ ఘనుం డెట్టి భేదమ్ము నెంచుకొనునో !
చెలి ! పరాకును చిత్తగించెదవొ సుమ్ము !

మౌనముగ నేను నీ మార్గ మనుసరించి
ఎదురు పడు ప్రాణి నెల్ల ప్రేమించు కొనుచు
సాగిపోవ, ఎట్టి యసూయ రేగి నన్ను
చెనకునో ! కొంచె మిటు చూచుకొనుచు పొమ్ము !

## కృషి ప్రశస్తి

ఓహో, కృషీవల ! ఓ కష్టజీవి !
జీవాలు సంసృష్టి జెందు నీ కృషిని,
లోకాలు జీవించు నీ కష్ట మందు,
అన్నదాతవు నీవు, అన్న మే నీవు !

ప్రొద్దుకంటెను ముందె నిద్దుర లేచి
క్షేత్రలక్ష్మిని భక్తి సేవించు వేళ
పొంగారు నీ రక్తి పువ్వుపువ్వునను !
నిండారు నీ శక్తి పండుపండునను !

భవదీయ కృషిగీతి భావార్థ రుచులు
కోకిల కంఠాల గూండ్లు కట్టినవి !
ఈల కొమ్మలలో నుయాల లూగినవి !
వేణు పవనాలలో విశ్రవీగినవి !

ఉదయపర్వత వాటి నుదయాన పూని
సాగదోలిన నీదు నాగేటి సాలు
సంసార జీవన సారణి గాగ
ప్రవహించు రవితేజ మవనీ తలాన !

సూర్య ప్రసూనమ్ము చూచు నీ మోమె
ఆత్మేశు దర్శింప నరుగుచు ముందు ;
వనలక్ష్మి తొలుదొల్త నిను పల్కరించు
ఆర్తవ యోగ్యమై అన్ని కాలముల.

ఎద్దు దోలెడు నెడ నీశ్వరుండు,
విత్తనమ్ములు చల్లు వేళ నజుండు
పంట ప్రోవును చేయు పట్ల శ్రీ శుండు,
మూర్తిత్రయీ రూపమును గొంటి వీవు !

ఈవు పెట్టక అన్న మే లేదు భువికి,
నీవు పోయక నీరమే లేదెవరికి,
నీ వింత కష్టించి నిర్మించకున్న
కంటకాటవి గాక కలదె మానుషత ?

వ్యవసాయకారణ హలము కరాన,
భువన సమ్మోహన రవము కంఠాన,
విశ్వ ప్రవర్తక విధి జీవితాన,
వెలయు నీ కిల సదా విజయమౌ గాక !

ఎద్దులు నీడలో నిద్దుర పోవ,
నాగలి పొదలోన నక్కి పరుండ,
కోకిల గూటిలో కూర్చుండి పాడ,
కృషికుడు కష్టించు గ్రీష్మాతపమున!

ఎడపెడ పట్టి కొట్టెడు గాలివాన,
సృష్టి సృష్టియె దాగు చీకట్ల లోన,
దెయ్యాలచెరువుక్రింది పొలాన చేరి
రైతు కష్టించు వర్షానిశీథమున !

అలివేణి బంతిపువ్వులు తాల్చి జగము
ప్రభల తీర్థపు సేవ బయనమై పోవ,
చెరకుగానుగ డాసి, చెమటోడ్చి తీసి
కర్షకు డందిచ్చు కడుపుతీపి రసము !

చైత్రోత్సవములో వసంతమ్ములాడు
తిరులక్ష్మి యింటినౌకరు సేద్యగాడు ;
సౌఖ్యమ్ము వడ్డించి, శాంతి దాహమిడి,
ప్రగతి బెంచుచు, తాను పస్తుండు గేహి !

ఓహో, కృషీవల ! ఓ కష్టజీవి !
జగముల గాల్చు నీ చండాతపమున
గొడుగు పట్టును నీకు గున్నమామిడులు ;
తలిరు వీవన వీచు మలయ మారుతము.

రత్నగర్భను గొల్చి, రత్నాలు కొల్చి,
గాదెలు నింపి, ఉగాదుల కంపి,
శిశిరర్తు శాఖగా – చిరబుద్బుదముగ
మిగిలిపోదువు నీవు, పగిలిపోదువును !

పగ లెల్ల పనిచేసి భాస్కరుడేని
విశ్రాంతి గొనకుండ వెడలడే రాత్రి ;
రైత ! నీ కృషిలోన రాత్రింబవళ్లు
రెండొక్క రూపమై పండించు బ్రతుకు.

పొలి పదంపు ముగింపె తొలి పదమ్మునకు
పల్లవిగా జేసి పాడుమో యన్న !
పాట అఖండ, మపార, మాద్యంత
రహిత, మానందకరమ్ము నీవలెనె !

వనలక్ష్మి యొడి నుండి వరలక్ష్మి నెత్తి,
క్షేత్ర లక్ష్మిగ బెంచి, శ్రీలక్ష్మి జేసి,
రహి నాంధ్రలక్ష్మి దర్బారులో శ్రీలు
గళ్లుగళ్లన గజ్జెగట్టింపు మోయి !

ఓహో, కృషీవల ! ఓ కష్టజీవి !
పడదున్ని వేయుమా పల్లేరు పొదలు !
పరికించి తీయుమా మెరక పల్లములు !
పండించి పోయుమా గుండెపండుగలు !

తొలకరి నీ కేసి తొంగి చూచినది !
గౌతమి నీ దారి కదలి వచ్చినది !
పుష్యమి నీ తోడ పొత్తు గల్పినది !
సర్వోదయము వంక సాగు మీ వింక !

## శిశిరము

ఆకులు రాల్చుకొన్నది ; వి
హాయసవీధిని కన్నుగ్రుచ్చి, ఏ
కాకిని వోలె నిల్చినది ;
కాలము తీరిన మ్రోడుగా జనుల్
వాకొనినారు ; మా కుసుమ
వాటిక కింక నవోదయమ్మె లే
దా ? కమనీయమై, మధుర
మై ఇక లోకము నందగింపదా ?

కాలము మారి ; ఆమని వి
కాసము తీరి, మధుపత్రాల పే
రోలగ మాగి, కోకిల కు
హూ కలగానము వీగి, తల్లి ! మా
పూలవనమ్ము కష్టముల
ప్రోవయి నిల్చుట కేమి హేతువో !
ఈ ఉలుగసాను ప్రొద్దు లిటు
లెన్ని యుగమ్ములు సాగునో గదా !

పూజలు చేసి మా వనము
పూర్వము పూర్వదిగంగనా ముఖాం
భోజముగా ప్రపంచమును
ముంచెను మోహనరాగ కాంతులన్ ;

ఏ జన మెందు మేల్కనిన,
హేతువు మా సువిభాత గీతులే ;
ఆ జవసత్త్వముల్ సడలె
నా ; అరుణోదయ మస్తమించెనా ?

"ఇది శిశిరమ్మ, పుత్రక !" అ
నే యొక చల్లని మాట - తల్లి ! నా
హృదయము కోరు ; "కాలము త
రించి, రహించి, సుమించు కోసమే
చిదిమితి పండుటాకు" అని
చెప్పుము, చాలని సంతసింతు ; అ
భ్యుదయము కోరి, దివ్యదను
భూతిని చేరి వసింతు తృప్తితో.

మానవజాతి మాది, నర
మాంసము నంజిన నాటి వారి సం
తానముగా నిరూపణ మొ
నర్చుచు నుందుము నేడు ; శైశిరో
ద్యానము జూచి యేడ్తుము గ
దా - మరి, మా కెపుడమ్మ ! శోభనా
మ్లాన మహోదయావ్యయ క
ళామయ జీవన ఖేలనమ్మిలన్ ?

కోయిల నేనయ్యె, మధుర
  కోమల రాగము నేన యైనచో,
నా యెలదోట నొక్క సుమ
  నస్సౌనరించి, నితాంత చైత్రమై
పూయనె ? పోవనిత్తునె న
  వోదయమున్ ? అడు గొక్క మెట్టుగా
ఈ యఖిలావనిన్ నడుప
  నే ? పరమావధి జేర్చకుందునే ?
(స్వాతంత్ర్య లబ్ధికి పూర్వము దేశమాత నుద్దేశించి)

## ప్రతీక్షణా

ఎంకాల మీ యాశా మహీధరోన్న
తోపలమ్మున గూర్చుండి, యుష్మదీయ
ప్రేమరాగోదయము గోరి వేచియుందు ?
వేదవీథుల కనుమూసి వెదకుచుందు ?

ఒక్క చేత నిశీథిని, నొక్క చేత
దివసమును బట్టి, ముద్దాడి కవల లట్లు,
ఒక్క ఊయెలతొట్టనే యుంచి, ప్రకృతి
లాలనము చేయు, నెవరి యిల్లాల గాని !

కొండ యంచులపై మేపుచుండు లేళ్ల,
పక్షులను చేర్చి పాడించు వృక్షతతుల,
పశ్చిమమ్మున రాత్రి, పూర్వమున పగలు
చంద్రసూర్యుల యొడి సరసమ్ములాడు !

కాయకష్టముతో ప్రభాకరుడు తాను
నిత్య మార్జించు సత్కళానిధు లసంగి
రాజు బోషించు చున్న మార్గమ్ము చాల
సన్నిహితమయి, జీవితసరళి దెలుపు !

శాంతి యెరుగని ప్రకృతి సంసార మందు
కాంతి గల పట్టులం దెల్ల గాంచినాను,
నీడవో నీవు ! లేక ఏ నీడ నిలిచి
నాకుగానయి వేచియున్నావొ గాని !

ఎంతకాల మీ యాశామహీధరోన్న
తోపలమ్మున నే వేచియుందు నంచు,
వంగి ముందుకు, సెలయేట తొంగి చూడ
నిన్ను నసె గాంచి, కన్నీట నిండిపోతి !

## చిత్రలేఖనము

నా బ్రతుకు చూచి, నను చూచి, నా పటమ్ము
వ్రాయబోకుము, విఫలుడ వగుదు వీవు ;
కంటకశిలా మయావని గర్భ మందు
రత్నరాసులు నుండు, పరాకు పడకు !

భూత మన రేగు కాలజీమూతమునను
నరనరమ్మున బ్రవహించు కరుణారసము,
నీటు కనుపించు నీ కాలిబాట లోన
అణగియున్నవి శతకోటి తృణ సుమాలు.

నా బ్రతుకు చూచి, నను చూచి, నా యెడంద
రూప మూహింతు వేని, సరోరుహాల
వెనుక గల పంకమును, లేక వికృత కీట
కమున సారంగమును పసిగట్టు గలవు.

ఏ లతాంగన నైన రచించు ముందు
అందు దాగు వసంతమ్ము నరయ వలయు,
పొంగి ప్రవహించవలయు సంఫుల్ల మగుచు
కుంచె కొట్టిన ప్రతి గీత కృష్ణవేణి !

నా బ్రతుకు చూచి, నను చూచి, నా యభీష్ట
లక్ష్యసిద్ధిని గుర్తించు లాఘవమ్ము
కరమునం గలదేని దగ్గరకు రమ్ము –
రంగు లున్నవి హృదయాన రంగరించి !

# విహంగవాదము

(రంగ ముద్యానవనము, చైత్రమ్ము, సమయ
మసమ మధ్యాహ్నము, మనోజ్ఞ కుసుమ సార
సౌరభానంద భరితము, సరసవిహగ
కులము లక్కడ నీడల కొలువు తీరె !)

కోకిల :
క్రొంజిగురు భోజనము చేసి, కొమ్మ లందు
విలసనమ్ముగ జంటజంటలుగ గూడి,
ప్రేమహృదయాలు పాలింతు మేము, శ్రావ్య
గానముల తోడ హృత్తంత్రికలను మీటి :

చిలుక :
బాల మామిడిచెట్లపై ఫలరసాలు
గ్రోలి, రామ నామామృత రుచుల దనిసి,
భక్తజనముల కద్దాని బంచి యిచ్చు
పుణ్యజీవుల మేము నవోదయమున !

గోరింక :
మిడుతలను పచ్చపుర్వుల మేసి వేసి,
సేద్యగానికి సాయమ్ము సేతు మేము ;
మావితోపుల నీడల మసలు చెలుల
హృదుల నుప్పొంగ జేతుము ప్రేమరసము !

తుమ్మెద :

పూలు ప్రియురాండ్రు, తేనెలు భోజనములు,
తామరస బాల లిండ్లలో తల్పకములు ;
భ్రమరగీతలు లేని పుష్పవన మెందు
గల్గు ? అది లేని ప్రణయమ్ము కల్గునెందు ?

వడ్రంగిపిట్ట :

పైపయి విలాసములు మీవి, ప్రణయ మనుచు
తేరగా గంతులిడువారు కారె మీరు ?
త్రవ్వి, లోతులు చూచి, సారములు తీసి,
మీకు ఆవాసములు కూర్తు మేము కామె ?

కాకి :

గ్రుడ్డికాయలు, పండ్లను కూలద్రోసి,
తరుల నీడల జేరిన తెరువరులకు
పథపరిశ్రాంతితో బాటు క్షుధను కూడ
చల్లబరతుము మేము వసంత మందు.

(ప్రకృతి శోభల దిలకింప వచ్చి, వేడ్క
వనవిహారము చేయు దంపతులు వినిరి –
"రాణి యెవ్వరు మన నవోద్యానమునకు ?
మేము, మే" మను విహగ సంవేదములను.)

(మధ్యవ ర్తిత్వ మూనిన మలయమారు
తమ్ము నెటు లాడనీని మధ్యాహ్న మందు,
ప్రియులు వెడలిరి మధ్యవ ర్తిత్వ మూన,
మృదుసమీరము కాసంత మెదల సాగె.)

కోకిల :
ప్రేమహృదులార ! మీరు తప్పిన జగాన
మా వివాదము తీర్ప సమర్థు లెవరు ?
పాడుదునె కాని నేను, నా పాటలోని
మంచిచెడ్డలు మీరె గుర్తించగలరు.

నాదమును బ్రహ్మ మని చెప్పినారు ఋషులు ;
నాద మది గానమై, మోహనముగ జీవ
తంత్రులను మీటి, కరగించి, తన్మయత్వ
మందుకొని బ్రహ్మమగును ; ఆనంద మగును !

కళకు ఆనంద మొక్కటికాదె ఆశ
యమ్ము ? నా గాన మందు లభ్య మది కాదె ?
ఈ వసంతసామ్రాజ్యమ్ము నేలుకొనగ
హక్కు లేదందురా, ప్రియులార ! నాకు ?

కాకి :

ఆశయము కళ కానంద మగును గాక,
బ్రతుకునకు కళ యెట్లు తోడ్పడగ గలదు ?
తిండి యొసగునె కళ యెందు ? తిండి లేక
ఎట్లు భువిమీద జీవి జీవించ గలదు ?
పండు చేతికి దొరకిన బాలకుండు
పడయు నానంద మెక్కుడో, పాట వినిన
మాత్ర జెందెడి దెక్కుడో, మహితులార !
సత్యము దలంచి తీర్పు నొసంగు డిపుడు !

వడ్రంగిపిట్ట :

పాట పాడిన మాత్రాన పడయ గలరె
మధుర భక్ష్యమ్ము, రమ్య హర్మ్యమ్ము, భువిని ?
ఏమి యొల్కించునో కళ, యెరుగ రాదు ;
కళ లనగ పిచ్చివారల కల్పనములు !

కడుపు నిండిన మీదనే కళ లటంచు
పిచ్చి యూహల కాలము బుచ్చవచ్చు ;
తినుట కుండుటకును మంచి తిండి, యిల్లు
కూర్చి పెట్టెడి మాది పో కువలయమ్ము !

ప్రియుడు !

పూవుబోణి ! కనుంగొను మీ విహంగ
జాతి లోని సంఘర్షణ సరళి, ప్రకృతి
మాధురుల కెల్ల తానె సామ్రాజ్య పదవి
నంది ప్రతి జీవి పూజల నొందగోరు !

ప్రియురాలు :

ప్రియ ! విచిత్రము, ప్రకృతి ప్రవృత్తి లోని
విహగకులములె ఈ రీతి వెర్రి బడుట !
కళకు కూడును, కూటికి కళయు వలయు ;
సహృదయముగ జీవింప కీ జగడ మేల ?

ప్రియుడు :

ప్రకృతి యొడి లోని ముద్దుపాపలు మీరు,
ప్రియుల కెంగేల తొలి మాధురిమలు మీరు,
కలలకే రంగులను దిద్దు కళలు మీరు,
మీకు తగునా వివాదమ్ము ? మిత్రులార !

ప్రియురాలు :

ఇగురు గొమ్మల కొలువుండి హృద్యగతిని
పాడుకొందువు, కోకిలా ! పాడుకొనుము !
పువ్వు నొవ్వకుండగనె పుప్పొడిని తీసి
ఆడుకొందువు, తుమ్మెదా ! ఆడుకొనుము !

చిలుక గోర్వంకలార ! మీ చిత్తగతుల
బట్టి వర్తింపు డీ మధువనము లందు !
రమ్ము, కాకము ! రమ్ము, వడ్రంగి పిట్ట !
శ్రమమునకు తగు ఫల మవశ్యమ్ము గొనుడు !

తెగలు వేరైన నగుగాక, ఖగకులమ్ము
లొక్కటే జాతి ; అభిరుచు లొకటి కాక
భిన్న మగుటచే వృత్తులు భేదమయ్యె
మమ్ము సంతోష పెట్టెడి మార్గ మందు.

ఒక్కడే యధినేత కాదుర్వి కెల్ల,
అంద రధినేతలే శక్తి ననుసరించి ;
ఎవని పనిలోన వాడె ఈ యెల్ల విశ్వ
రాజ్య నిర్మాణమునకు పూర్ణాధికారి.

అన్ని శకుంతములు :
లేదు మాకు వివాదమ్ము ; లేవు మాకు
స్వ పర నీచోన్న తీతి భావమ్ము లింక ;
కులము లే ; దిక ముందు వ్యాకులము లేదు ;
సమ సమాజ వసంత వాసమ్ము మాది !

వాసంతిక :

కోయిలా ! పాడవే ! కువలయ మ్మెల్ల నీ
గానస్రవంతిలో కరగి పార ;
రండిటు, చిలుక గోర్వంకలారా ! మావి
నీడకొమ్మల జేరి యాడుకొనుడు !
లెమ్ము, తుమ్మెద ! పూలరెమ్మల రాగసా
రము దీసి యిమ్ము లోకముల కెల్ల ;
వడ్రంగిపిట్ట ! నీ పనిమీద పొమ్ము, గో
ర్వంక పిల్లకు కోటరమ్ము వలయు ;

వాయసమ ! లెమ్ము, ఎవరొ తెర్వరులు బడలి,
చేరి వెదకుచు నుండిరా చెట్ల క్రింద ;
కోకిలము కాకమును నొక్క కొమ్మ మీద
చెలగి విహరింప జూడ వచ్చితిని నేను !

కోకిలమ్మెట్టి దట్టిద కాక మవని ;
ఎవరు లేకున్న జిన్న వోయెడును ప్రకృతి ;
విశ్వ సౌందర్య మరయ వైవిధ్యమందె
కలదు ; కల దందె ఆనంద కారణమ్ము !

## గ్రామరామ

తన బావ కంటికై తన వేణి వికసించె
తను వెల్ల ముద్దమందార పూలు,
తన లేగ పంటికై తన వోణి మొలకెత్తె
పులకింపుగా వెన్నపూస గరిక,
తన తీవ చంటికై తన పాణి నెలవొందె
లేడికన్నుల అయిరేడి పసటి,
తన వీథికుంటికై తన వాణి రంజిల్లె
బువ్వ పెట్టెడి సానుభూతి పలుకు,

ప్రొద్దుతో లేచి, పంటచెర్వునకు పోయి,
నీరమును దెచ్చు మా పల్లెటూరి పడుచు
శ్రవణపేయము, నేత్రపర్వమ్ము కాగ
చేల గట్టున కడియాల కాలు కదుప !

పెసర చేనిలో పికిలింక పిట్ట యొకటి
కుండపై వ్రాలి నీరము గ్రోలి పోవు ;
వెనుక మాటున, వచ్చిన విధమె లేక,
గరికపోచలు కొరుకును గడుసు గిత్త !

చేరెడు కన్నులతో తన
దారికి నిరు ప్రక్కలందు తరి తేనియలన్
నీరాజన మిడు పూలకు
గారాములు పంచు నెడద కందళితముగాన్.

ముద్దు ముద్దుగ, ముద్దులు మూటగట్టు
పూలలో పెద్ద మందార పుష్పమీవు !
హిమకణార్ద్రమౌ నీ పాదకమల యుగము
సోకినది యెల్ల మధుర మాసోదయమ్మె !

అరుణోదయ హృదయములో
తరుణోదయ మీవు, ధాన్య ధామమ్ములతో
ధర నింతువు, దయ బెంతువు ;
వరవరీణ ! కలరె నిన్ను వర్ణించు కవుల్ !

పొంగి పారిన యౌవన గంగ నీవు
కాల జిమ్మక నడిచిన వేళలందు
కాలజీమూతములె నీదు కంకణముల
కంకణము లొల్కగా మళ్ళ నంకురించు!

పొలముల నీటి బోదెలను,
పూవులతోటల మోట బోదెలన్
నిలిచి, నవాంకురమ్ములకు
నీరము గట్టెడి వేగు వేళ, నీ
చెలువము సస్య దేవతకు
చిన్నెలు వన్నెలు దిద్దు ; అన్నపూ
ర్ణలు పదివేలు నీ వడుపు
నన్ జరియింతురు తెన్గు పల్లెలన్ !

## పరీక్ష

ప్రేయసి ! జీవితమ్మొక ప
రీక్ష సుమా ! ఎటు నంతులేని వి
శ్వాయత సీమయే మన కొ
సంగిన నేటి పరీక్షపత్ర ; మే
నాయకుడో క్షణక్షణ మ
నారతమున్ గనిపెట్టి యుండ, నే
మాయలు సాగు ? ప్రశ్నలకు
మంచి జవాబు లికెట్లు కూర్తుమో !

తెలియవు ప్రశ్నలున్, పగటి
దివ్వెల వోలె పరిస్ఫుటమ్ముగా ;
మెలకువ లైన చెప్ప మన
మీది నవాబు నిరాకరించు ; ఈ

కలము వడంకు ; ఇంత దను
        కన్ మరి శ్రీయును జుట్టలేదు ; నా
తలపులు వెఱ్ఱులెత్తి శత
        ధా వితథమ్ముగ పర్వు లెత్తెడున్ !

దొంగతనాన నెల్ల మన
        తోడ పరీక్షల నిచ్చువారి ప
త్రాంగము తొంగిచూత, మిటు
        రమ్ము, సఖీ ! మరి – వట్టిపత్ర మీ
యంగనె లేము కాన ; మరి
        యాదకు దోసిలి బట్టి వ్యర్థతన్
బెంగల గూల నేల ? రమ
        ణీ ! పడనేలను తీసివేతలో ?

అరుగోనే – జయదేవ దంపతులు కా
        రా వారు ? ఆ ముందు లాం
తరు కన్గొమ్మ – వసిష్ఠ యుగ్మకమె ; వె
        న్కన్ బోదురే – వారు క
స్తురి గాంధీ మిథునమ్ము : దిద్దుకొనవ
        చ్చున్ లెమ్ము, ఆయీ మహ
త్తర ధీశాలుర జూచి జీవితము ను
        ద్యద్దీవ్యదుద్వృత్తిగా !

మకుటము నుండియున్ మనము
మక్కికి మక్కిగ బోవుచో పరీ
క్షకు డనుమాన మొందు ; అది
స్వంతము జేసుక వ్రాయగల్గుచో
సఖి ! విజయమ్ము చేకురుట
సత్యము ! ఐనను, ఎట్లు వ్రాతుమే
సకల కళాప్రపూర్ణ మగు
చక్కని పత్రము దొంగిలింపులన్ ?

ఇట నట కొంత కొంత పరు
లెవ్వ రెరుంగని రీతి సంగ్రహిం
చుట పరిపాటి చేసికొని,
"చూడుడు నా పరు"వంచు భూమిపై
దిటవున మస్గడల్ నడుపు
ధీహరులన్ గనుగొమ్మ ! వారలు
త్కటులగు గాక, భారతి ప
దమ్ముల వారికి తావి కల్గునే ?

కావున - దొంగిలించెడు ప్ర
కారమె వద్దటు తొంగిచూడ ; కీ
తీవల, పూవులన్, మరియు
తేనెల, తేటుల, కొండవాగు క్రొ

మ్మావుల, వానిగూడి మను
మానవులన్, పుటలుంచి - దీక్షతో
దేవి ! పఠింపుమా ! మనసు
దీరగ వ్రాయుద మే పరీక్షలున్ !

కన్నులు గుంటలై వదన
గహ్వర మెండిన భిక్షురాలిచే
నున్న నిరాళపాత్రమున
నుంచిన గుప్పెడు గంజికూటిలో
చెన్నులరాణి ! చుట్టుదము
శ్రీ ; నడిపింతము లేఖినిన్ ఝనా
ఝన్నుటనమ్ముతో, ప్రగతి
చంద్రికతో, నటరాజు భంగితో !

ఇమ్ముగ ఇంటనింటను మ
హేశ్వరుడే కడు భిక్ష మెత్తు లో
కమ్మున, శ్రీ నొకర్తుకనె
కాని - సరస్వతి గాంచ లేని నే
త్రమ్ముల క్రింద, పత్రమును
వ్రాయ గడంగితిమేల బెంగ ? శూ
న్యమ్మున చూపునిల్పి, తెర
వా ! తలపోయగ నేల రిక్తతన్ ?

వర మధుమాస యామినుల,
వల్లి కుటీరములన్, స్వయంప్రభా
చరణము లంటి పొందిన ప్ర
సన్న వభావ పరంపరార్థముల్
స్ఫురణకు తెచ్చికొమ్ము, సుమ
సుందరి ! జీవితపుం బరీక్ష ప
త్ర రచనకున్ గడంగుము, స
దా మనదే జయ మూర్ధకక్ష్యలో !

# వ్యర్థఘోష

కోయిలా ! కోయిలా ! పాడవే ! యటంచు
బ్రతిమలాడుచు, వెనువెంట బడితి నేను ;
వినినదే కాదు, తిరిగి చూచినది కాదు,
అల్లనేరేడు పూల మాయమయి పోయె !

నయనపర్వము కావె, కుందమ ! యటంచు,
హృదయ రస్యము కావె, శారద ! యటంచు,
ఆత్మపేయము కావె, పుష్యమ ! యటంచు,
అందముల వెంట పోయి ఆయాసపడితి !

ఎందరినొ మైత్రి కోసమై యెంచి, యెంచి,
పిల్చి, పిల్చి నే బొబ్బలు పెట్టినాను !
ఎవరి పనిమీద వారు పోయెదరె కాని,
పృథ్వి నా యున్కి నేని గుర్తించ రేలొ !

## చెట్టు – పిట్ట

నిరుడీనాటికి నిన్ను చుట్టుకొని,
నిన్నే పూలు పూయించు చు
న్న రతీసుందర పుష్పవల్లి – మరి యీ
నాడానవా ల్మాత్రమై
విరహార్తిన్ నిను ద్రోసి పోయినదిగా ?
వీణా పరిత్యక్త ర
క్త రవమ్మట్లెట నే వియోగపథ యా
త్రాశీలమై యున్నదో !

లలిత లతాంగి మాధవ క
ళారతి గౌగిట నొక్కుకొన్న నొ
క్కులు తన ప్రేమగాఢతకు
కోమల చిహ్నములై తనూస్థలిన్
నిలిచెను ; నేడుకూడ ధర
ణీరుహ ! తత్ స్మృతియే పునఃపునః
కలన గలంచునో ! తలిరు
గన్నుల నీరొలికింతు వానిపై !!

వలచినవాడ, వంత సహ
వాసము నేలినవాడ, వామె నీ
తలపయి పూలు పోసిన వి
ధమ్ము మనోజ్ఞము నాడు ; నేడు నీ

తలపున పూలు పూచెడు వి
ధమ్ము మనోజ్ఞతరమ్ము ! పట్టి క
న్నులకు కనంగ రా వవి ; వి
నూత్న వసంత వయో విశేషముల్ !

తరువర ! ప్రేమబంధము వృ
థా యగునా ? తనుము క్ష యయ్యు, దా
విరహిణి గాన, నే విపిన
వీథుల లోన తపించు చున్నదో
పరమ శివానురక్త యగు
పార్వతి వోలెను ! అల్లదే – వికృ
స్వర కలకంఠి నీ పయిని
వ్రాలిన దెవ్వతెయో రసార్ద్రయై !

కోయిల కంఠమెత్తి, కల
కూజితమై నిను గూడి పాడు నీ
కోయిలయే భవాంతర సు
ఖోన్నతి పొందిన నీదు వల్లికా
ప్రేయసి యేమొ ! నిన్ను తన
ప్రేమ సులోక విలోకన ప్రభున్
జేయగ బిల్చు నేమొ ! పయ
నింపుము చెట్టుపు మారి పిట్టవై !!

## శ్రమ – సఫలత

ఈ మహోదధి ఎవ్వరి హృదియొ ! ఇట్లు
ఎడతెగక కొట్టుకొని, క్రాగి, ఏమి జగము !
ఆత్మ దాహము లోక దాహముగ బెంచి
ఏ ప్రకా మన రగులుచు నింత క్రాంతి !

ఈ విపుల నీరదము లేరి భావగతుల !
ఒరసి, మెరసి, ద్రవించి, ఇట్లోమి జగము !
ఆత్మరసమును జీవరస్యముగ వంచి
ఏ పరమతృప్తి విరజిమ్ము నింత కాంతి !

ఎంతవేదన మరగి వర్షించు నింత
అమృత జీవన మవనీ తలమున ! ఎట్టి
సఫలతకు నైన మూలము శ్రమయె, కాన
శ్రమను చేకొని ముందుకు చనగ వలయు.

## తత్ - త్వమ్

లేదు నాకు వ్యుత్పన్నత ; వేదచయము
ఉపనిషత్తులు, వాని శాఖోపశాఖ
లేమి బోధించునో ఇంతయే నెరుంగ ;
చదువులే లేని నాకు ప్రాజదువు లేడ ?

రైతుబిడ్డను నేను ; బాల్యమ్ము గడచె -
గౌతమీతీరమం దాల గాచుకొనుచు,
ఉబుసుపోక పిల్లనగ్రోవి నూదుకొనుచు,
చదలలో నిన్నె కాబోలు వెదకి కొనుచు.

ఆరిపోవుచు గ్రీష్మ కాలాతపమున,
శారద జ్యోత్స్నలో పునర్జన్మ గొనుచు,
ఉభయ తీరము లంతంత నొరసికొనుచు,
సాగితిని సంజ కెంజాయ వాగులందు.

ఒక్కనాడొక యొడ్డున నుండి - కడమ
యొడ్డునన్ దిలకించితి నుదయ భాను -
కొలని కెందమ్మి కౌగిళ్ళ కులుకుచుండ,
కెంజిగురు మావి పొత్తిళ్ళ కెరలుచుండ.

అపుడు గుర్తించితిని నిన్ను ; ఆత్మనుండి
చూచువారికె కాన్పించు శోభవీవు ;
నీదు వాస్తవికమ్మును నేను ; పొడిచి
క్రుంకుచుందును నీ యిచ్ఛకు తల యొగ్గి.

ని న్నెరింగితి, న న్నెరింగితివి, స్వామి !
ఇంతకన్నను వేదాంత మేమి నాకు ?
ఏటి కెదురీది, మొగమీది మీటమీటి
నీ కళల నిదె సరాసరి దూకుచుంటి.

## మరపు

దారి పొడవున చేతికి తగులుచున్న
చిన్ని యీ పూవు లెట్టి నెచ్చెలుల నాకు !
మరపు లోతుల నుండి ఏ మధుర వాంఛ
లిట్లు రేకెత్తి నిట్టూర్పు నింత తావి !

తనివి తీరని యే లేత యనుభవముల
చెలి కురుల జేరి నొకింత సిగ్గు పడును !
అడుగులను బడి నలిగిపోయెడునివేమొ
పేరు తెలియని ఇన్నిన్ని పేదపూలు !

కుసుమ వనవీథిలో నన్ను గుర్తుపట్టి
తుమ్మెద యొకర్తు నా చెవి గ్రుమ్మరించు
ప్రణయ విజ్ఞప్తు లెప్ప టెప్పటివొ ! నాకు
జ్ఞప్తిరావవి యేదొ సుషు ప్తి మునిగి.

త్రోవ తరుగని వేళ నేదొ చిరునవ్వు,
ఒడ్డు తగులని తరి నేదొ ఓరచూపు,
ఒక్క క్షణ మే యగాధమొ ఉత్తరించి
నీరసపు గుండె నమృతమ్ము నించిపోవు !

ప్రతి నిమేషము నన్నిట్లు పల్కరించు
సుందరాంశకు మెలకువ చెందగోరి –
విస్మృతి ద్వార బంధాలు విప్పుకొనుచు
వెలుగు చీకట్ల మధ్య పర్వులిడు చుండి !

## తూనీగ

లేతరంగుల పువ్వులో, సీతకోక
చిలుకలో, చెప్పలేను మా యలరుదోట !
వానజల్లనలేను - శ్రావణము కూడ
పట్టుతేనెలు కురియు మా పండ్లతోట !

పూవుపై నుండి పూవును పొందునట్టి
తుమ్మెదయొ, కొమ్మపై నుండి కొమ్మపైకి
రాగసుధ జిమ్ము పిక మొ చిరాశయముగ
జీవి భరియించ గలదెంత శీతు వైన !

ఏమె ! తూనీగ ! నీ జాతి ప్రేమరీతి
కొంచె మైనను ఒంటబట్టించు కోవు ?
పిచ్చి రేగిన గతి రేగి, విచ్చలవిడి
గాలి మేడలను గట్టు కార్య మేమి?

పద్మమందిరములు ద్విరేఫములు వెదకు,
నీవు గడిపెదు ముళ్లకంచెలనె బ్రతుకు ;
గానమా రాదు, సరసత యైన లేదు,
సుందరివి కావు, ఎట్లు గైకొందు నిన్ను ?

నన్ను వేధించు, నైన, మాండవ్యమునికి
కొరత వేయించి నట్టి నీ దొరతనమ్ము
ఆటవస్తువు లెల్ల గిరాటు పెట్టి
క్రీడకై నిన్నె చేరు నా ప్రియ తనూజ !

సంతసముగ, సీతాఫల శాఖి క్రింద,
చాటుచాటుగ, మెలమెల్ల, జరిగి జరిగి,
దొంగ కైవడి నామె నీ తోక నదిగొ
పట్టుకొన బోవుచున్నది – పారిపొమ్ము !

## ప్రేమలేఖ

చెలిమి నీవు నాటి, వలపున నీర్వోసి
పెంచు మనుచు చెప్పి వెళ్ళినట్టి
మల్లె తీవ నీవు మరలివచ్చెడు దాక
కోరకింప ననుచు కూరుచుండె !

సకియ ! అందువలన జాగుచేయక వచ్చి,
మల్లె పల్లవింప మనుచు కొనుము ;
నిన్ను జూడ బెంగగొన్న మామిడి గున్న
వ్రాయు మనగ, లేఖ వ్రాయు చుంటి !

శిశిర మాసాదికైనను చేరవలయు,
నిష్ఠుర మ్మింక నాపైని నిలుప వలదు ;
చెప్పలేకుంటి దానిమ్మచెట్టు మీది
చిలుక బాలెంత కుశల ప్రశ్నలకు బదులు !

## శ్రావణ కోకిల

ఆమని పోయి ఒక్క ఋతు
వైనను కాదు ; మధు వ్రతాలతో
తామరతోట గట్ల సర
దాగ విహారము సల్పుచుండి, నా
కోమలి నిన్ను కోరి వెద
కున్ – వెదకున్ – వెదకున్ ; అయారె, నీ
వీ మునిమాపు పంచ తపి
యించుచు, కించన గూరుచుంటివా !

చివురుల జారు తేనియల
చిన్కులె కాయము వంచి, మాసదృక్
కవుల కలాలు సూదులయి
కర్ణపుటమ్ములు చీల్చు సాధు జీ
వివి గద ! కుంభవృష్టికి, వి
భీకర మేఘ గభీరగర్జ, కా
యువు నరచేత బట్టి యెటు
లుంటివొ చీకటి చీకు చింతలన్ !

శారిక పాడుచున్న దదె,
సల్పుచు నున్నవి గోష్ఠి కీరముల్,
చారువసంత దేవతనె
శ్రావణ మందును గొల్చుకొంచు ; శృం

గారముగా మయూరము లో
నర్చు మనోహర నృత్యరీతులన్
తీరిచి దిద్దుకొన్న దవ
నీ సతి పుష్ప శిరోజ బంధముల్ !

నాటి యుషఃపరాగ పవ
నమ్ములపై పరిఫుల్ల హ్రాల్లతా
వాటిక తేలి, అభ్యుదయ
పర్వత శృంగ రసాల శాఖపై
మీటిన నీదు పాటయె సు
మీ, – అల పశ్చిమపార్థివాంధకా
రాటవులందు మేలుకొలు
పైనది ! లేచటుకేసి చూడుమా !

పూవులు కల్గవా ? తడిసి
ముద్దగ మూలుగు మావి కొమ్మలన్
జీవము వోయవా, పారుగు
నేరెడు – తంగెడు ? ఏ విభావమం
దే విపరీతమున్ గలుగ ;
దింద్ర ధనుస్తటి నీతటిల్లతల్
దేవత లొత్తిగించుకొని
తెత్తురు నీకనురాగ మాధురుల్ !

కాలము గాని కాల మని -
ఖాతరు చేయని లోక మందు - మా
ర్మాలకు బోవుటింతయు పు
రోగతి కాదు ; సమగ్ర సత్కళా
శీలివి నీవె కాలమును
చేకొని సాగనిచో ప్రపంచ మే
లీల తరించు ? ఎట్లు విద
ళించు భవాంతర పారతంత్ర్యముల్ ?

పాడెద వేని నీ విపుడు
పంచమ గాన విపంచి మీటి, ఈ
నాడె వసంతసుందరి ఝు
ణంఝుణ నాట్యము చేయగల్గు ; మా
వాడల నున్న మామిడులు
వైనము గన్గొని నిన్ను భోజనా
క్రీడన వైభవాల నల
రించును ; లెమ్మిక ; కంఠ మెత్తుమా !

## కంటక నిర్వేదము

ఒక్క తల్లికె జన్మించి, ఒక్క ప్రేమ
డోలికను జేరి లీల నుయ్యాల లూగి,
పెరుగు చుంటి మొకేరీతి విరుల తోట !
అలరు చెల్లెల ! నన్నేల అంటుకోరు ?
నీ కొరకె వచ్చు నల చంచరీక సఖులు,
మలయపవనుడు నీ మీదె మనసు నిలుపు,
రాగకాలము నిన్నె గారాము సేయు,
ఎవ్వరును చూడనున్ జూడ రేల నన్ను ?

నీవు సౌందర్యఖని వని, నీవు మధుర
హృదయ వని యేమొ చేర వచ్చెదరు నిన్ను !
ఉర్వి నా గతి నా చేత నుండె నేని
ముల్లుగా పుట్టియుందునా – పువ్వు గాక ?

## లతాలతాంగి

పుష్కలమ్ముగ పువ్వులు పూచినావు,
నా హృదీశ్వరి బోలి యున్నావు నేడు !
నీవు నా భావ మపహరించితివొ ! ఆమె
ని న్నపహరించి నాముందు నిల్చినదియొ !

పాడు చున్నది కోకిల – జాడ లేని
సరళి – జ్యోతిర్మహాలింగ శిరము నుండి
వోలె ; సల్పుచున్నవి ద్విరేఫాలు యాత్ర
విమల కుసుమాలయాలు సేవించు కొనుచు !

మధువు భూషించు, ఆషాఢ మనునయించు,
ఆశ్వయుజ మాదరించు, పుష్యము రహించు ;
నీవు ధీరవు ; ఎన్ని సంసేవనముల
సల్పుచును పోవు విశ్వరాజ్యమ్ము నీకు !

మించి శిశిరర్తు విల కౌగిలించినను, వ
సంత మెద దహించినను, వర్షాభ్ర రుచులె
మ్రోడు పడినను, నేను నీ నీడ జేరి
నీవలెనె నిత్యసంతోషినై వసింతు !

## పురుషోత్తముడు

ఎన్నో భావి శుభాలు బుద్బుదములై -
ఎన్నో సుఖస్వప్నముల్
సున్నాలై - చితికెన్ ; వసంతసుమనః
శోభావకాశమ్ములున్
గన్నీరై ప్రవహించె ; మిత్రజను లా
నందమ్మునన్ సాగ - ఆ
పన్న త్వాంబుధి మున్గి పోయినవి నా
వల్ నీ వియోగమ్ములో !

గారాబమ్మున బాల్యమందు మన సాం
గత్యమ్ము - గోదావరీ
తీరప్రాంతము లందు నాటి మొలకె
త్తెన్ రమ్యమై ; నారికే
ళారామమ్ముల శీతలామృతజలా
లన్ పూచి, సౌరభ్యముల్
ప్రారంభించియు నాడె ధూళి బడి కాం
చన్ రాదు మర్త్యాటికిన్ !!

అనుకోలేదు - అటు కౌగిలించుకొని బా
　　ల్యానంద బాష్పమ్ములన్
నిను మీ యూరికి బంపు నప్పు - డిక నిన్
　　వీక్షించు భాగయమ్ము లే
దని ; దీపావళి నాకు చీకటుల ప్రో
　　పై నిన్ను భక్షించునం
చనుకోలేదు ; ఎటుపోతివో ? ఎచట నే
　　మైపోతివో మాయమై ??

చూతక్ష్మాజము నీడ నిల్చి, కరముల్
　　జోడించి, సంక్రాంతికిన్
నీతో నుందును, పాపముందు సభలన్
　　జేయింత మంచెంతయున్
జేతన్ జేయిడి పోయి, రావు, సఖుడా !
　　స్నేహంపు ధర్మం బిదో ?
స్వాతంత్ర్యమ్మె లభింపదో నరుని వాం
　　ఛాసిద్ధి కీ పృథ్విపై ??

ఎలా తీరని వాంఛ లిన్ని మదిలో
　　సృజ్యమ్ములా జీవికిన్ !
కాలన్ శృంఖలముల్ దగిల్చి, కదలం
　　గానీక బంధించి, స్వే

చ్ఛాలోకమ్ముల మానసమ్ము విహరిం
చన్ జేయు దౌష్ట్య, మ్మిదే
వ్యాళమ్మో ! ఇటు లేచెడున్ ప్రకృతి కే
లాడించు మంత్రాంగమ్మై !

నాకున్ గన్పడకుండ పోయితివి ; ఏ
నాడైన ఈ యాకు రా
లే కాలమ్మును రాలిపోవు గద ? ఆ
ప్లేనైన రాకుందువో ?
నీకున్ ధర్మము, వాంఛయున్ గలిగి యుం
డెన్ ; నన్ను నీకో – నినున్
నాకో కూర్చెడి ప్రేమపాశములు పే
నంబడ్డ వా రాత్రులన్ !

ఈ మాకందము – నీడ నొంటరిగ న
న్నీక్షించి ఏడీ, చెలీ !
నీ మిత్రుం డని ప్రశ్న సేయు ! ఇపుడే
నే మందు ? ఎందుంటివో
యీ ? మన్నించి యెరుంగ జెప్పు మని నే
నే వాకిటన్ బిల్తు ? ఏ
భూమిన్ బొబ్బలు పెట్టుదున్ ? హృదయమున్
ద్రోయింతు నేకాటిలో ??

చలువల్ నీడల జాడలేని అడియా
        సల్ పెల్లుగా నెండమా
వుల వోలె న్నడిపింప, ఈ బ్రతుకుతె
        ర్వుల్ వట్టి పర్వెత్తుచున్,
అలపుల్ దీర్చుకొనంగ నప్పుడపు డం
        దం దాగి, నీ సంస్మృతిన్
చెలి ! పూరింతును కోష్ణబాష్పములతో
        స్మృత్యర్థకాసారముల్ !

అదిగో కోయిల పాడుకోదలచి, చూ
        తాగ్రమ్ముపై కూరుచు
న్నది ; నన్ బోలెడి దుఃఖజీవు లిట నుం
        డన్ రాదు ; ఆ గౌతమీ
నదిపై నావతెరల్ ననున్ తొలగు మ
        న్నట్లాడు ; నా కెందుచూ
పెదవో వేకువ ? సాగుచుంటి నెట నీ
        పిల్పున్ ప్రతీక్షించుచున్,

(1932 లో దీపావళి బాణసంచాకు బలియైన పురుషోత్తం అను మిత్రుని గురించిన బాల్యస్మృతి)

## సెలయేటి పాట

ఉద్భవించితి నేను మహోగ్ర శైల
నికట కాంతారమే పుట్టినిల్లు గాగ ;
కరకు పాషాణములె, తీవ్ర కంటకములె
లీలతో నాకు పురిటి యుయ్యాలలూపె !

కఠినశిలలను మృదుతల్పకముల జేసి
తుమ్మదొంకల తోడ స్నేహమ్ము నెఱపి,
నీ ప్రణయ సుధాధారల నిత్యవృష్టి
తనియుచున్ వచ్చినా నింత దనుక, దేవ !

పుట్టినప్పుడె అనుకొంటి – పూర్తిగా మ
దీయ జీవన యాత్ర నీ దివ్యపాద
కంజములు చేరునో, లేదొ కడ – కటంచు ;
నాయునికి, నన్ను జూచుకొన్నప్పు డెల్ల
ఏదొ అనుమానమునకె లోనౌదు నేను !

కేవలము దట్టమై, అడుగిడిన కొలది
నాదు వేగము నాపుచున్నయది పృథ్వి ;
సాగిన కొలంది యెమొ నా శక్తి లోని
సునిశితత్వము నాశిల్లు చున్నదౌర !

స్వామి! నిత్యము నీ కరుణామృతమ్ము
కుండపోతగ నా పైని కురియ దేని,
పోడ్మి నాలోన వరదలు పొంగ దేని,
ఏ యెడారులనో బడి యెండి పోదు!

కరుణ గురిసెడు నీ వాన గల యొకొక్క
చిన్కు నుండి నాలోన వీచిక యొకొక్క
టుద్భవించును, సాగు నొక్కొక్క యడుగు ;
ఎడతెరపిలేక నీవు వర్షింతు వేని
అడుగు నాపక సాగింతు యాత్ర నేను !

మధురగతి నీవు నీ సుకుమార హస్త
నీరజమ్ముల నన్ను మన్నింతు వేని,
జీవనమ్మును సఫలమ్ము జేతు వేని,
బ్రతుకు బ్రతుకెల్ల నీ కృతజ్ఞత వహించు.

నాథ ! నీనుండి జీవననవ్యసుధను
పుష్కలమ్ముగ గొని, యెందు బోదు నేను ?
మనుగడకు నేది ఫలము ? గమ్యస్థలమ్ము ?
గట్లరసి పొంగిపారుచు, కర్మభూమి
సారవంతము జేయుచు, సస్యములకు
జీవనమ్మును గూర్చుచు, చేరుకొందు –
కమల కల్హార నయన పర్వముగ నేను
సర్వ జీవనపతి వైన స్వామి నిన్ను !

## బోదెగట్టున

సస్యసుశ్యామలం బైన శ్రావణమున,
చిత్రజలశోభితములైన చేల మధ్య,
కలువపూబోదెగట్లలో గడ్డి కోయు
బాల యెవ్వతొ – లోలోన పాడుకొనెడు !

నీలనీరద సౌధాంతరాల లోన
వరుణ గురునొద్ద నృత్యమ్ము గరచుచున్న
మించుకన్నియ ప్రతిఫలియించు నేమొ
యీమెగా ! అద్దమట్లున్న యీ తలాన !

ఆమె కేవల మొక చిన్ని యాటవెలది,
ఈమె జనపద గీతమాలా మనోజ్ఞ !
ఆమె కాదీమె ; ఈమె నేత్రాంచలముల
కాంతిశకలములే తటిత్కాంత హయలు.

హాయి ! ఈ బాల గానరవామృతమ్ము
సస్యవదనాలు క్రొందేనె జల్లు గురియు ;
మలయమారుత మధుమాస మధురిమమ్ము
పైరుదుబ్బుల పొంచి పొంగారు నోహ !

పడతి పాదాల చెలిమిచే పంటబోదె
నీలి నీరాలు నృత్యభంగిమలు నేర్చు ;
పర్వులిడి వచ్చు తత్పాద పద్మసరళి
చరమదిగ్గిరి నిర్ఝరీ సంచయమ్ము !

కోయు కొలదియు మొలకెత్తు కోమలంపు
పల్లవముల నే యాకలి చల్లబడునొ !
పాడుకొలదియు రేకెత్తు పాట లోని
హల్లకముల నే యుల్లము తల్లడిలునొ !

జీవితభరాలు కుంచిన శిరము పైని
జల్లుచున్నది ముత్యాలు సస్యలక్ష్మి !
మబ్బుకొంగలు ఛత్రచామరము లగును,
ఈమె రాణి జగమ్మున కీ క్షణమ్ము !

## పంజరములో చిలుక

ఈ నవోదయమునం, దీప్రభాతమున,
నా తోడివార లా చూతవనాల
స్వేచ్ఛా విహారము చేయుచుండెదరు ;
నా పాపమో యిది ! నా వారి గూడి
కూర్మితో మన నోచుకోనైతి నకట !
ఫలరసం బాని పాటలు పాడుకొనుచు,
అలపు నెరుంగ కాటలు నాడుకొనుచు,

మామిడితోటలో మధ్యాహ్న మందు
విహరింప నేతెంచు ప్రియులు రంజిల్ల,
బాటసారుల దారిబడలిక వాయ,
చిన్నిబిడ్డలవేడ్క చివురించి విరియ,
సృష్టి నెల్లను రొమ్ము జేర్చి హత్తుకొని
వనలక్ష్మి యే పారవశ్యము నొంద,
మంజుల సరణుల మధుర రీతులను
వెలయించు చుందురు వివిధరాగములు ;
నా పాపమో యిది ! నా వారిగూడి
కూర్మితో మన నోచుకోనైతి నకట !

చిన్ననాటనె నన్ను చూపట్టి తెచ్చి
రంగురంగుల పంజరమ్ములో పెట్టి
పప్పు బెల్లములతో, పంచదారలతొ,
తీయని పండ్లతో, పాయసమ్ములతొ,
పెంచుచున్నారు ప్రేమతో నరులు ;
నా కపూర్వమ్ములౌ నవభాష లేవొ
బోధించు చున్నారు బాధలు పడుచు.

పంజర మ్మిది యెంత బంగారు దైన
నా కిది బందిఖానా కాదె తలప ?
పరులింత యిడునది పరమాన్న మైన
నా కది భిక్షాన్న మే కాదె చూడ ?
పరభాషలో నెంత పరమార్థ మున్న
నా కది యంధకారమె కాదె యెంచ ?
మనుజసంఘము మధ్య మనుచున్న గాని
తోడునీడయు లేని దుఃఖిని గానె ?
పరబాధ తెలియని బాలకు డెవడొ
తెరువు బోవుచు, నూడబెరికి, తీరమున
బార్వైచి పోయిన పద్మమ్ము రీతి
పస వీడి, నే నిట్లు వసివాడి యుంటి ;
ఏమిటో యీ బాధ, ఎందుకో నాకు ?

నా వారితో గూడి నవఫలమ్ములను
తిను భాగ్య మెన్న డబ్బునొ గాని నాకు !
నా వారితో పోయి నవచూతములను
మను భాగ్య మెన్న డబ్బునొ గాని నాకు !

చివరి కొమ్మల నుండి చివ్వున నెగసి
కేరింతతో సంజ కెంజాయ నొరసి,
కైలాస గిరి జేరి గంగాభవాని
దూముడి పూదేటితో చెల్మి నెరపి,
నెలవంక వంకలో నే గూడుకట్టు
కొను భాగ్య మెన్న డబ్బునొ గాని నాకు !

స్వేచ్ఛ లేని విహంగజీవిత మ్మేల ?
పారతంత్ర్యమ్ములో బ్రతుకుట బ్రతుకె ?
రెక్క లుండియు లేని బక్కజంతువుగ
కోర్కె లుండియు లేని కువలయ మ్మట్లు
పడియుంటి నేటి కీ పంజరమ్మందు !

ఎప్పు డీ పంజరము తెగి త్రుప్పుపడునొ !
ఎన్న డాకాశ వీథుల కెగిరిపోదు
నో – మదిచ్ఛకొలంది నవ్యోత్సవమున !
ఎన్నినాళ్ళు ! ఈ దాస్య మింకెన్నినాళ్ళు !

(స్వాతంత్ర్య లబ్ధికి పూర్వము, దేశదాస్య విముక్తిని కోరి)

## ముళ్ళకంప

నావలెనె నీవు లోకపు త్రోవ లోన
ఏ విచారముతో పడినావొ కాని,
నను వలెనె ప్రక్క కీడ్చి వైచినది నిన్ను
చింత దరికొల్పి కాల్చివైచినది జగము !

ఏ విమోహన మధుర కేళీవనాల
ఘుమఘుమ సుమించి తావులు గుప్పినావొ !
వరవరానన లే రాణివాసములల
నిను కవుంగిట జేర్చి మన్నించినారొ !

గుర్తులేని లోకము త్రొక్కుకొనుచు పోయి
నీ పవిత్రజీవితము తన్నినది కడకు ;
గతమును మరచి వర్తమానతను గొలుచు
నైజమున కీవు బలియైతివే జగాన !

నీ విపుడు భస్మ మైనావు ; నిన్ను తిరిగి
కమ్మతావుల జేర్చును గంధవహుడు ;
మరచిపోకుము నన్ను, నా మలిన రుద్ర
వాటి చెంతకు నితరు లెవ్వరును రారు.

# శ్మశాన లక్ష్మి

వికచ బాలాబ్జవాపికలందు దోసిళ్ళ
కోష్ణాంబువులు జల్లుకొన్న వేళ,
ఫలభరితామ్ర శాఖల దాగి పికముల
వెక్కిరించుచు పండ్లు మెక్కు వేళ,
దూరాన కొబ్బరితోట మకాముల
మసకచీకటి మించి మసలువేళ,
చైత్రప్రభాత ఝంఝామారుతములతో
పర్వెత్తి పంతాలుపడిన వేళ,

ప్రతిఫలమ్మున కింతేని ప్రాకులాడ,
కొండొరుల జూచుకొనుటయె పండు వగుచు,
గంటలును రోజు లేండ్లును గడపినట్టి
చెలిమి, నెచ్చెలి ! నా కెప్డు స్మృతి గలంచు !

దేవత వంటి సుందరివి,
దివ్యము నీ మృదుమానసమ్ము ; భూ
దేవి యెటుల్ భరించె పడ
తీ ! తన చీకటికడ్పులో నినున్ ?

నీవట కూడ రాణి వయి
నిల్తు, వెరుంగుదు నేను ; కానిచో -
ఆ వెలుగేమి ? మల్లియల
యందము లేమి శ్మశానవాటికన్ !

ప్రేత భూత పిశాచ విభీత మనుచు
భస్మ కంకాళ భరిత భీభత్స మనుచు
నాడు రోసితి మరుభూమి ; నేడు నీకు
స్థానమై యది - నాకు నుద్యాన మయ్యె !

అందములను, ప్రియరాగా
నందములను మన్ను జేసి, నానావ్యథలన్
గుందించెడు రుద్రస్థలి
సుందరమై యొప్పు నాకు సుదతీ, నీచే !

వారులు పోల్చి, యౌవన ప
థాభిముఖమ్ముగ తప్పటడ్గులన్
జారుచు నున్న డింభకుడ -
నాకును, పూచినతీగ - నీకు, ఆ
తీరని రాగబంధ మెట
దెచ్చెనొ దైవము ! నాటి నీ ప్రస
న్నారుణ పద్మరాగ హృద
యాలయ మిప్డు పురాణ మయ్యెపో !

( ఒక బాల్య స్మృతి )

## నా భావ జగత్తు

కమలాకరమ్ముల కన్విచ్చు నపుడు నీ
చేతోరుచికి సుప్రభాత మగుచు,
నవధాన్య సీమల నర్తించు నపుడు నీ
పదముల మంజీర పదవి యగుచు,
విశ్వాంతరాళాల విహరించు నపుడు నీ
రమతకు రమ్యాంగ రాగ మగుచు,
మణిముక్త శయ్యల మై చేర్చు నపుడు నీ
కలలకు నిజ రూపకల్ప మగుచు,

దేవి ! నీ యిచ్ఛ కొలది మూర్తిగొని, నిత్య
నూత్న శోభల నిన్ను సంతోషపరుప
కట్టుకొంటి నీ భావ జగత్తు నిట్లు ;
పాద మిడు మిందు ; లేదిందు బ్రతుకు బరువు.

## ప్రవాసి

పవలు పనిపాటు లందు నిబ్బరము గూర్చు,
రేలు కలలందు సహజ సంతృప్తి నొసగు,
చాల దవ్వయ్యు, నా కతి సన్నిహితము
స్వర్గమును బోలె నా ప్రియ జన్మభూమి !

చిన్నపుడె రుచులెల్ల పంచి యిడి నట్టి
యేటిగట్టులు, కొబ్బరితోట గట్లు,
గున్న మామిడి తోపులు, జన్న చేలు,
పాలపిట్టలు, పిచుకలు, పరభృతాలు ;

మావి కొమ్మల కోతికొమ్మచ్చి యాట,
బీటి పొలములలో చిత్రబిళ్ళ, రాత్రు
లందు బలిగుడి యుప్పాట, లతిశయించి
ఝుళ్ళుమనిపించు బాల్యంపు జ్ఞాపకములు !

మిత్రులను గూడుకొని గౌతమీతటాల
హాయి విహరించు నాటి సాయంతనములు,
తీరవనముల నుండి వీతెంచు సౌర
భములు, గీతులు, పారవశ్యమున ముంచు !

నాకు నా మాతృభూమికి నడుమ గలవు
అద్రిపంక్తులు, నదులు, తోయధులు ; కాని
డెందమున నిర్వరము నొక్కచంద మగుట,
తల్లిలో నేను – నాలోన తల్లి – వెలయు.

ఈ ప్రవాసజీవితములో నెట్టి భాగ్య
మునకు నే నోచుకొన్న – నా జనని పాద
పీఠమున దానినెల్ల నర్పించి వైచి
తృప్తి వసియింతు నామె గీర్తించుకొనుచు.

వివిధ మాధుర్యములతోడ వెల్లివిరిసి
జగము పాలింప వలయు నా జన్మభూమి,
ఖైదుకొట్టులు లేని, శృంఖలలు లేని,
స్వేచ్ఛ నా తల్లి నుదురు చుంబించ వలయు.

లోప మెరుగని నా తల్లి లోకమునకు
నాయకత్వము గొని ముందు నడుచు వేళ
నీవు నేనును నామె సన్నిధిని నిల్చి
ప్రభు ! గ్రహింతము విశ్వనీరాజనమ్ము !

## పల్లెబ్రతుకు

మామిడితోపుల మధ్యాహ్నములును,
సరసీతటమ్ముల సాయంతనములు,
రుచిగొంటివా నవర్తువు నెప్పుడైన ?

అలరువనాల వెన్నెలరేల సొబగు,
చల్లని నీడల స్వప్నాల రాణ,
చవిచూడగా దలంతువ యేని – రమ్ము !
ప్రేమపూరములైన గ్రామసీమలకు !

నెచ్చెలీ ! దూరభారాలు గ్రుచ్చుగాక,
పల్లెటూళ్ళ తోటల లోని బ్రతుకె బ్రతుకు,
పండ్లు తినుచున్న వేళనో – పనటి బట్టి
మొక్కలకు సంజలందు నీర్వోయు నపుడొ !

## కృష్ణాన్వేషణ

తీవల, తీవపూల, పువు
తెర్వుల, తెర్వుల సందుసందు, బృం
దావన మంతయున్ వెదకి
నాను – సమీప సరత్సరి త్తట
శ్రీవిలస త్తరంగ సుఖ
జీవనముల్ పరికించినాను – నా
దేవుడు రాధికా హృదయ
దేవుడు పోయిన నాటి శర్వరిన్.

తీవెలు పల్లవించె ; నన
దేరెను రెమ్మలు ; పూలకొమ్మలున్
తావులు జల్లె, కోయిల యు
థారుచి గానము చేసె ; నిర్ఝరీ
ప్లావిత సైకత స్థలము
లందున గెంతుచు లేగదూడలున్
త్రావెను మాతృదుగ్ధమధు
రామృత మెప్పటి రీతి ప్రీతితో !

ప్రియకాళింది యథాపురాగతిని ఊ
　　ర్మిక్వాణ నిక్వాణ సం
చయముల్ పెల్లుగ నాట్యమాడునది, చిం
　　తాలేశమే లేక ; ని
శ్చయ, మీ రేయికి లేదు దుఃఖ మొక లే
　　శమ్మైన ; జ్యోత్స్నాకరో
దయ శుభ్రాంబర భూషితాంగి యయి,
　　సౌందర్యమ్ము లూరించెడిన్ !

తెల్లగ చీకటిన్ గడిగి
　　తేర్చెడి వెన్నెల కేమి లోటొ ? నా
యుల్లము నిండియున్న విర
　　హోజ్వల దుఃఖతమమ్ము వాపగా
నొల్లదు ! తత్పరీత సుమ
　　నో మధుమత్త మరుద్వయస్వినీ
పుల్లకరాబ్జ మాలికలు
　　పో ! నను చేరగ బిల్చు కేళికై !

వేరై, నన్ వెలివేసి, కృష్ణవిరహా
వేశోగ్ర శోకాగ్నిలో
నీరై పోవగ జేసి, స్వైరగతులన్
క్రీడింతు వేమే ? వసం
తారామం బెటు లౌదు మాఘమున ?
లేదా ప్రేమ ఆవంతయున్ ?
నా రాధాపతి లేడు నేడు, వలదా
నందమ్ము, బృందావనీ !

మరచితి వేమొ గోపసుకు
మారుని ? మారుని గన్నతండ్రి ? నీ
విరులకు నిల్వునన్ పదును
పెట్టిన ప్రేయసు ? నీ ప్రియాళికిన్
పర మురళీరవానునట
నమ్ములు నేర్పిన దేశికప్రభున్
మరచితివేమొ ? విశ్వవిభు ?
మావిభు ? గోవిభు ? గోపికావిభున్ ?

మురళీగానము విశ్రమించదు ; నవో
త్ఫుల్లోత్పల ప్రేమ వ
ల్లరులన్ డిగ్గవుగా యికన్ బ్రియుని
లీలల్ ; రాసకేళీ మనో
హర నృత్యమ్ముల ఆనవాళ్లయిన
మాయన్ లేదు ; షట్పాద గీ
త రహస్సుల్ విడిరావు ; కృష్ణు నెటు
బృందా ! విస్మృతిన్ బందితే ?

పూవుల్ పూచుచు, పుష్పగంధములతో
పూజింతువేదేవు, నా
దేవుం డెక్కడ ? శూన్యమందిరమునం
దేలా, యువాళీ పికా
ళీ విస్ఫారిత కంఠమాధురుల కే
ళీ కాంతు లల్కింతు ? వో
పూవుంబోణి ! వృథా శ్రమింతు, వెది నీ
పూజాఫలం బుర్విపై ?

బాలరసాల ! మంజుదళ
 పాటల ! దేవుడు లేని శూన్య దే
వాలయగర్భమం దెవరి
 కై యిటు పైమరపొంది యాడెదు ? అ
య్యో ! లలితేశు డేడి ? ప్రణ
 యోన్నతి నీ ప్రమదమ్ము మెచ్చి, కెం
గేలను గ్రుచ్చి, ముద్దుగ నొ
 కించుక ముద్దిడి, ముద్దుసేయగన్ ?

ప్రణయానంద సుధా మరందపము, పు
 ష్పం బైన నీలోన, ని
ల్పెను దా జీవిత మెల్ల ; కాలగతి ధూ
 ళిన్ కాయమున్ ద్రోచి పో
యిన నే, డాతని త్రోవ నీకు తగుగా ;
 కీరీతి క్రీడింతువే ?
ప్రణయేవుండు గతించినన్, ప్రణయి
 భావం బిట్లు రంజిల్లునే ?

ప్రేమము సత్యమేని, ప్రియ
కృష్ణునిపై కలదేని నీకు, ఆ
రామమణీ ! ఇదేమి యను
రాగము ? రాగ ఝరీ ఝణంఝణ
శ్రీమధు నృత్యమేల నిటు
చేసెదు ? మోడువుగమ్ము, నీరద
శ్యామ వియోగ ధూమ పరి
సంహృత సంభృత రాగ శాలివై !

అని - కృష్ణున్ దలపోసి, నే నటు వియో
గాభీలతన్ దూలి, మా
ప్రణయక్రీడల జాడలన్ గనుచు, పో
వం బోయి, నిల్చుండి, లే
వను కూర్చుండను లేక, దుఃఖ భవ బా
ష్పారుద్ధకంఠమ్మునన్ -
తను కానట్లు వినోదముల్ సలుపు బృం
దావాటి కిట్లాడగన్ ;

నను గని, నా వియోగ దశ
    నారసి, నా సలహాను మంచిగా
గొని, కడుజాలిగా, కనుల
    కోనలు చెమ్మగిలంగ, బృంద - క్రొ
న్నన వలె చిన్నగా విరిసి
    నవ్వుచు, న న్నొడిజేర్చి, యిట్లనెన్ -
వనరుహాగర్భ గర్భిత న
    వ భ్రమరీ భ్రమణ స్వరమ్మునన్ !

బాలా ! కృష్ణుని కోసమేల పరితా
    పం బింత ? ఏమాయె గో
పాలుం డెక్కడ బోయె ? పోయిన తద
    ధ్వం బీవు కన్గొంటివే ?
మేలే ? స్వామిని వీడి తయ్యె ?
    హృదయం బీమాత్రమే ? ప్రేమ లే
దే ? లోలాత్మవు గావె కృష్ణునెడ ?
    చెల్లీ ! ఎంత నిర్భాగ్యవే ?

ప్రాణప్రాణము బాలకృష్ణు డటు పో
వన్ కూడ బోలేక, ని
ద్రాణావస్థ వియోగతాపమను వ్య
ర్థవ్యాధి నీ కేల ? పూ
బోణీ ! నా కొక రెప్పపాటయిన దే
వుండిట్లు మాటైనచో
ప్రాణమ్మప్పుడ పోవు, పోవు నపుడే
ప్రాపంచిక మ్మెల్లనున్ !

నీకున్ గృష్ణుడు లేడె ? నాకు గలడీ
నీ పావ నీజావళిన్
నీకున్ జూపుదు జూడు - మంచు, తన
హృన్నీరేజమున్ విప్పినన్ -
వాకల్ వాకలుగా జనించి భువి
సర్వద్రవ్యముల్ ముంచి బ్ర
హ్మాకారమ్మగు తేజ మొక్కటి ప్రద్యు
శ్యమ్మయ్యె నా కయ్యెడన్ !

కన్నులు నిండి, తత్ప్రణయ
కాంతి జగత్తున పల్లవింప, సం
పన్నత జూచినాను ప్రతి
పాదున, పువ్వున, సౌరభమ్మునన్,
మన్నున, మిన్ననన్, వలపు
మాధురు లల్కెడు కృష్ణ రూపమున్ -
కన్నుల నుండి విశ్వమును
కాంత మొనర్చెడు దివ్యరాగమున్ !

నా నాథుం డటు లాత్మరూపమున, నా
నా వస్తుసందోహమున్
దాసై యుండుట, పారవశ్యమున, నే
నన్నే తదాస్వాదనా
నూనానందమునందు ముంచుకొని - ఓ
హో ! కౌగిటన్ గ్రుచ్చితిన్ !
సూనాస్త్రమ్ముల గ్రుచ్చుకొంటి నెదయున్ ;
చూపింతునా గాయముల్ ?

ఈ నిమిషమ్ము నందు కని
పించును నాకు ప్రసన్నమూర్తి, యే
సూనము నందు, నే మధుప
సుందర యౌవన మందు, నే లస
ద్గానము నందు, నే వలపు
కన్నుల కోరిక లందు, కోరుకొ
న్నా నని నంత ! నాకు, మరి
నాథునితో నెడబాటు లేదికన్ !!

అది విభ్రాంతిగ కొట్టివేయకుము ; నా
థా ! యంచు నే బిల్చినన్
ఎదలో ప్రేయసి ! యంచు తోడనె జవా
బిచ్చున్ ; వినన్ వచ్చు, నో
సుదతీ ! కాంచగవచ్చు నీవును సదా
జ్యోతిర్మయున్, ప్రేయసున్ ;
ఇదిగో, ర మ్మిటు ! కౌగిలింపుము ననున్ !
సేవింత మద్వైతమున్ !

( కృష్ణ నిర్యాణమును విని దుఃఖించు రాధకు బృందావని ఉపదేశము,
ఆత్మసాక్షాత్కారము )

## కుంకుడుచెట్టు

హేమంతమున పూచె దీవు తుల్లముగ,
నవమాస మట్లది నా కగుపించు ;
ఆ పుష్ప సందోహ, మా సౌరభమ్ము,
ఆ భృంగసంఘాత, మా మధూత్కరము !

నీ కొమ్మ క్రింద పిందెల నేరునపుడు
ఆమని వేళల మామిడిపిందె
లేరు వేడుక కల్గు నెంతయు నాకు,
భేద మించుక లేక ప్రీతి యొసంగు.

నా కిది హేమంతమే కాని, నీకు
చైత్రమే యిది మన్కి సఫలమౌ గాన,
మిత్రాళి నిను జేరి మెలగును గాన,
బంధుసంతతి గౌరవము జూపు గాన,

చిన్నదై నీ కాయ చేదుదే యైన
సత్యశౌచాదుల సాధువే యౌను,
చేదుకాయలు కాయు చెట్టువే యయ్యు
మధువునే నీ పూలు మహి కిచ్చి మనుచు !

కుంకుడుచెట్టు ! నీ కోమల హృదయ
మెంత సురసవంతమో కాని !
నవ శరచ్చంద్రికా ధవళత నొంది
పరుని మేధస్సునే పరిశుభ్రపరచు !

భోగిపండుగ నాడు ప్రొద్దుట చలికి
వణకుచు తలయంటుకొని, మంట జేరి,
పొంగలికై చూచు బుడుతల శుభ్ర
చిత్తము లొసగు నాశీస్సు నీ కెపుడు.

చేదుకాయలు కాతు, శీతున పూతు ;
ఐనను నీ పూలు తేనె తెట్టియలు,,
లోకసం సేవనశ్రీకర మ్మెడద,
నీనుండి నరు డెంత నేర్చుకో వలయు !

## మేకపిల్ల – పూలమొక్క

చేయి వీచితి వేమొ, పిల్చితివె యేమొ,
నా పరోక్షము నందు కొందలము పొంది
పూలమొక్క ! పెల్లాకట పొగులు నొక్క
మేకపిల్ల మెల్లన నిన్ను మేయ దరియ !!

అది యాకలి గొన్నది ; నీ
యెద బెదరిన, దార్చినదియు ; ఇంతయు నెదియో
రొదవోలె గాని – పూర్తిగ
ఇది యని వినబడక పోయెనే నా చెవికిన్ !

మే యని, ఛెంగునన్ వెడలి,
మీదికి దూకెడి మేకపిల్ల నిన్
మేయునదేమి ? చిల్పితన
మే యనుకొంటిని ; ఒక్క తీగకున్
ఆయువు మూడె నంచు కన
నైతిని ; నా యెద క్రుంగు హేతు వే
దో యెరుగంగ రాదు – ఎద
తో యెద పెట్టు మొరాలకింపనో !

సహృదయాహ్వాన మాలించిన హృదయమ్ము
విధిని గుర్తించి మనసుకు వెల్లడించు ;
మనసు గుర్తింపజాలని మందబుద్ధి
విశ్వసాహితి కర్థమ్ము విప్పుటెట్లు ?

ఎల్ల భువిని రంజింప పుష్పించు తీగ,
మేకపిల్ల పూదీవను మేసివేయు,
మేకపిల్లనె దినిపోవు మృగము డెవడో,
తవిలి తనుదానె తినుచున్నదా జగత్తు !

## బంతిపువ్వు

వాసన మించు పువ్వు, సహ
వాసమె రూపముగొన్న పువ్వు, బల్
వాసియు వన్నె ముద్దుగొన
వాకిట నున్నది లక్ష్మి వోలె ; దూ
ర్వాసుని కూతురా ! ఎవతె
వమ్మ ? ఎటన్ జనుదెంచి తమ్మ ? నీ
కోసమె పూచె నన్నటులు
కోసెద, వెంతటి గండ్రగొయ్యవే ?

కలదు గులాబిపూ, వల మొ
గల్ మహరాణులచేత పాదపూ
జలు గొనియుంటి నన్న బహు
జాప్యమునన్ ; కల దల్ల మల్లె క్రొ
న్నెల వలరాచబంటునని ;
నీరజమున్ సిరి పుట్టినిల్లుగా
బలిసిన గర్వ పంకమున
భాసిలు చున్నది కోట గుంటలో.

తాతలతో గతించిన శ
తాబ్దుల సుప్త సమాధులందిటుల్
ప్రేతములై ప్రమత్తత జ
రించెడు నిష్కృతి జీవనుల్ సుమ

వ్రాతము లెన్నియో గలవు ;
        వాని గతిబండి విప్లవింప, కీ
మా తెనుగుందనంపు సుకు
        మారత జెండెద వేల నిష్కృవన్ ?

అంతు దరీ యెరుంగని మ
        హా విభవమ్మున పుష్యలక్ష్మి సం
క్రాంతి గృహాంగణమ్మునకు
        రంగులు దిద్దుటకై - నవాంధ్రి సీ
మంత మణీ మనోజ్ఞతల
        మాన్యత నొందెడి బంతిగోరి - హే
మంత నిశాంత వేళల హి
        మాగ్నుల నిల్చి తపించు, చూచెదో !

ఇది రైతాంగపు పువ్వు, శ్రామికులకున్
        తృప్తిన్ బ్రసాదించు వే
ల్పిది ; మా పల్లెకు నెల్ల నందనముగా
        పేర్గన్న దీబంతి పూ
పొదయే ; కోయకు ; కష్టకాలమున, రే
        పున్ మాపు, మాయిండ్ల, మా
యెదలన్, క్రొంజడలన్, కటాక్షముల హా
        యిన్ గూర్చు స్వర్గమ్మిదే !

( పువ్వును పుడుకుచున్న ఒక పడుచు నుద్దేశించి )

## శ్రావణోదయము

మబ్బు కబురంది, వికసిత మానసమున
ధాత్రి విప్పిన అరుణ హస్తాబ్జ పుటల
రసమునుం జిల్కి, జీవనార్థముల దడిపి,
స్వాదువై నిల్చినది శ్రావణోదయమ్ము !

సర్వ జీవన సరిత్సాగర బ్రహ్మ దీ
వ్యద్దివ్యగర్భాన ప్రభవ మంది,
ప్రణయ సందేశ సంభరితమౌ ఆషాఢ
మేఘమండలి లోన మిసిమినొంది,
విద్యుల్లతా నాట్య విభవమ్ము తోడ ము
త్యాల యానమున వాహ్యాళి గదలి,
కృష్ణ గౌతమి పినాకినుల సైదోడుగా
అల త్రిలింగాస్థాని నడుగు మోపి,

పసుపు కుంకుమ పారాణి పంకమందు
పాద పంకజ రేఖలు పరిమళింప,
వానవల్లప్ప లాడుచు వచ్చె – నాంధ్ర
లక్ష్మి వీటికి – శ్రావణలక్ష్మి నేడు.

పరవశమ్మై యథేచ్ఛముగ
పాడుచు, కాలము నిన్నదాక సుం
దరము శివంకరమ్ముగ నొ
నర్చిన కోయిల మూగనోముతో
నరిగిన దత్తయింటి కిపు
డల్లన నల్లన - కొ(్రయెన్ను, తా
టి రసము సొర్గైకొని, శ
రించుచు నేరెడు క్రొంజిగుళ్ళపై.

పికము లేదన నేల, పెల్లుగా క్షేత్ర ప్ర
తముల విన్పడదె మాధవుని గీతి ?
వలిగాలికై బెంగటిలనేల, లేదె మం
గళ శుక్రవార సుగంధ శోభ ?
పూలతోటల విహారాలపై తల పేల,
కలుగవే పేరంటముల పిలుపులు ?
పనస, మావి, యనాస పండ్లపై మనసేల,
లోటె శీతఫలాలు, తాటిపేసెము ?

ఆమని విశేష విభవమ్ము లగుపడ వని
చింత వలదు ; సీతాకోకచిలుక, లళులు,
బీరపువ్వులు, పాదులు, పైరుచేలు
కలవు శ్రావణి ! నీకు స్వాగతము పలుక !

గడ్డిపువ్వుల నుండి కైకొన్న దగుగాక
తేనెకు తక్కువా తియ్యదనము ?
లంక డొంకల మేతలం గొన్న దగుగాక
పాడికి లోటటో పచ్చదనము ?
మార్మాల పల్లియ మర్రిదే యగుగాక
ఇగురుకు కొరతయా యెర్రదనము ?
ముంపుడుకోనేట మొలిచిన దగుగాక
కలువకు వెలితియా కలికిదనము ?

పత్రముల, పూల, ఫలముల, పానకముల,
ఆటపాటల మా పల్లె యాడుపడుచు
లారతులు పట్టి నిన్ను పేరంటమునకు
పిలుచు చుండిరి, బొట్టును పెట్టుకొమ్ము !

వరవర్ణుల్, కృషికామినుల్, చిలుక గో
ర్వంకల్, లతాగుల్మముల్,
వరగల్, కొర్రలు నారికేళవనముల్,
వాగుల్, నదుల్ – విశ్వమే
వరదై పొంగుచు, తెన్గు తల్లి యొడిలో
వాంఛల్ విజృంభింప – నీ
వరలక్ష్మీ వ్రత మాచరించు సుభగ
త్వప్రాప్తికై తృప్తిమై.

ఎండవానల నందు నెడనెడ పడు జల్లు
జిలిబిలి కెంబట్టు చీరగాగ,
పడమటికోన నేర్పడిన ఇంద్రధనుస్సు
జడచుట్టలో పూలసరముగాగ,
మొయిలురెప్పల క్రింద హాయలుమించెడి మించు
సొబగైన కడకంటి చూపుగాగ,
మూనమూనకు చాల ముద్దుముచ్చట లీను
వరిచేలు కుచ్చెళ్ళ వరుసగాగ,

శిలల గరగించి పరతెంచు సెలలు, నదులు,
పంటకాల్వలు, బోదెలు – పదసరోజ
మంజుమంజీర రవసంభ్రమములుగాగ,
కొలువు తీర్చి పాలింపు మీ తెలుగు నేల !

ద్విజులు దివిజులె యౌదురు – ద్విత్వ మైన
యక్షరము నింత విడదీసి యందు మేని ;
మానవులు ద్విజులౌట నీ మహిమ కాదె ?
నూలుపున్నమ పున్నెంపు నోము నీది !

ఊడ్పుమూన యందు, నుయ్యాలపద మందు,
మొక్కజన్నపొత్తె మోవి యందు,
రైతు తలపు నందు – రాజిల్క బల్కించు
శ్రావణమ్ము భావి జీవనమ్ము !

చాతుర్మాస్యము, జీవనాత్మకము ; స
స్యశ్యామలారమ్యమై
నీతో వచ్చి, సమస్త భూతములకున్
చేకూర్చు సౌభాగ్యముల్ !
చేతోమోదము, నేత్రపర్వము, జగ
చ్ఛ్రేయమ్ము నీ రాక ; నీ
గీతల్ మా ధనధాన్యరాసు, లివె మా
కేల్మోడ్పు లర్చావిధిన్ !

## అర్ధనారీశ్వరుడు

తరుణి ! నాకు పురాణ పురుషుల లోన
నచ్చిన వాడర్ధనారీశ్వరుండు ;
తనువునం దర్ధ మర్ధాంగి కొసంగి
అలరు నతండు ద్వంద్వాతీతు డగుచు !

కడుపులో కరుణయు, కంఠాన విషము,
అగ్ని లలాటాన, నౌదల గంగ,
జడలోన జాబిల్లి, మెడలోన నాగు
వైరుధ్యముల సమన్వయరూప మతడు !

కల్పాంత భిదుర భీకర రాత్రి నైన
హాయిగా తాండవ మాడు నతండు,
విలయమం దైనను విడువ దాతనిని
అల కాలమే తానయౌ బాలగౌరి !

కొండపై యమృతంపు కొలకు వీచులకు
అనురాగ మలది నారవని బాలింప,
గుండె గుమ్మమునకు కుంకుమ పూసి
మనము పాలింత మీ మధుమాస నిశలు !

# తొలిపైనము

పుట్టువు లెన్నిటన్ మనము
పూజతగా, మరి పిట్టజంటగా
పుట్టితిమో, నదీనద వి
ముగ్ధ తటీ వనవాటులందు ! ఏ
పట్టుల నెట్టి మంజుల సు
వాసనలన్, రుచిరంపు గీతులన్,
దట్టితిమో – ఎరుంగము, వృ
థా తలపోతయు ; నేడు సర్వమున్

తట్టుచు పోవుచుంటిమి సు
ధా మధురమ్మగు ప్రేమవీచికల్
గట్టులరాయ, కాలపరి
ఖావళి గండ్లు పడంగ, స్వేచ్ఛగా !
ఎట్టి పథమ్ములో, స్థితుల,
ఏ ఘటనాఘటన ప్రకారమో !
పట్టినదెల్ల వేణువుగ,
పాడినదెల్ల మనోజ్ఞగీతిగా,

మెట్టిన దెల్ల రంగముగ,
మేదిని రమ్యవిహార భూమిగా,
చుట్టి చరింత మీ విపుల
సుందర జీవన విశ్వమెల్ల, నే

చట్టము లెక్క చేయక, ఉ
షస్సఖి తోడుగ, నెందు నే తమో
ఘట్టము లేక, సుందర వి
కస్వర గానకళా స్రవంతిలో

గట్టులు పొర్లుచున్, నురుగు
గట్టిన రాగము మూడు సంధ్యలన్
ముట్టి విచిత్ర సృష్టులకు
మోసులు దిద్దు దరస్మితమ్ముతో !
చిట్టచివారు కొమ్మపయి
చేరిన పుష్పము దించి, సంభ్రవుం
బట్టను పూడిపోయిన ప్ర
మోహనరత్నము నెత్తి, కోర్కె హం

బట్టున గ్రుచ్చి తాల్చెదము
మంగళ సూత్రము వాడకుండగా !
ఎట్టిగతిన్, స్థితిన్, మనకు
నెట్టి వియోగము లేదు ; కాగడా
పట్టి పురోగమింత మిక
పాడుచు నాడుచు నెమ్మి, నెచ్చెలీ !
జట్టుగ లోకమెల్ల మన
జాడల నీడల విశ్రమించగన్ !!

## నీడ

పెద్దమామిడి కొమ్మలో పికముకండు
చివురు గీరుచు, తన రామ జీరుచుండె ;
ఆ సరోవర తీర దూర్వాసనమున
తరుణు డొక్కడు లాలించు తలిరు చెలిని !

ఇమ్మధు మాస మనోజ్ఞ వ
నమ్మున కావలి పొలమ్మునం దొక కృషికుం
“డమ్మా” యని పిల్చెడు నే
యమ్మాయినొ ! సావధాన మయ్యెను దిక్కుల్ !

మండెడు నాకటితో బ్ర
హ్మాండమునే మ్రింగవచ్చు మార్తాండునిపై
మండిపడు కష్టజీవుని
గుండియపై నిల్చె నెండ కృషి రూపమునన్ !

ఉత్తర దిక్కులో జలద
మొక్కటి మామిడి చెట్టుగాగ – పూ
గుత్తుల ముత్తెపుంగొడుగు
కొమ్మల, నావలె నూగు చొక్కడా

యెత్తున నుండి లోకముల
నేలుచు నుండెను ! రమ్యమైన యా
చిత్తరు పేరిదో ? ఎవరి
చిత్తము ! భావము ! ఏ యభీష్టమో !

నేను కూర్చున్న యీ చెట్టు నీలినీడ
బ్రతుకు కోనేటిలో చెట్టు ప్రతిఫలించు ;
దాని కొమ్మల తలక్రిందుగా నుయాల
లూగు నాతడు – నాబైట నున్న నేనె !

అపర సంధ్యావేళ నాకాశమందు
పైనమైపోవును పక్షులు రెండు ;
నీరెండలో తమ నీడలు భూమి
పై పడు పలుపాట్లు పట్టించుకోవు !

వెలుగునకు నీడ తగులదు,
వెలుగే లేకున్న నీడ వెలయదు, ఎట్లున్
వెలుగే నీడకు మూలము,
వెలుగునకున్ బోవునీడ వెలుగై తీరున్ !

మెట్టదున్నిన చేలలో మెరకలందు
మేటి వరికుప్ప లెసగు భూమీతలమ్ము
తారకా మండలము తలదన్ని నిలుచు !
దేని కెది నీడయో, జాడ తెలియలేము !

స్వేచ్ఛలేక, అసలు చేతనయే లేక,
నేను కదలు నపుడ తాను కదలి,
నేను దారిబోవ - తాను కంచెల బోవు,
గట్లు బోవు, నీడ చెట్లు బోవు !

ఆ నెర మబ్బులందు, కసు
లాకరమందు, పొలమ్ములందు, ఉ
ద్యానములందు నా యడుగు
నం దడుగుంచుచు, ప్రేమశీలయౌ
చానయవోలె, నీడ విడ
జాలదు నన్ను నిమేషమేనియున్ !
దీని చరిత్ర వెన్కగల
దీధితి కే పరమార్థ మున్నదో !

తరుణోత్సవకేళి, జరా
భర బాధావేదనాళి, ప్రతినిత్యమ్మున్
పరతంత్రజీవి నే నె
వ్వరికైనను నీడనేమొ ! వాస్తవ మేమో !

ఏ వెలుగే విభాతమున
నెవ్వరి దీప్త మొనర్చి చేసెనో
ఈ విపుల ప్రపంచమును !
ఏ నొక నీడనొ ! నా స్వయంప్రభా
దేవికి సేవలో పగటి
దివ్వెనొ ! సత్య మదెట్టి దైననున్ -
జీవికి జీవి నీడయగు ;
నీడకు నీడయె జీవితమ్మగున్.

# మాతోట

ప్రొద్దున నీర్వోయు ముద్దుల జోతిపై
బురద చిమ్మిన మొక్క మోదె గట్టె ;
చిలుక సంగోరు పీల్చిన పండు పడి యిందె
నిలువెల్ల రసగంధ మలదు కొనియె ;
రేయింబవళ్ళొక్క రీతి తీయని హాయి
గూర్చె నీ మరుమల్లి గుబురు మనకు ;
మందారముల తేనె మరగి యీ జాడనే
మధుప దంపతులట్లు మసలినాము ;

ఎండనక, కొండనక, ఈ మహీరుహాల
జాడలను కోతి కొమ్మచ్చి యాడుకొనుచు,
తోటలో జచ్చి విసిగించు దొంగపసుల
తరిమి యలసిన రోజులు తలపు నిండు !

ఈ మైలాపురి మావికొమ్మలను హా
యిన్ జేరి తూగాడుచున్,
ప్రేమానంద సుధా తరంగములలో
క్రీడించుచున్, మాధవ
శ్రీ మధ్యాహ్నపు వేళలందు మన దృ
ష్టిన్ వ్రాలి గొంతెత్తు నా
రామాభ్రమప్రియగాయనీ మణులు లే
రా, నేడు రా రేలకో !

ఇసుకగుంటల నుండి యిన్నిన్ని నీళ్ళు
మురుకు లగుదాక తోడి, యిర్వురము నెంత
కష్టపడి పోసినాము మొక్కలకు ! నేడు
పెద్దవయి పల్కరించ నీ మొద్దుచెట్లు.

చెంత చేరుటతోనె సీమచింతలు కంట
కాలి దాచుకొని ఫలాల నొసగె,
చెట్టెక్కినంతనె శీతలుడై గ్రీష్మ
పవమానుడే కొమ్మ పట్టి యూచె,
ప్రణయాలస ప్రచారముల జక్కినవేళ
కాకమైనను పండు కనికరించె,
చీకటి రేల్గూడ చెంగల్వ మడి నుండి
ఉదయ చంద్రుని కీర్తి ముదమొసంగె,

పూల బాలల గూడి ఉయ్యాల లూగు
కిరణ కాంతలు మనజాడ లరసి - సిగ్గు
పడుచు కాబోలు - కంటి పాపలను దాగి
హాయి గూర్చెడు నీ తరుచ్ఛాయలందు.

ఛాయ కన్పడ కాకాశ శయ్య నడుమ
అనలమును గ్రక్కసాగె సహస్కరుండు !
ఆ దినమ్ముల ఒక్క మధ్యాహ్నమునకు
సాటియే నేటి సర్వర్తు సముదయంబు ?

ఇదిగో మామిడి పండిది ;
ఇది మీ జనయిత్రి చేత నెదిగిన వృక్షా
నిది, ఆమె బ్రతికి యుండిన
సుదినమ్మిది యంచు నెంత శోభించెడిదో !

బిందె బుజాన బెట్టుకొని,
వేసవి మాసపు సంజ వేళలన్
తొందరజేయు మొక్కలకు
తోయములన్ తనివొంద బోయుచున్,
డెందము కందళింపగ క
ఢింది చెమర్చెడి మోము దమ్మితో,
పందురు మాని తల్లి మెయి
వాల్చెడి దీయెడ, జ్ఞప్తియున్న దే ?

పట్టుమని యొక్కగంట కన్పడకయున్న
తల్లడిల్లెడి దానాడు తల్లికొరకు,
ఇలనె నేడామె లేదని తెలిసి కూడ
మరచి మోదించుచున్నదీ మావితోట !

అప్పు డెట్లున్నదో, ఇప్పు డట్లెయున్న
దీ వనమ్ముకు చింత సుంతేని లేదు !
అంకురము లవె, పూవులు నవె, పరీమ
ళమ్ము లవె, తేటు లవె, కోకిలమ్ములు నవె !

ఊరూరు తిరిగి, నచ్చిన
నారుం గొనితెచ్చి, తోట నాటిన తండ్రిన్,
తీరుగ పెంచిన తల్లిన్
ఏ రీతిని మరువ గల్గె నీ వనలక్ష్మల్ !

సేవ చేయించుకొనుటెయే జీవికైన
నైజ గుణమని తోచుచున్నది జగాన ;
క్రొత్త కోసము కేల్చాచు కొనుటె కాని
ప్రాత యేమైనదను మాటె రాదు మదికి !

అనుచు, కంటను తడి పెట్టుకొనుచు, జోతి !
మునుపు మాయమ్మ బ్రతికియుండిన దినాలు
వెనుక మాతండ్రి తోట పెంచిన విధాలు
స్మృతికి గొనితెచ్చి–నన్ను దుఃఖితుని జేసె !

గట్టిగా నున్న యపుడలక్ష్యముగ వాడి
పగిలినంతన పార్వైచు పనటి కన్న
నరుని బ్రతుకేమి గొప్ప ? నూత్నార్థ్వములకు
చిమ్ముకొని పోవు జగ మవశేషములను !

బ్రతికిన యన్నినాళ్ళు పని
పాటుల నుక్కిరి బిక్కిరై, భవి
ష్యతు సరిహద్దు గోడకు ర
యమ్మున ఢీకొని, భగ్నమైన మా

పితరుల హ్రాస్మధూళి వన
వీథుల నెల్ల పరిభ్రమించుచున్
గతమును నడ్డుతీసి - నను
కన్నుల కద్దుకొనెన్ తటాలునన్!

క్షణకాల మట్లు విశ్వా
ర్పణమై, విశ్వాత్మతన్ తరంగితమౌ సత్
ప్రణవమ్ము నిండు కౌగిట
మునిగియు, తోడ్తోన తేలి పూర్ణ ప్రజ్ఞన్ ;

కందొనల నూరి బాష్పముల్ గట్లు పొర్లి
చెక్కిలి పొలాలు ముంచు నాచెలువ మిన్న
నింత యౌదార్య నిట్లంటి ; నెదుట గల్గు
ప్రకృతి మాతకు కేల్మోడ్చి ప్రణతు లిడుచు.

రాలెడి ప్రతియాకు, ప్రతిపూవు దిలకించి
చిరుమల్లె చెట్టేమి చింతపడునె ?
విరిగిపోయిన కొమ్మ మరచి, తక్కిన కొమ్మ
లల వసంతుని గూడి యాడుకొనవె ?
జరిగి పోయెడి ప్రతిక్షణమును ప్రాతపై
క్రొత్తబట్టలు కప్పుకొనుచు పోదె ?
ప్రవహించి పోవు నిర్ఝర మొక్క మారైన
కన్నెత్తి పుట్టిల్లు కాంచగలదె ?

భూతకాలపు కడుపులో బుద్ధదేవు
నస్థికలు కూడ మన్నయ్యె నతివ ! ఏల
సహజ యాత్రను ముందుకు సాగుచుండి
వెనుకదారులు తలపోసి వెర్రిపడెదు ?

కావున నొత్తుకొమ్ము కడ
కన్నుల నూరిన కోష్ణవారి ; శ్రీ
దేవిగ మారిపోయి మన
దృగ్గుచులన్ జనయిత్రి నవ్వుచున్
దా వికసింప, బెంగతగు
నా మన కిప్పుడు ? లేదె తల్లి యీ
పూవుల ? పూవుదేనియల ?
పుప్పొడి రాసుల ? పూర్ణిమార్చులన్ ?

తల్లి లేదని కనులేల తడుపు కొనెదు ?
ప్రకృతి మనతల్లి, తల్లి ప్రపంచమునకె,
పూవుపూవున మధువులు పొందుపరచి
పేరుపేరున బిడ్డల బిలిచిపెట్టు.

రమ్మివిగో మాతృ కరా
బ్జమ్ముల కౌగిళ్ళటంచు-పడతి కవోష్ణా
స్రమ్ముల దుడుచుచు నంటిని
కొమ్మలలో వింటి మంత కోకోరవముల్ !

( చాలాకాలము తరువాత స్వగ్రామమునకు వెళ్ళి, తమ తోటలో
అడుగిడిన దంపతులపూర్వస్మృతి)

## రత్నమాల

మధురము నీ తలంపు, మధు
మాసము నీ యలరింపు, దేవి ! నీ
యధరము నవ్యజీవన సు
ధాసవ పాత్రము నాకు ; ఏ కళా
పథముల బోవుచుండి యిటు
వచ్చెదవో – పలికించి పొమ్ము నా
వ్యథిత హృదంతరంగమున
వాడిన కిన్నెర కన్నె కోరికల్ !

2

ఇలపయి నీవు పట్టి పలి
కింపగ లేనిది పూతిపుల్లయున్
గలుగదు ; నీ యనుగ్రహము
కాదె పికానికి గాయనత్వమున్,
తులసికి పావనత్వమును,
తోటకు రమ్య నవోదయత్వమున్ ?
పలుకుదు నేమొ మీటు మొక
నాటికి నేటికి గాకపోయినన్ !

3

పూవులు పూచు ; పాడుకొను
పోడిమి కోకిలముల్ ; వసంత వృ
క్షావృత మౌను నీ యడుగు
జాడలు సోకి యెడారి యేని ; నా

జీవిత మొక్క టే యెటును
చెందక యున్నది ; నిన్ను కోరి ఏ
త్రోవల బోదు, నే సుధను
గ్రోలుదు, నే తరుశాఖ వాలుదున్ !

**4**

బెంగల గ్రాగి నా బ్రతుకు
బీటలు వారిన తోట ; నీ పరి
ష్వంగము తోడిదే యమృత
వర్షము, నచ్చినరీతి నా మనో
రంగ మలంకరించి నట
రాజును గొల్వగ రమ్ము, దేవి ! నా
ట్యాంగ లతల్ సుమించి విరి
యన్ ప్రణయమ్ము జగత్సదస్సులన్ !

**5**

బీదతనమ్ము చేత కడు
బీడయి యున్నది ; చాలు తోలి, ఏ
పాదిడినన్ ఫలించు నిది
పాటి పొలమ్ము ; భవత్ కృపామృత
శ్రీ దయచేసి నా యెడద
సేద్యము చేయుము రైతుబిడ్డవై
ఓ దరహాస పూర్ణముఖి !
ఓ శరదిందు కళాసరస్వతీ !

## 6

ర మ్మివి నీ పొలాలు, కడు
రమ్యతరాలు ; సర స్తటాల వృ
క్షమ్ములు, పుష్ప శాఖల పి
కమ్ములు ; శోభన గేయముల్ మనో
జ్ఞమ్ములు ; రమ్ము, ప్రేయసి ! ర
సస్వమువై ; అనుభూతి నీడలన్
ద్రిమ్మరు నీ పదాల శుభ
రేఖలు సోకగ నిమ్ము నా యెదన్ !

## 7

ఇది యొక పాటిదిబ్బ, మన
కెందుకు లెమ్మని చూడకుండ పో
యెదవొకొ ! తాగి, తూగి, పరి
గెత్తెడు కాలపు కాళ్లలో భిదా
భిద లయి పోవు మానవుని
ప్రేమల పూర్ణసమాధి యిద్ది, నీ
పదములు సోకినన్ విరియ
వచ్చు వసంతము లీ పునాదులన్ !

## 8

మామిడి పూల వాసనల
మత్తున, నూతన పర్ణశాలలో
మైమరచెంది, జీవితపు
మాధురులన్ కల లందె కాంచుచున్,

కోమలి ! ఈ వసంతమును
గుత్తకు గైకొని యుంటి ; నా హృదా
రామము చాల రమ్య మగు ;
రమ్మొక సారిటు తొంగి చూడుమా !

## 9

తలపున జచ్చి నీవు, సర
దామెయి నాడుచు, పాడుచున్, ప్రవ
ర్తిలు సమయాల - కాల మొక
ప్రేక్షకురాలయి నిల్చిపోవు ; నా
కలలకు నే విరామమును
గల్గదు, నీ పదపద్మ సేవలన్
మలచితి జీవిత మ్మొక స
మస్కృతిగా, కృతిగా, విభూతిగా !

## 10

గారడి చేసి, నా యెదను
గాలిపట మ్మొనరించి, స్వర్ణదీ
తీరము లందు త్రిప్పెదవు ;
దివ్య వసంత మరంద మాధురీ
భారము మోయలేక యెటు
వ్రాలుదునో, వెరపయ్యె ; గట్టిగా
దారము బట్టుకొంటివిగ
దా ? అది గట్టిదియే గదా ? సతీ !

## 11

కన్నుల పండువై విరిసి,
కమ్మని తావులు చల్లి, డెందమం
దున్న అనంత శైవలము
నూడ్చి, వసంతము దెచ్చి, జీవనా
భ్యున్నతి కూర్తువే యనుము ;
ముచ్చట కొక్కపుడైన మోవిపై
క్రొన్ననపై, సుఖింపు మన
కున్న నివన్నియు నెందుకే, సఖీ !

## 12

ప్రేమము శాశ్వతమ్ము, వెర
పేదియు లే, దది నాశమొందదన్
ధీమసమూని ఊరకొనె
దేమొ యజాగ్రత ! ప్రోది నీక, కం
చేమియు లేక, ప్రత్యహము
నీళులు పోయక, చెట్టుకాదు నీ
మామిడి మొక్క ; భద్రము సు
మా, అలసత్వ మనర్థక మ్మిలన్ !

## 13

పుట్టుచు గిట్టుచున్, మరల
పుట్టుచు గిట్టుచు, రోజు రోజునున్
బుట్టలుబుట్టలే పువులు
పూచును వాకిట ; ఈ విధాన నీ

ఘట్ట మనంతకాలముగ
గానుగ యెద్దును బోలి సాగుచు
న్నట్టి, దిదే పురోగమన
మా ? గడియారపు ముల్లుబాపతో !

## 14

చూపున, నేపునన్ ; వలపు
సొంపున, వంపున ; కంటి కింపుగా
ఏ పొలమందొ నీయటుల
నే యగుపించును మించు లేవొ ; నీ
రూపము విశ్వరూపము ; వి
రోధము కల్గదు కాదె – ఎప్పుడే
నేపున నేని, ఏసరసి
నేని ఒకించుక తుంచుకొన్నచో !

## 15

కూటికి, గుడ్డకున్, గుడిసె
కున్ గతి కల్గియు వెర్రులై నరుల్
చేటెడు నేల కోస మని
చేతురు యుద్ధము లెన్నొ ! ఎందుకీ
పాటి ప్రపంచ, మేమి సుఖ
వంతము ? రమ్ము, వరాంగి ! పోటి పో
రాటము లేని నా హృదయ
రాజ్యము పంచుము విశ్వమంతటన్ !

## 16

భయమున్, బాధలు లేని నిర్మల కుటుం
బ స్వాస్థ్య మేనాడు నెం
దయినన్ గల్గెనె ? ఏదో బెంగ, ఏవో చిం
తాక్లేశముల్, భావి యే
మొ యనిర్దిష్టము, శాంతిభద్రతల కా
యుస్సెంతో ఊహింప, మో
ప్రియ ! ఈ మాత్రపు జీవితమ్మునకు ను
ర్విన్ గర్వముల్ చెల్లునా ?

## 17

నా వక్షస్సుఖ తల్పకమ్మున, వసం
తామోదముల్ పర్వగా
నీ వవ్యక్తత నుండ, హాయి మనుచున్
నిర్మించెదన్ స్వప్న హే
లా విశ్వమ్ములు, దివ్యధామములు, లీ
లాభూమికల్ ; వానిలో
నీవు న్నేనె నటింత మేకగతితో
నేకాంతరంగమ్ముతో !

## 18

రే పన్నట్టిది చేతజిక్కె, మనకున్
లీలాశుకమ్మట్టిదై,
నేపథ్యమ్ము మథించి తెచ్చి మన కం
దీయన్ భవిష్యమ్ము ; ప
క్వాపక్వస్థితి గావుకట్టి, రుచులన్
గల్పించి, ఏతత్ఫల
శ్రీ పీయూషము పంచ గోరుదును ధా
త్రిన్ స్వర్గ సౌఖ్యార్థమై !

## 19

ఈ సర్వోదయ సృష్టి కింక మన క
ర్తృత్వమ్మె ; నేడేది యూ
హా సంజన్యము కావ్యకర్త, కదియే
యాథార్థ్యమౌ రేపటన్ ;
ఓ సారస్వతసారసాస్య ! భవదీ
యోదంతమే విశ్వర
థ్యాసారథ్యము ; లెమ్ము, కూర్పుమిక క
ల్యాణ ప్రబంధార్థముల్ !

కోకిలా ! నీ గాన మంతా
కూర్పరాదా సంపుటమ్ముల ?
ప్రణయ రాగరహస్య మేదో
పట్టుకొందునుగా ?

పద్మమా ! నీ భావ మేదో
పద్దియమ్ముల దిద్దరాదా ?
దివ్యజీవన గతికి ద్వారము
తెరచికొందునుగా ?

చూతమా ! నీ శోభ లన్నీ
చూపరాదా కావ్యరీతుల ?
రసపయోనిధి లోతులోతున
మిసిమికొందునుగా ?